www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 359 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7.56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10.09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: శే. ఉ. 7.45 వరకు, అమృతఘడియలు: మ.2.57-4.23, దుర్ముహూర్తం: ఉ.8.41-9.30, మ.12.44-1.33, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 6.24

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

Cheil-25291/25

www.andhrajyothy.com

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 359

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డీసీసీలే పార్టీకి ఫ్రంట్ వారియర్స్

మీరు దూతలు కాదు.. పార్టీకి రక్షణ రేఖలు

బలహీన వర్గాలపై దాడుల నిర్మూలనకే కుల గణన.. డీసీసీ అధ్యక్షుల భేటీలో ఖర్గే

కాంగ్రెస్‌కు జిల్లా అధ్యక్షులే పునాది: రాహుల్

తెలంగాణ, ఏపీ సహా 13 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల డీసీసీల సమావేశం

10

కక్ష సాధించే వాడినైతే..

కుటుంబమంతా జైల్లోనే!

ఇవాళ అసెంబ్లీలో కూర్చుని మాట్లాడేవారు కాదు

ఎంపీని 16 రోజులు ఒంటరిగా బంధించారు

జైల్లో రాత్రి నిద్ర పోకుండా లైట్లు వేసి వేధించారు

పదేళ్లలో బీఆర్ఎస్ రుణమాఫీ రూ.16,908 కోట్లే

పది నెలల్లో రూ.20,616 కోట్లు మాఫీ చేశాం

పదేళ్ల పాలనను మా పది నెలలతో పోల్చండి

అభినందించాల్సింది పోయి కడుపులో కత్తులా?

కేటీఆర్ గుంటూరు తెలివితేటలు ఇక్కడొద్దు

పల్లెటూళ్లో చదివి సీఎం అయ్యానని నాపై అక్కసు

ప్రాజెక్టులు కట్టింది మీ ఫామ్ హౌస్‌ల కోసమే

ఎక్కడెవరు కొన్నారో నిజ నిర్ధారణ కమిటీ వేద్దామా?

కేటీఆర్, హరీశ్ రావులకు పార్టీ కుర్చీపై ఆశ

నేపాల్ తరహాలో కేసీఆర్‌ను తప్పించే కుట్ర

బడ్జెట్‌పై చర్చలో సీఎం రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. ఆ కోపాన్ని

మిగతా 12వ పేజీలో...

లేని రంకులు అంటగట్టినప్పుడు

నీతులు గుర్తు రాలేదా?



భార్యాపిల్లలు, కుటుంబాలు మీకేనా?.. వేరేవాళ్లకు ఉండవా? 12

మా ఇంట్లో పిల్లలపై బూతులు మాట్లాడింది ఈ ముఖ్యమంత్రి కాదా?

సీఎంకు ఇంత అసహనం, ఆవేశం, నిస్పృహ ఎందుకో అర్థం కావట్లేదు

ఆయనలో ఒక అపరిచితుడు దాగి ఉన్నాడు.. ప్రతీకారంతో మీకే నష్టం

తెలంగాణ జాతిపిత ముమ్మాటికీ కేసీఆరే.. బూతుపిత రేవంత్ రెడ్డే!

ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ధ్వజమెత్తిన కేటీఆర్

లోక్‌సభ సీట్లు పెంచొద్దు!

కేంద్ర చర్యల్లో పారదర్శకతేదీ?.. అందర్నీ సంప్రదించే నిర్ణయించాలి

రాష్ట్రాలవరకే పునర్విభజన.. రాష్ట్ర అసెంబ్లీ సీట్లు 153కు పెంచాలి

శాసనసభలో తీర్మానం ఆమోదం 13

కేంద్రం వినకపోతే పోరాటానికి కూడా సిద్ధం: సీఎం రేవంత్

అవయవ దానం బిల్లుకు అసెంబ్లీ ఆమోదం 12



6,729 మంది ఔట్

పదవీ విరమణ చేసి, కాంట్రాక్టుపై పనిచేస్తున్న వారిపై వేటు

రేవంత్ సర్కారు సంచలన నిర్ణయం

అటెండర్ నుంచి ఐఏఎస్ దాకా తొలగింపు

జాబితాలో మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి

వైటీడీఏ వీసీ కిషన్‌రావు, సీఈ బీఎల్ఎన్ రెడ్డి, పది మంది ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు కూడా..

సేవలు అవసరమనుకుంటే కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి, మళ్లీ అవకాశమివ్వాలి

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పురపాలక శాఖలోనే 177 మంది తొలగింపు

6 వేలకు పైగా ఉద్యోగ నియామకాలకు చాన్స్

ఉద్యోగులకు పదోన్నతులు లభించే అవకాశం!

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒక్కరు కాదు.. పదులు, వందలు కాదు.. ఏకంగా 6,729 మందిని కొలువుల్లోంచి తొలగించారు. పదవీ విరమణ పొందాక కూడా.. తెలంగాణలో కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న వారిని ఇంటికి పంపుతూ రేవంత్‌రెడ్డి సర్కారు తీసుకున్న సంచలన నిర్ణయం ఇది. ప్రభుత్వం ఒక్క ఉత్తర్వుతో 6,729 మందిని ఇంటికి పంపింది. ఇలా తొలగించిన వారిలో అటెండర్ మొదలు.. ఐఏఎస్ అధికారి దాకా ఉండడం గమనార్హం..! ఈ జాబితాలో మెట్రోరైల్ ఎండీ



ఎన్‌వీఎస్ రెడ్డి

ఎన్‌వీఎస్ రెడ్డి, యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ(వైటీడీఏ) వైస్ చైర్మన్ జి.కిషన్‌రావు, కన్సల్టెంట్ ఇంజినీరు బీఎల్ఎన్ రెడ్డి.. పది మంది ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెలాఖరుకల్లా అందరినీ తొలగించాలని ఆదేశించారు. ఇలా తొలగించిన వారిలో ఎవరి సేవలైనా అవసరం అని భావిస్తే.. వారిని పునర్నియమించుకోవడానికి తాజాగా నోటిఫికేషన్, ఉత్తర్వులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్కారు సంచలన నిర్ణయంతో కొత్త నియామకాలకు మార్గం సుగమమవుతుందనే ప్రచారం సచివాలయ వర్గాల్లో జరుగుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులతో మునిసిపల్ శాఖ వెంటనే చర్యలను ప్రారంభించింది. తమ శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై కొనసాగుతున్న 177 మంది విశ్రాంత ఉద్యోగులను తొలగిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని తక్షణమే తొలగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ జాబితాలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్

మిగతా 3వ పేజీలో...



సర్కారీ సహకార్ ట్యాక్సీ

ఓలా, ఉబెర్ వంటి అగ్రిగేటర్లకు పోటీగా..

రానున్న కొన్ని నెలల్లో అందుబాటులోకి!

లోక్‌సభలో కేంద్ర మంత్రి అమిత్ షా

డ్రైవర్లు తమ లాభాలను పెద్ద కంపెనీలతో పంచుకోవాల్సిన పని ఉండదని వెల్లడి

ఇప్పటికే 'యాత్రీ సాథీ' పేరుతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన బెంగాల్ సర్కార్

కమీషన్లతో పనిచేస్తున్న ప్రస్తుత అగ్రిగేటర్లు ప్రయాణికులపైనా చార్జీల బాదుడు 2

వాటికి 'సహకార్ ట్యాక్సీ'తో అడ్డుకట్ట!



పుతిన్ త్వరలోనే చనిపోతాడు

అప్పుడే యుద్ధం ఆగిపోతుంది

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వివాదాస్పద వ్యాఖ్యలు 2

త్వరలో భారత్‌కు పుతిన్

రష్యా విదేశాంగ మంత్రి ధ్రువీకరణ

'పది' ప్రశ్నల లీకేజీలో 14

11 మందిపై కేసు

8 మంది అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

పరారీలో ముగ్గురు, వారినీ అరెస్టు చేస్తాం

కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర వెల్లడి

సర్కారు ఖాతాతో కార్పొరేషన్ల

రుణాల చెల్లింపా?

అలాంటి చెల్లింపులతో ఖాతాలో డబ్బులు ఉండట్లే

ప్రభుత్వ పుస్తకాల్లో గ్యారెంటీ అప్పులు కనిపించట్లే

చెల్లింపులు మాత్రం దర్శనమిస్తున్నాయ్!

గ్యారెంటీలు ఇచ్చినందుకు సర్కారుకు ఫీజు ఏదీ?

మొత్తం రాష్ట్ర అప్పులు రూ.6.24 లక్షల కోట్లు

కిస్తీలు, వడ్డీల చెల్లింపులకే 15.90% సొమ్ము

పరిమితికి మించి అప్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

2023-24కి రాష్ట్ర ఆర్థిక స్థితిపై 'కాగ్' నివేదిక



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ల పేరిట సేకరించిన రుణాలకు ప్రభుత్వ ఖాతాల నుంచి అసలు, వడ్డీలు చెల్లించడాన్ని 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' తప్పు పట్టింది. ఇలా చెల్లించడం వల్ల ప్రభుత్వ ఖాతాలో సరైన నిల్వలు ఉండడం లేదని ఆక్షేపించింది. కార్పొరేషన్ల పేర తీసుకుంటున్న గ్యారెంటీ రుణాలు ప్రభుత్వ ఖాతాల్లో ఎక్కడా కనిపించడం

మిగతా 13వ పేజీలో...



దేవన్నపేట పంపుహౌస్ వద్ద మోటార్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

దేవాదుల ప్రారంభం

మోటార్ ఆన్ చేసిన ఉత్తమ్, పొంగులేటి.. ట్రయల్ రన్ విజయవంతం

దేవన్నపేట, ధర్మసాగర్‌లలో గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు

2026 డిసెంబరుకల్లా దేవాదుల పూర్తి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

దేవాదులపై దశాబ్ద నిర్లక్ష్యం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి 14

భూముల అమ్మకాలను ఆపండి



కంచ గచ్చిబౌలి.. హైదరాబాద్‌కు ఆక్సిజన్ వనరు

పచ్చని చెట్లు, వైవిధ్య జీవ జాతుల నిలయం

అక్కడ కాంక్రీట్ జంగిల్ వస్తే నగరానికి ముప్పు

ఆ స్థలం వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి 14

సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

పుతిన్ త్వరలోనే చనిపోతాడు

» అప్పుడే యుద్ధం ఆగిపోతుంది: జెలెన్‌స్కీ



కీవ్, మాస్కో, సియోల్, మార్చి 27: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పుతిన్ త్వరలోనే చనిపోతాడని, అప్పుడు తమ ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ఆగుతుందని అన్నారు. ఈ యుద్ధం కొనసాగాలని రష్యా కోరుకుంటోందని, దీన్ని ఆపేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పుతిన్ ఆరోగ్యంపై నిరంతరం వదంతులు వస్తున్న నేపథ్యంలో బుధవారం పారిస్‌లో యూరోపియన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలో మందుపాతర పేలిన ఘటనలో రష్యా ప్రభుత్వ టీవీ జర్నలిస్ట్ అనా ప్రొకోఫీవా (35) మృతి చెందారు. ఆమె కెమెరామన్ దిమిత్రి వోల్కోవ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఉక్రెయిన్ సరిహద్దున ఉన్న రష్యాలోని బెల్గోరోడ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. మరోవైపు.. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు ఉత్తర కొరియా మద్దతు కొనసాగిస్తూనే ఉంది. ఇప్పటికే సైనిక సాయం అందించిన ఆ దేశం తాజాగా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సుమారు 3వేల మంది అదనపు దళాలను రష్యాకు పంపించిందని దక్షిణ కొరియా సైన్యం గురువారం వెల్లడించింది. అలాగే మరిన్ని క్షిపణులు, ఆర్టిలరీ గన్‌లు, మందుగుండు సామగ్రిని కూడా పంపుతోందని, యుద్ధ పరిస్థితిని బట్టి ఆయుధ సరఫరాను మరింత పెంచవచ్చని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ తెలిపారు.

త్వరలో భారత్‌కు పుతిన్

మాస్కో, మార్చి 27: రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్ రావాలన్న ప్రధాని మోదీ ఆహ్వానాన్ని తమ దేశాధినేత అంగీకరించారని రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ గురువారం తెలిపారు. 'రష్యా ఇండియా: టూవర్డ్స్ బైలేటరల్ ఎజెండా' పేరుతో రష్యా ఇంటర్నేషనల్ అఫైర్స్ కౌన్సిల్(ఆర్ఐఏసీ) నిర్వహించిన సదస్సులో లావ్రోవ్ మాట్లాడుతూ.. పుతిన్ భారత పర్యటనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే పర్యటన తేదీలను మాత్రం ప్రకటించలేదు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి రష్యాలోనే పర్యటించారని లావ్రోవ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా మోదీ పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించారని తెలిపారు.

అత్యవసర సరుకులు సిద్ధం చేసుకోండి

» యుద్ధ భయం నేపథ్యంలో పౌరులకు ఈయూ సూచన

పారిస్, మార్చి 27: యుద్ధ భయం నేపథ్యంలో యూరోపియన్ యూనియన్ (ఈయూ) తన పరిధిలోని 45 కోట్ల మంది పౌరులకు కీలక సూచన చేసింది. కనీసం 72 గంటల వినియోగానికి సరిపడా అత్యవసర సరుకులను నిల్వ చేసుకోవాలని సూచించింది. యుద్ధవాతావరణం, డిజిటల్ దాడులు, పర్యావరణ సవాళ్లు, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఈ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపింది. రక్షణ అంశాల్లో తాము సాయం చేయబోమని, సొంతంగా స్వయం సమృద్ధి సాధించుకోవాల్సి ఉంటుందని అమెరికా స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ సూచనలు చేసింది. అయితే అనవసర ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇవన్నీ ముందు జాగ్రత్త కోసం చేసే సూచనలని స్పష్టం చేసింది. ఈయూకు చెందిన సన్నద్ధత, సంక్షోభ నిర్వహణ కమిషనర్ హడ్జా లహ్‌బిబ్ ఈ మేరకు 18 పేజీల భద్రత ప్రొటోకాల్ పత్రాలను విడుదల చేశారు.

25 వేల కి.మీ మేర నాలుగు లేన్ల రోడ్లు

» రూ. 10 లక్షల కోట్లతో పనులు: గడ్కరీ

న్యూఢిల్లీ, మార్చి 27: దేశంలోని 25 వేల కిలోమీటర్ల మేర రెండు లేన్ల రహదారులను నాలుగు లేన్ల రహదారులుగా మారుస్తామని కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రూ.10 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడతామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. 16 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను రూ.6 లక్షల కోట్లతో ఆరు లేన్ల రహదారులుగా మార్చుతామన్నారు. "మేము 10 లక్షల కోట్ల రూపాయలతో 25వేల కిలోమీటర్ల రెండులేన్ల రహదారులను నాలుగు లేన్ల రహదారులుగా మార్చడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇందుకోసం డీపీఆర్‌లు(సమగ్ర ప్రాజెక్టు నివేదికలు) సిద్ధమవుతున్నాయి. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తిచేయగలమని ఆశిస్తున్నాం" అని ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి కొండ ప్రాంతాలలోని రహదారుల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

సరిహద్దు సమస్య పరిష్కారానికి సిద్ధం

» భారత సైన్యంతో కలిసి పని చేస్తాం: చైనా మిలిటరీ

బీజింగ్, మార్చి 27: సరిహద్దు సమస్యకు న్యాయమైన పరిష్కారానికే కాకుండా సుస్థిర, దృఢమైన సైనిక సంబంధాల కోసం భారత సైన్యంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు గురువారం చైనా మిలిటరీ పేర్కొంది. తూర్పు లద్దాఖ్‌లో బలగాల ఉపసంహరణ, తదుపరి ప్రక్రియ గురించి మీడియా సమావేశంలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చైనా నేషనల్ డిఫెన్స్ అధికార ప్రతినిధి చెప్పారు.

ప్రిలిమ్స్ పూర్తయిన వెంటనే కీ ఇవ్వాలి

» యూపీఎస్సీకి పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ, మార్చి 27: సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షలు పూర్తయిన వెంటనే వాటి జవాబుల 'కీ'ని విడుదల చేయాలని యూపీఎస్సీకి గురువారం పార్లమెంటరీ కమిటీ సూచించింది. ప్రస్తుతం మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తయిన తరువాతనే కీ విడుదల చేస్తున్నారని, ఆ విధానం సరికాదని తెలిపింది. ఈ కారణంగా జవాబుల్లో తప్పులు ఉండే సవాలు చేసే అధికారం అభ్యర్థులకు ఉండడం లేదని పేర్కొంది. పారదర్శకత, నిజాయితీ ఉండడం కోసం 'కీ'ని వెంటనే విడుదల చేయాలని తెలిపింది.

సీఏ పరీక్షలు ఏడాదికి మూడుసార్లు: ఇకాయ్

న్యూఢిల్లీ, మార్చి27: చార్టెడ్ అకౌంటెంట్ ఫైనల్ పరీక్షలు ఈ ఏడాది నుంచి మూడుసార్లు నిర్వహిస్తామని ఇకాయ్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) తెలిపింది. ఇంటర్మీడియట్, ఫౌండేషన్ కోర్సులకు మూడుసార్లు పరీక్షలు నిర్వహించాలని ఇకాయ్ గత ఏడాది నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి అమలు చేయనుంది. ఇకపై ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లలో పరీక్షలు రాసే అవకాశం కల్పించారు.

శిశు మరణాల నియంత్రణలో భారత్ భేష్


» పురోగతిలో మార్గదర్శకంగా నిలిచింది: ఐరాస నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 27: శిశు మరణాల నియంత్రణలో భారత్ కృషిని ఐక్యరాజ్య సమితి ప్రశంసించింది. ఈ విషయంలో భారతదేశాన్ని ఓ మార్గదర్శక దేశంగా అభివర్ణించింది. ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొంది. ఆరోగ్య వ్యవస్థకు నిధుల కేటాయింపు ద్వారా లక్షలాది మంది శిశువుల ప్రాణాలను భారత్ కాపాడగలిగిందని ప్రస్తుతించింది. శిశు మరణాల అంచనాపై ఐరాస సంయుక్త బృందం తన నివేదికను ఇటీవల విడుదల చేసింది. శిశు మరణాల నియంత్రణలో ఐదు దేశాలను మార్గదర్శక దేశాలుగా పేర్కొంది. వాటిలో భారత్‌తో పాటు నేపాల్, సెనెగల్, ఘనా, బురుండి ఉన్నాయి. నివారించదగ్గ శిశు మరణాల విషయంలో విభిన్న వ్యూహాలను ఈ దేశాలు అనుసరించాయని, తద్వారా శిశు మరణాల నియంత్రణ పురోగతిలో వేగం పెంచాయని ఆ నివేదిక కొనియాడింది. స్థిరమైన పాలన, అవసరమైన నిధుల కేటాయింపు ఈ స్థితికి రావడానికి దోహదపడ్డాయని తెలిపింది. భారత్‌లో 2000 సంవత్సరం నుంచి ఐదేళ్ల లోపు బాలల మరణాలు 70%, నవజాత శిశువుల మరణాలు 61% తగ్గాయని వెల్లడించింది. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల పెరుగుదల, వైద్యాన్ని అందుబాటులోకి తేవడం, ఆరోగ్య పథకాలతో ఇది సాధ్యమైందని తెలిపింది.

సర్కారీ సహకార్ ట్యాక్సీ

ఓలా, ఉబెర్ వంటి అగ్రిగేటర్లకు పోటీగా.. రానున్న కొన్ని నెలల్లో అందుబాటులోకి..: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 27: ఓలా, ఉబెర్ వంటి అగ్రిగేటర్ల కమీషన్లు, చార్జీల బాదుడుతో విసిగిపోతున్న ప్రయాణికులకు, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కేంద్ర ఉపశమనం కలిగించేలా.. 'సహకార్ ట్యాక్సీ' సర్వీస్‌ను కేంద్రం త్వరలో అందుబాటులోకి తేనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో దీని గురించి ప్రకటించారు. ఈ విధానంలో భాగంగా స్థానిక సహకార సంఘాలే అగ్రిగేటర్ల పాత్ర పోషిస్తాయి. బైకులు, ఆటోలు, క్యాబ్‌లు ఉన్నవారు సహకార సంఘాల వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధాని మోదీ ఎప్పుడూ పేర్కొనే 'సహకార్ సే సమృద్ధి (సహకారంతోనే సౌభాగ్యం)' విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్టు అమిత్ షా వెల్లడించారు. ఈ కాన్సెప్ట్‌ను అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర సహకార శాఖ గడిచిన మూడున్నరేళ్లుగా నిర్విరామంగా కృషిచేస్తోందని షా తెలిపారు. 'సహకార్ ట్యాక్సీ' అందుబాటులోకి వస్తే.. డ్రైవర్లు తమకొచ్చే లాభాలను పెద్ద పెద్ద అగ్రిగేటర్ సంస్థలతో పంచుకోవాల్సిన పనిలేదని.. అవి పూర్తిగా డ్రైవర్లకే చెందుతాయని, దీంతో వారికి మరింత ఆర్థిక భద్రత, స్వాతంత్ర్యం లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బైక్, ఆటో, ట్యాక్సీ సేవలందిస్తున్న ప్రముఖ అగ్రిగేటర్ కంపెనీలు.. ఓలా, ఉబెర్ వంటివి కమీషన్ మోడల్‌లో పనిచేస్తాయి. ఉదాహరణకు ఒక క్యాబ్ డ్రైవర్ ఓలా, ఉబెర్‌లో తన ట్యాక్సీని రిజిస్టర్ చేసుకుంటే, ఆ యాప్‌ల ద్వారా అతడికి వచ్చే ప్రతి రైడ్‌పై దాదాపు 20-30 శాతాన్ని కమీషన్ కింద ఆయా అగ్రిగేటర్ యాప్‌లు తీసేసుకుంటాయి. దీన్ని ఆటో, క్యాబ్ డ్రైవర్లు చాలాకాలంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ దోపిడీని భరించలేక.. బెంగళూరులో ఆటో యూనియన్ ఒకటి 'జస్పే' అనే సంస్థను కలిసి తమకు కావాల్సిన విధంగా ఒక యాప్‌ను తయారు చేయించుకుంది. అదే 'నమ్మ యాత్రి' యాప్. అందులో రిజిస్టర్ చేసుకునే డ్రైవర్లు ప్రతి రైడ్‌కూ కమిషన్ చెల్లించక్కర్లేదు. రోజుకు రూ.25 చెల్లిస్తే చాలు. అన్‌లిమిటెడ్ రైడ్స్ చేసుకోవచ్చు. తీరా రూ.25 చెల్లించాక ఆరోజు ఒక్క రైడ్ కూడా రాకపోతే.. ఆ రూ.25 తిరిగి చేస్తారు. అలా కాకుండా.. ఒక్కో రైడ్‌కూ రూ.3.5 చొప్పున రోజుకు 10 రైడ్స్‌కు రూ.35 చెల్లించవచ్చు. ఆరోజు 10 రైడ్స్ పూర్తయ్యాక వచ్చే మిగతా రైడ్స్‌కు ఏమీ చెల్లించక్కర్లేదు. అదే క్యాబ్ డ్రైవర్లయితే రోజుకు రూ.45, రైడ్‌కు రూ.9 చొప్పున 10 రైడ్స్‌కు రూ.90 దాకా చెల్లించాలి. అలాగే.. పశ్చిమబెంగాల్‌లో మమత సర్కార్ కూడా 'యాత్రీ సాథీ' పేరుతో ఒక యాప్‌ను అభివృద్ధి చేసింది. దాంట్లో నమోదు చేసుకునే డ్రైవర్లు ఎలాంటి కమీషన్లూ చెల్లించక్కర్లేదు. సాఫ్ట్‌వేర్ సేవలు అందించినందుకుగానీ.. రోజులో మొదటి పది రైడ్‌లకు ప్రతి రైడ్‌కూ రూ.10 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అంటే 10 రైడ్స్‌కు రూ.100. ఆ తర్వాత ఎన్ని బుకింగ్‌లు వచ్చినా ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదు. రోజులో ఒక్క రైడ్ కూడా రాకపోతే ఏమీ చెల్లించక్కర్లేదు. సహకార్ ట్యాక్సీ కూడా వీటి తరహాలోనే పనిచేయనుంది.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

ప్రయాణికులకూ మేలు..

ప్రభుత్వమే నిర్వహించే సహకార్ ట్యాక్సీ అందుబాటులోకి వస్తే.. ప్రయాణికులకు కూడా మేలు జరుగుతుందని.. వానపడినా, ట్రాఫిక్ రద్దీ పెరిగినా, పీక్ అవర్స్ పేరిట.. ఇలా రకరకాలుగా బాదుతున్న క్యాబ్ అగ్రిగేటర్ కంపెనీల దూకుడుకు అడ్డుకట్ట పడుతుందని సామాన్యపౌరులు అభిప్రాయపడుతున్నారు. పైగా, పోటీ పెరిగి చార్జీలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. ఉదాహరణకు.. 'నమ్మయాత్రి' యాప్ ప్రభావంతో ఇప్పటికే ప్రముఖ అగ్రిగేటర్ కంపెనీలు ఆటో డ్రైవర్లకు కమీషన్ విధానాన్ని తీసేసి సబ్‌స్క్రిప్షన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చాయి. అందులో భాగంగా ఆటో డ్రైవర్లు రోజుకు రూ.49 చెల్లిస్తే చాలు. ప్రతి రైడ్‌లో వచ్చే లాభాల్లో కమీషన్ కింద 20-30శాతాన్ని అగ్రిగేటర్లకు చెల్లించాల్సిన పని లేదు. ఇవే కాదు.. ఖరీదైన ఫోన్లు వాడేవారికి ఎక్కువ చార్జీలు.. ఫోన్‌లో బ్యాటరీ తక్కువగా ఉన్నా కూడా అధిక చార్జీలు చూపించేలా అగ్రిగేటర్లు చేస్తున్న గిమ్మిక్కులకు కూడా సహకార్ ట్యాక్సీ చెక్ పెడుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. సహకార్ ట్యాక్సీ సర్వీసుతోపాటు, త్వరలో సహకార రంగంలో ఉన్నవారికి ఆర్థిక రక్షణ కల్పించేలా సహకార్ బీమా కంపెనీని ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉన్నట్టు అమిత్ షా గురువారం సభలో వెల్లడించారు.

భారతదేశం ధర్మసత్రం కాదు

» దేశ భద్రతకు ముప్పు తలపెట్టే వారిని రానివ్వం: అమిత్ షా

» వలసలు, విదేశీయుల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 27: భారతదేశం ధర్మసత్రం కాదని, దేశ భద్రతకు ముప్పు తలపెట్టే వారిని భారత్‌లో అడుగుపెట్టనివ్వమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. వ్యాపారం, విద్య, వైద్యం కోసం వచ్చే వారిని, పర్యాటకులను, పెట్టుబడులు పెట్టి దేశ ఆర్థిక ప్రగతికి సహకరించేవారిని భారత దేశంలోకి స్వాగతిస్తామని ప్రకటించారు. వలసలు, విదేశీయులు(ఇమ్మిగ్రేషన్స్ అండ్ ఫారినర్స్) 2025 బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. బిల్లులోని పలు అంశాలు ఇమ్మిగ్రేషన్ అధికారులకు అపరిమిత అధికారాన్ని ఇస్తున్నాయని, ఆయా అంశాలపై జేపీసీ(జాయింట్ పార్లమెంటరీ కమిటీ)తో అధ్యయనం చేయించాలని విపక్ష సభ్యులు చేసిన డిమాండ్లు ఫలించకపోగా.. మూజువాణీ పద్ధతిలో బిల్లు ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మూడు గంటలకు పైగా సాగిన చర్చలో.. వలసలు, విదేశీయులు బిల్లు ఆవశ్యకతను వివరిస్తూ అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, విదేశీయుల 2025 బిల్లు దేశ భద్రతను బలోపేతం చేస్తుందని, 2047 నాటికి భారత్‌ను అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా నిలబెడుతుందని తెలిపారు. భారత్-బంగ్లా సరిహద్దులో జరుగుతున్న చొరబాట్లపై పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

షాపై హక్కుల నోటీసు తిరస్కరణ

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఇచ్చిన సభాహక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. మంత్రి ఎలాంటి హక్కులనూ అతిక్రమించలేదని చెప్పారు.

లోకం తీరు



కథువాలో భారీ ఎన్‌కౌంటర్

» ఇద్దరు పోలీసుల మృతి

» ముగ్గురు ఉగ్రవాదుల హతం

జమ్మూ, మార్చి 27: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లా జుథాని ప్రాంతంలో గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పోలీసులు మృతి చెందగా, ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆరుగురు జవాన్లు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు కాగా, నలుగురు పోలీసులు. వారు ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న భద్రత బలగాలు గత నాలుగు రోజులుగా గాలింపు చర్య లు చేపడుతుండగా రాజ్‌బాగ్ పరిధిలోని ఘాటి జథునా ప్రాంతం జాఖోల్ గ్రామం వద్ద ఎదురు కాల్పులు జరిగాయి. పాక్ నుంచి వచ్చే ఉగ్రవాదులకు ఇటీవల కాలం కథువా కేంద్రంగా మారడంతో భద్రతాబలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

అమెరికా ఆరోగ్య శాఖలో 10వేల మంది ఉద్యోగులపై వేటు !

వాషింగ్టన్, మార్చి 27: పునర్వ్యవస్థీకరణలో భాగంగా అమెరికాలోని ఆరోగ్య, మానవ సేవల విభాగంలో 10వేల మంది ఉద్యోగులను తొలగించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గురువారం ప్రకటించింది. అంటు వ్యాధుల నివారణ; ఆహారం, ఆస్పత్రుల తనిఖీ, ఆరోగ్య బీమా వంటి విధులను ఈ విభాగమే నిర్వహిస్తుంది. ప్రస్తుతం దీంట్లో 82వేల మంది ఉద్యోగులు ఉండగా, దాన్ని 62వేలకు తగ్గించాలని నిర్ణయించింది. లేఆఫ్‌లు, స్వచ్ఛంద, ముందస్తు పదవీ విరమణలు, ఇతర మార్గాల్లో ఉద్యోగులను తొలగించనుంది. లేఆఫ్‌ల ద్వారా 10వేల మందిని, ఇతర మార్గాల ద్వారా మరో పది వేల మందిని తీసేయనుంది. అందులో భాగంగా తొలుత పది వేల మందిని తొలగించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

రాష్ట్రాల్లోకి నేరుగా సీబీఐ

» జాతీయభద్రతతో ముడిపడిన కేసుల్లో అనుమతి తీసుకోకుండానే దర్యాప్తు

» అటువంటి ప్రత్యేక చట్టం తీసుకురండి

» పార్లమెంటుకు స్థాయీ సంఘం నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 27: ఒక రాష్ట్రం అనుమతి లేకుండా సీబీఐ ఆ రాష్ట్రంలో అడుగుపెట్టరాదనే ప్రస్తుత చట్టం విషయమై పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. జాతీయ భద్రత, సమగ్రతతో ముడిపడిన కేసుల విషయంలో రాష్ట్రాల అనుమతి లేకుండానే సీబీఐ తన దర్యాప్తును జరిపేలా ప్రత్యేకమైన/కొత్త చట్టం తీసుకురావాలని సిఫారసు చేసింది. సీబీఐలో డిప్యుటేషన్‌పై పనిచేయడానికి వస్తున్న అభ్యర్థనల్లో సరైనవి చాలా తక్కువగా ఉండటంపై ఈ సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. జాతీయ దర్యాప్తు సంస్థలో డిప్యూటీ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల వంటి కీలక పోస్టులను డిప్యుటేషన్‌పై కాకుండా నేరుగా భర్తీ చేయడంపై దృష్టిసారించాలని సూచించింది. దీనికోసం స్వతంత్ర నియామక వ్యవస్థను నెలకొల్పాలని సూచించింది. ముఖ్యమైన ర్యాంకుల్లోని అధికారులను స్టాఫ్ సెలక్షన్ కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారాగానీ, సీబీఐ ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించడం ద్వారా గానీ ఎంపిక చేయాలని అభిప్రాయపడింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాలు, న్యాయ విషయాల స్థాయీ సంఘం తన 45వ నివేదికను గురువారం పార్లమెంటుకు సమర్పించింది. సీబీఐలో సిబ్బంది కొరత అధికంగా ఉందని, చాలా పోస్టులు ఖాళీగా ఉండి, సిబ్బందిపై అదనపు పని భారం పడుతోందని తెలిపింది. ఇది సీబీఐ పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.

జస్టిస్ వర్మ నోట్ల కట్టల ఘటన

రోగ లక్షణం మాత్రమే





» అసలు రోగం న్యాయవ్యవస్థలో అవినీతి.. దాన్ని అరికట్టాలి

» 'నోట్ల కట్టల'పై క్రిమినల్ కేసు పెట్టకపోవడం పెద్ద పొరపాటు

» కొలీజియంతో సమావేశంలో 6 హైకోర్టుల బార్ ప్రతినిధులు

న్యూఢిల్లీ, మార్చి 27: వివాదాస్పద ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే విషయమై పునరాలోచిస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హామీ ఇచ్చినట్లు గురువారం సుప్రీం కోర్టు కొలీజియంతో సమావేశమైన న్యాయవాదులు చెప్పారు. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ సహా ఆరు హైకోర్టుల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నాతో పాటు కొలీజియం సభ్యులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లు బార్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. న్యాయమూర్తి అధికార నివాసం ప్రాంగణంలో నగదు దొరికిన విషయమై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరారు. తాము లిఖితపూర్వకంగా కోరిన అన్ని అంశాలపై చట్టం పరిధిలో చర్యలు తీసుకుంటామని కొలీజియం హామీ ఇచ్చినట్లు అనిల్ తివారీ వెల్లడించారు. ఢిల్లీ హైకోర్టులో విధుల నుంచి తప్పించిన తర్వాత జస్టిస్ వర్మను పేరెంట్ కోర్టు (సొంత రాష్ట్రం కోర్టు)కు పంపడం సాధారణ విషయమేనని, అక్కడ ఆయనకు విధులు అప్పగించరని సీజే తమకు చెప్పారన్నారు. అలహాబాద్ బార్ సమ్మె విరమించే విషయమై ప్రశ్నించగా, అందరం కలిసి చర్చించుకుని నిర్ణయం తీసుకుంటామని అనిల్ తివారీ తెలిపారు. అన్ని రాష్ట్రాల హైకోర్టుల బార్ అసోసియేషన్లు అలహాబాద్ హైకోర్టు బార్‌కు మద్దతు తెలిపాయన్నారు. కొలీజియంతో సమావేశంలో ప్రధానంగా న్యాయవ్యవస్థలో అవినీతి గురించి చర్చించామని తెలిపారు. జస్టిస్ వర్మ వ్యవహారం వ్యవస్థకు పట్టిన రోగానికి ఒక సంకేతం మాత్రమేనని, ఒక్క వర్మ కేసుకు పరిమితంకాకుండా మొత్తం న్యాయ వ్యవస్థలో అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కుళ్లిన యాపిల్ పళ్లను ఎప్పటికప్పుడే ఏరేయకపోతే మొత్తం న్యాయవ్యవస్థే భ్రష్టు పట్టిపోతుందని కొలీజియం దృష్టికి తీసుకెళ్లామని కేరళ హైకోర్టు బార్ అధ్యక్షుడు యశ్వంత్ షెనాయ్ తెలిపారు. కేవలం న్యాయమూర్తులే అవినీతిపరులని అనడంలేదని, మొత్తం వ్యవస్థను ప్రక్షాళించేందుకు కొలీజియం పూనుకుంటే తాము అండగా నిలబడతామన్నారు. గుజరాత్, కర్ణాటక, జబల్పూర్, లక్నో బార్‌ల ప్రతినిధులు కొలీజియంను కలిసిన వారిలో ఉన్నారు. మార్చి 14న ఘటన జరిగితే మర్నాడు సంఘటన స్థలంలోని వస్తువులు అన్నింటినీ తొలగించారని, సాక్ష్యాధారాలను లేకుండా చేశారని కొలీజియం ముందు ప్రస్తావించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని తప్పుబట్టారు.

న్యాయవాదులతో జస్టిస్ వర్మ భేటీ

జస్టిస్ వర్మ త్వరలో సుప్రీంకోర్టు నియమిత కమిటీ ముందు హాజరై నోట్ల కట్టల వివాదంపై వివరణ ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గత వారం రోజుల వ్యవధిలో ఆయన రెండుసార్లు పలువురు న్యాయవాదులతో సమావేశమై సలహాలు తీసుకున్నారు. ఆయన్ను కలిసిన వారిలో సిద్ధార్థ్ అగర్వాల్, అరుంధతి కట్జు, తారా నరులా, స్తుతి గుజ్రాల్ ఉన్నారు. సుప్రీంకోర్టు కమిటీలో పంజాబ్ హైకోర్టు సీజే జస్టిస్ శీల్ నాగు, హిమాచల్ సీజే జస్టిస్ జీఎస్ సంధ్వాలియా, కర్ణాటక సీజే జస్టిస్ అను శివరామన్ ఉన్నారు. కమిటీ జస్టిస్ వర్మతో పలుమార్లు సమావేశం కానుంది. నోట్ల వ్యవహారం క్రిమినల్ కేసుకు దారితీస్తుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. మరోపక్క జస్టిస్ యశ్వంత్ వర్మ వివాదంపై పార్లమెంటులో చర్చించాలని విపక్షం డిమాండ్ చేసింది. కేంద్ర న్యాయమంత్రి లోక్‌సభలో ప్రకటన చేయాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ కోరారు. మరోవైపు దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో న్యాయమూర్తుల పదవులు వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కలిసి పని చేయాలని న్యాయశాఖ స్థాయీ సంఘం పిలుపునిచ్చింది. అందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.

విదేశీ వాహనాలపై అమెరికా 25% సుంకం

» డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం

» ఏప్రిల్ నుంచి అమల్లోకి

» ఇద్దరికీ భారమన్న యూరప్

» సుంకాల అంశంలో భారత్‌కు ఊరట!

» అమెరికాతో చర్చలు సానుకూలం

» కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి



వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. విదేశాల్లో తయారు చేసి అమెరికాలో దిగుమతి అయ్యే వాహనాలపై 25శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఏప్రిల్3వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని, ఈ చర్య శాశ్వతంగా ఉంటుందని బుధవారం వైట్‌హౌస్‌లో వెల్లడించారు. ఈ నిర్ణయం దేశీయ వాహనాల తయారీ పరిశ్రమను ప్రోత్సహిస్తుందని వైట్‌హౌస్ పేర్కొంది. అయితే ప్రపంచవ్యాప్తంగా వాహనాల ఎగుమతిదారులపై ఆర్థికంగా ప్రతికూలంకానుంది. విదేశీ వాహనాలపై 25శాతం సుంకం విధించడం వల్ల ఏటా 100బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని వైట్‌హౌస్ అంచనా వేస్తోంది. కాగా వాహనాల ధరలు భారీగా పెరగనుండటంతో అమ్మకాలు తగ్గే అవకాశముందని వాణిజ్యవర్గాలు భావిస్తున్నాయి. సుంకాలు పెంచడం వల్ల అమెరికాలో మరిన్ని వాహనాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తారని ట్రంప్ పేర్కొన్నారు. కాగా ట్రంప్ నిర్ణయంపై ఐరోపా దేశాల ఆటో పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ నిర్ణయం యూరప్‌తో పాటు అమెరికాలోని వినియోగదారులు, కంపెనీలకు భారమవుతుందని ఆటో పరిశ్రమ పేర్కొంది. ప్రతిపాదిత అమెరికా సుంకాల నుంచి భారత్‌కు ఉపశమనం లభిస్తుందని.. చైనా, మెక్సికో, కెనడా వంటి దేశాలపై తరహాలో భారం ఉండదని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు సజావుగా జరుగుతున్నాయని వెల్లడించాయి. అమెరికా ప్రతీకార సుంకాలు విధించేందుకు గడువు ఏప్రిల్ 2వ తేదీలోపు ప్రతిష్టంభన ఏర్పడే సంకేతాలులేవని తెలిపాయి. కొత్త ఒప్పందంలో అధిక డిమాండ్ ఉన్న భారత్ ఎగుమతులపై సుంకాలపెంపు పరిమితంగా ఉండే అవకాశముంది. వచ్చే మూడు రోజుల్లో కొత్త ఒప్పందం విధివిధానాల ఖరారుకు సంబంధిత అధికారులు కృషి చేస్తున్నారు. భారత్ నుంచి మరిన్ని రాయితీల కోసం అమెరికా అధికారులు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. భారత్‌తో ఉన్న ప్రత్యేక వాణిజ్య సంబంధాల నేపథ్యంలో చైనా, మెక్సికో, కెనడా దేశాలపై తరహాలో సుంకాలు వేయకపోవచ్చని, ఇది భారత ఎగుమతిదారులకు ఊరట కలిగిస్తుందని ఆశిస్తున్నారు. అమెరికా ఎగుమతులపై సుంకాలను భారత్ కూడా సమీక్షిస్తోంది. కొన్ని వస్తువులపై సుంకాలు తొలగించడం, మరికొన్నింటిపై మార్పులు చేయడం వంటి ప్రతిపాదనలు చర్చల దశలో ఉన్నాయి.

'బాట్స్'తో అక్రమంగా వీసా అపాయింట్‌మెంట్లు!

» 2 వేల దరఖాస్తులను రద్దు చేసిన అమెరికా ఎంబసీ

న్యూఢిల్లీ, మార్చి27: రెండు వేల వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను రద్దు చేసినట్లు భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం బుధవారం ప్రకటించింది. ఇవి 'బాట్స్'ను ఉపయోగించి మోసపూరితంగా పొందిన అపాయింట్‌మెంట్లుగా గుర్తించినట్లు 'ఎక్స్'లో పేర్కొంది. తమ నిబంధనలను ఉల్లంఘించే ఏజెంట్లు, మధ్యవర్తులను సహించబోమని స్పష్టం చేసింది. అమెరికా వ్యాపార (బీ1), పర్యాటక (బీ2), విద్యార్థి వీసాలకు అపాయింట్‌మెంట్ల కోసం సుదీర్ఘ సమయం వేచిచూడాల్సి వస్తోంది. సకాలంలో దొరకాలంటే చాలా మంది ఏజెంట్లను ఆశ్రయించకతప్పడం లేదు. ఏజెంట్ల ద్వారా నెలరోజుల్లోనే అపాయింట్‌మెంట్ దొరుకుతోంది. ఏజెంట్లు ఒక్కో వీసా దరఖాస్తుదారుడి నుంచి రూ.30-35వేల వరకు వసూలు చేస్తుంటారు. ఏజెంట్లు 'బాట్స్'తో వీసా ఇంటర్వ్యూ స్లాట్లను బ్లాక్ చేస్తున్నారని, దీంతో సొంతంగా దరఖాస్తు చేసుకునే వారికి ఎన్నో నెలల తర్వాత గానీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదని సమాచారం.

భద్రాద్రి భవనం కూలిన ఘటనలో ఒకరి మృతి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కామేశ్ కన్నుమూత
- ఇంకా లభ్యంకాని మరో మేస్త్రీ ఉపేందర్‌రావు ఆచూకీ
- కొనసాగుతున్న సహాయక చర్యలు


శిథిలాల్లో మేస్త్రీ ఉపేందర్‌రావు కోసం వెతుకుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది


మృతుడు కామేశ్ (ఫైల్), శిథిలాల్లో చిక్కుకుపోయిన ఉపేందర్‌రావు

భద్రాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో బహుళ అంతస్తుల భవనం కూలిన ఘటనలో ఒకరు మృతి చెందారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన మరొకరి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం భవనం కూలగా.. అందులో ఇద్దరు స్థానిక తాపీ మేస్త్రీలు చిక్కుకుపోయారని అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే సహాయక చర్యలు చేపట్టగా మేస్త్రీ కామేశ్వరరావు అలియాస్ కామేశ్ ఆర్తనాదాలు వినిపించాయి. దీంతో రెస్క్యూ బృందాలు బుధవారం అర్ధరాత్రి దాటాక 1.45 గంటలకు శిథిలాల నుంచి తీవ్రంగా గాయపడ్డ కామేశ్‌ను బయటకు తీశాయి. ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలకు తరలించాయి. అక్కడ కామేశ్‌ను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇటు శిథిలాల్లో చిక్కుకున్న మేస్త్రీ ఉపేందర్‌రావు ఆచూకీకోసం ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి కాలరీస్ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే శిథిలాల కింద దుర్వాసన వస్తుండటంతో ఉపేందర్‌రావు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. యంత్రాలతో కాకుండా కింద నుంచి తవ్వుకుంటూ లోపలికి వెళ్లే యత్నం చేస్తున్నారు. ఉపేందర్‌రావు ఆచూకీ కోసం అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలం వద్దే ఎదురుచూస్తున్నారు. సహాయక చర్యలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ఆర్డీవో దామోదర్‌రావు పర్యవేక్షిస్తున్నారు. ఇక భవన యజమానులు శ్రీపతి దంపతులు తమ అదుపులోనే ఉన్నారని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేయకపోవడంతో ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు. శిథిలాలు తొలగిస్తుండగా ధ్వంసమైన లాకర్‌లో దొరికిన పత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు. కాగా, ఈ ఆలయ నిర్మాణం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? శ్రీపతి గురించి వివరాలు పోలీసులు సేకరించినట్లు తెలుస్తోంది. అతడికి ఏపీలోని ఓ సేవా సంస్థతో ఉన్న అనుబంధం, వివరాలు ఆరా తీసినట్లు సమాచారం.

6,729 మంది ఔట్

(మొదటి పేజీ తరువాయి)

వాటర్‌వర్క్స్, మెట్రోరైల్, రెరా, మెప్మా, కుడా, వైటీడీఏ.. ఇలా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న విశ్రాంత ఐఏఎస్‌లు, ఆర్డీవోలు, డీఎఫ్‌వోలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, సెక్షన్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్లు, అటవీ శాఖ రేంజ్ అధికారులు, చీఫ్ ఇంజనీర్ల నుంచి, సహాయక ఇంజనీర్ల వరకు ఇలా పలు క్యాడర్లకు చెందిన అధికారులున్నారు.

అదే దారిలో మిగతా శాఖలు

విద్యుత్తు శాఖలో మరికొందరు డైరెక్టర్లను కూడా తొలగించే అవకాశాలున్నాయి. నీటి పారుదల శాఖలో ఇదివరకే 200 మందికి పైగా ఉద్యోగులను తొలగించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటకు వచ్చాక.. పోలీసు శాఖలోనూ పలువురిని తొలగించగా.. ఇప్పుడు మరికొందరిని ఇంటిదారి పట్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ, దేవాదాయం, ఆర్అండ్‌బీ, విద్యాశాఖ, బీసీ సంక్షేమం, రవాణా, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు ఇలా పలు కీలక శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కూడా వరుసగా ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

వంద మందిలోపే.. మళ్లీ చాన్స్!

విశ్రాంత ఉద్యోగుల అవసరం ఉందనుకుంటే.. తాజాగా నియామకాలు జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. 6,729 మందిలో పునర్నియామకానికి అవకాశాలు 100లోపే ఉంటాయని సచివాలయవర్గాలు చెబుతున్నాయి. మెట్రో రైల్ ప్రాజెక్టును ముందు నుంచి పర్యవేక్షిస్తున్న ఎన్వీఎస్ రెడ్డికి ఈ కోవలో తిరిగి అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. సాంకేతికపరంగా నైపుణ్యత ఉన్న కొద్దిమంది విశ్రాంత ఉద్యోగులు/అధికారులకే ఆయా శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పునర్నియామకానికి అవకాశాలుంటాయని సమాచారం.

పదోన్నతులు/రిక్రూట్‌మెంట్లకు చాన్స్

రేవంత్ సర్కారు నియామకాల విషయంలో ముందు నుంచి ఓ స్పష్టతతో ఉంది. ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, ఆ మేరకు నియామకాలు జరుపుతామని ప్రకటిస్తోంది. ఇప్పటికే 58 వేల నియామకాలను చేపట్టింది. ఇప్పుడు 6,729 మందిని తొలగించిన నేపథ్యంలో.. గ్రూప్1 మొదలు.. గ్రూప్4 స్థాయిలో కొత్త నోటిఫికేషన్ల ద్వారా భర్తీకి అవకాశాలున్నాయని సచివాలయవర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు.. పదవీ విరమణ పొందినా.. తమ శాఖల్లో కొందరు తిష్ట వేసుకుని కూర్చోవడం వల్ల తమకు పదోన్నతులు రావడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.! తాజా ఉత్తర్వుల నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నక్సలిజంలో మైనర్లు!

అడవుల్లో వారికి శిక్షణ.. మావోయిస్టు నేత సారయ్య లేఖతో వెలుగులోకి

చర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్'తో కుదేలవుతున్న మావోయిస్టులు.. ఇప్పుడు మైనర్లను రిక్రూట్ చేసుకుని, వారికి శిక్షణనిస్తున్నారని ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు. రెండ్రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వరంగల్‌కు చెందిన సుధాకర్ అలియాస్ సారయ్య వద్ద లభ్యమైన నాలుగు పేజీల తెలుగు లేఖలో ఈ విషయం వెల్లడైందని వివరించారు. "మడ్ డివిజన్‌లోని ఇంద్రావతి, మరో ప్రాంతం నుంచి 25 మందిని, ఇంకో చోట 130 మందిని రిక్రూట్ చేశాం. సర్కార్, గ్రామ కమిటీలు స్క్రూటినీ చేశాకే.. వారిని నియమించుకున్నాం. కొత్తగా నియమితులైన వారిలో 12, 13 ఏళ్ల వారు 65 మంది, 14-17 ఏళ్ల వయసులో ఉన్న వారు 40 మంది ఉన్నారు. మిగతా 50 మంది వయసు 18-22 మధ్యలో ఉంది. వీరందరికీ 5 నెలల పాటు శిక్షణనిచ్చాం" అని ఆ లేఖలో ఉన్నట్లు తెలిపారు. సారయ్య ఆ లేఖను కేంద్ర కమిటీకి రాసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే.. ఈ లేఖ ఎప్పుడు రాశారనేదానిపై స్పష్టత లేదని తెలుస్తోంది.

'ఆంధ్రజ్యోతి' పరిశీలన..!

- ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌లో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఒకప్పుడు గూగుల్ మ్యాప్స్‌కంటికి కూడా అందని ప్రదేశాల్లోనూ ఇప్పుడు పోలీసు క్యాంపులు కనిపిస్తున్నాయి. అడవులకు దారితీసే ప్రధాన రహదారుల్లో సగటున ప్రతీ ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున పోలీసు క్యాంపు ఉంది. ఈ క్యాంపుల వద్ద 20-30 మంది జవాన్లు డ్రోన్ల సాయంతో, అధునాతన తుపాకులతో పహారాకాస్తున్నారు. ప్రతీ క్యాంపులో సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేశారు.
- బలగాలు కొర్రగట్టు అడవుల్లోని చెట్లకు తెలుపురంగు స్టిక్కర్లు కనిపించాయి. మావోయిస్టుల తూటాల వెలుతురు ప్రతిబింబిస్తుందని, దానివల్ల ఎదురుకాల్పులు జరుగుతున్నాయని వారు భ్రమపడేలా ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు వివరించారు.
- ఎన్‌కౌంటర్లలో మృతి చెందుతున్న మావోయిస్టుల్లో 90% మంది ఎస్టీలే ఉన్నట్లు 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి పర్యటనలో తేలింది. వీరిలోనూ సింహభాగం(95% మంది) గొత్తి కోయలు, కోయలు, గోండ్ తెగలకు చెందిన

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

పౌరహక్కుల సంఘం.. ముగిసిన సారయ్య అంత్యక్రియలు


సారయ్య భౌతిక కాయం వద్ద విప్లవ జోహార్లు అర్పిస్తున్న అమరుల బంధుమిత్రుల సంఘం, పౌర హక్కుల నేతలు

మడికొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే అని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరిట మావోయిస్టు ఉద్యమంపై చేస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. విరసం రాష్ట్ర కార్యదర్శి పాణి మాట్లాడుతూ.. విప్లవ రాజకీయాలను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. అమరుల బంధుమిత్రుల సంఘం నేతలు అంజమ్మ, పద్మకుమారి మాట్లాడుతూ.. సారయ్య ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా.. కాజీపేట మండలం తరాలపల్లిలో గురువారం మావోయిస్టు పార్టీ నేతఅంకేశ్వరపు సారయ్య అంత్యక్రియలు జరిగాయి. నారాయణరావుతో పాటు మాజీ మావోయిస్టులు భారతక్క, గంగుల రాజిరెడ్డి, తెలంగాణ ఉద్యమ పార్టీ వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్య, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌లు సారయ్యకు నివాళులర్పించారు.

పాస్టర్ ప్రవీణ్‌కు అంతిమ వీడ్కోలు

- సికింద్రాబాద్‌లోని క్రైస్తవ శ్మశానవాటికలో ఖననం
- భారీగా తరలివచ్చిన జనం
- వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు, నిరసన
- ప్రవీణ్‌కు నివాళులర్పించిన బ్రదర్ అనిల్, కేఏ పాల్


ప్రవీణ్ పగడాల అంతిమ యాత్రకు తరలివచ్చిన క్రైస్తవ బోధకులు, ప్రజలు

రెజిమెంటల్‌బజార్, రాంగోపాల్‌పేట, నల్లకుంట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల అంతిమ కార్యక్రమాలు సికింద్రాబాద్‌లో జరిగాయి. ప్రవీణ్ పగడాల భౌతికకాయాన్ని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని క్రైస్తవ శ్మశాన వాటికలో గురువారం సాయంత్రం ఖననం చేశారు. ఏపీలోని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ప్రవీణ్ పగడాల మృతదేహం గురువారం తెల్లవారుజామున సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి వచ్చింది. ప్రవీణ్ పగడాలకు తుది వీడ్కోలు పలికేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు, క్రైస్తవ బోధకులు చర్చికి తరలివచ్చారు. బ్రదర్ అనిల్, కేఏ పాల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, మైనంపల్లి హనుమంతరావు తదితర ప్రముఖులు కూడా ప్రవీణ్ భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఇక, ప్రవీణ్ పగడాలకు నివాళులర్పించిన ఆయన అభిమానులు.. వీవాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేస్తూ చర్చి బయట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం ప్రవీణ్ పగడాల భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో స్మశానవాటికకు ఊరేగింపుగా తరలించి ఖననం చేశారు. ఈ అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కాగా, తమకు ఎవరి మీద కోపం లేదని, తన భర్త ఆశయాలను కొనసాగిస్తామని పాస్టర్ ప్రవీణ్ పగడాల భార్య జెస్సికా పగడాల విలేకరులతో అంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఇక, ప్రవీణ్ పగడాల మృతిని ప్రమాదంగా చిత్రీకరించేందుకు పోలీసులు యత్నిస్తున్నారని కేఏ పాల్ ఆరోపించారు. ప్రవీణ్ పగడాల మృతి అంశంపై కోర్టుకు వెళతానని ఆయన చెబుతుండగా ప్రవీణ్ భౌతికకాయం వద్ద ఉన్న క్రైస్తవ ప్రముఖులు పాల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ప్రవీణ్ పగడాల మృతికి కారకులను తక్షణమే అరెస్ట్ చేయాలని, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న యూట్యూబ్ చానళ్లను కట్టడి చేయాలని క్రైస్తవ ధర్మప్రచార పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జేరూసలెం మత్తయ్య ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను కోరారు. కాగా, తన వ్యక్తిగత దర్యాప్తు మేరకు ప్రవీణ్‌ది ముమ్మాటికీ హత్యేనని, ప్రవీణ్ మృతదేహానికి హైదరాబాద్‌లో రీపోస్టుమార్టం చేయించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు.

ప్రవీణ్‌కు నివాళులర్పించేందుకు వెళ్తూ..

లారీ ఢీకొని పాస్టర్ మృతి


మాచర్ల జోసెఫ్(ఫైల్)

ఉప్పల్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో మాచర్ల జోసెఫ్(45) అనే పాస్టర్ ప్రాణాలు కోల్పోయారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామానికి చెందిన మాచర్ల జోసెఫ్.. పాస్టర్ ప్రవీణ్ పగడాలకు నివాళులర్పించేందుకు ద్విచక్రవాహనంపై సికింద్రాబాద్ వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. జోసెఫ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీచర్ భార్య మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి: పీఆర్టీయూ

- జీపీఎఫ్ బిల్లుల జాప్యంతోనే మృతి చెందిందంటూ ఆందోళన

పాల్వంచ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సకాలంలో జీపీఎఫ్ బిల్లులు విడుదల చేయకపోవడం వల్లనే ఓ ఉపాధ్యాయుడి భార్య మృతి చెందిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించిన అనంతరం, తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భద్రాద్రి జిల్లా పాల్వంచ జడ్పీహెచ్ఎస్‌లో టీచర్‌గా పనిచేస్తున్న పొదిలి సత్యనారాయణ భార్య పొదిలి లత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందన్నారు. తన భార్యకు మెరుగైన వైద్యం అందించడానికి జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ సరెండర్ లీవ్‌ల డబ్బుల కోసం విద్యాశాఖకు సత్యనారాయణ దరఖాస్తుచేసుకున్నారని చెప్పారు. ఏడాది గడిచినా ఆ డబ్బులను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. మెరుగైన వైద్యం అందకపోవడంతోనే గురువారం లత మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పీఆర్టీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు సకాలంలో పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దళిత యువతిని గర్భవతిని చేసిన వ్యక్తికి 27ఏళ్ల జైలు

- తీర్పు చెప్పిన నల్లగొండ కోర్టు

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తికి 27ఏళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు సెషన్ జడ్జి రోజారమణి గురువారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అందించిన వివరాల మేరకు.. కనగల్ మండలం పర్వతగిరికి చెందిన నల్లబోతు జగన్ నల్లగొండలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గుర్రంపోడు మండలానికి చెందిన యువతి నల్లగొండలోని తన బంధువుల ఇంట్లో ఉంటూ కుట్టుపనికి వెళుతూ జీవనం సాగిస్తోంది. ఆ యువతికి జగన్‌తో పరిచయం ఏర్పడింది. జగన్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. ఆ తర్వాత మాట మార్చడంతో బాధితురాలు.. జగన్‌పై 2019 మే 29న గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేయ గా, బెయిల్‌పై బయటకు వచ్చాడు. పోలీసులు ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీంతో గురువారం విచారణ నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు జగన్‌ను దోషిగా నిర్ధారించి 27 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఈ కేసులో విచారణ అధికారులు ఎస్డీపీవోలు ఎస్.మహేశ్వర్, టి.ఆనంద్, ఏఎస్ఐ ఎండీ ఖలీంఅహ్మద్, ప్రస్తుత ఏఎస్పీ పి.మౌనిక, ఎస్‌హెచ్‌వో పి.మధు, సీడీవో ఇంతియాజ్ అహ్మద్, లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్‌లను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఎమ్మెల్యే సత్యంను బెదిరించిన వ్యక్తికి బెయిల్

క్వాష్ పిటిషన్‌లో హైకోర్టు బెయిల్.. కేసు కొట్టివేతకు నిరాకరణ

- దర్యాప్తు చేపట్టాలని నిర్దేశం
- ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులో రిమాండ్‌కు పంపడంపై ఆగ్రహం
- దర్యాప్తు అధికారి, మెజిస్ట్రేట్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశం



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఇంటర్నెట్ కాల్ ద్వారా బెదిరించిన యాస అఖిలేశ్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అఖిలేశ్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేసు కొట్టివేతకు నిరాకరించిన ధర్మాసనం.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. చట్టప్రకారం కేసు దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో బీఎన్ఎస్ఎస్-35 (సీఆర్పీసీ 41ఏ) ప్రొసీజర్‌ను పరిశీలించకుండా యాంత్రికంగా నిందితుడిని రిమాండ్‌కు పంపిన కరీంనగర్ మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌తో పాటు దర్యాప్తు అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. లండన్ నుంచి ఇంటర్నెట్ కాల్ చేసిన నిందితుడు అఖిలేశ్‌రెడ్డి రూ.20 లక్షలు ఇవ్వకపోతే.. చంపేస్తానంటూ బెదిరించాడంటూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది సెప్టెంబరు 29న కొత్తపల్లి(కరీంనగర్ జిల్లా) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. లండన్‌లో ఉన్న నిందితుడిపై పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో నిందితుడు భారత్‌కు తిరిగిరావడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఫిబ్రవరి 10 నుంచి నిందితుడు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. కేసు కొట్టేయాలని నిందితుడు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. నిందితుడి తరఫున న్యాయవాది శరత్‌కుమార్ వాదిస్తూ.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను నిందితుడు కులం పేరుతో దూషించకపోయినా అట్రాసిటీ కేసు పెట్టారని ఆరోపించారు. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లలో నోటీసులిచ్చి విచారించాల్సి ఉండగా.. నేరుగా జైలుకు పంపారని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదిస్తూ.. అడిగినంత డబ్బు ఇవ్వకపోతే చంపుతామంటూ ఎమ్మెల్యేను బెదిరించడాని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిందితుడు చేసిన నేరానికి ఏడేళ్లలోపు జైలుశిక్ష పడే సెక్షన్లు మాత్రమే వర్తిస్తాయని, ఈ విషయాన్ని దర్యాప్తు అధికారి గానీ, రిమాండ్‌కు పంపేముందు మేజిస్ట్రేట్ గానీ పరిశీలించలేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్న మాట వాస్తవమే కాబట్టి దర్యాప్తు కొనసాగాలని, కేసును కొట్టేయడం లేదని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడాలన్న ఉద్దేశంతో 'అర్నబ్ గోస్వామి' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి.. క్వాష్ పిటిషన్‌లో నిందితుడికి బెయిల్ ఇస్తున్నట్లు తెలిపింది. నిందితు డు తన పాస్‌పోర్టును డిపాజిట్ చేయాలని, విదేశాలకు వెళ్లరాదని స్పష్టం చేసింది. ప్రొసీజర్ అనుసరించని దర్యాప్తు అధికారిపై, యాంత్రికంగా జైలుకు పంపిన మేజిస్ట్రేట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా అథారిటీలను ఆదేశించింది.

సీఎం రేవంత్‌పై అనుచిత వాఖ్యలు

- ఐదుగురిపై కేసు నమోదు

చౌదరిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసభ్యకరంగా దూషించడంతో పాటు.. గ్రామస్తుల పనులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదైన ఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో గురువారం జరిగింది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తుమ్మలపల్లిలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన మావురిగారి శ్రీనివాస్, గొల్ల కృష్ణయ్య, మావురిగారి జంగయ్య, బంగారు బాల్‌రాజ్, బంగారు రాములు.. గ్రామంలో గుమిగూడి వచ్చీపోయే వారికి ఆటంకం కలిగిస్తూ రోడ్డుపై మంట పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డిని దూషిస్తూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రిపై అనుచిత వాఖ్యలు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కానిస్టేబుల్ సందీప్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

తొగుట, మార్చి 27: సాగులో నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన గుమ్మడిదల వెంకటయ్య(48) రెండెకరాల్లో వ్యవసాయం, రోజు కూలీ చేసుకుంటూ బతుకుతున్నాడు. ఈసారి బోరుబావిలో నీరు అడుగంటి పోవడంతో వరి పంట కళ్ల ముందే ఎండిపోయింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన వెంకటయ్య అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 23న సిద్దిపేటలో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎర్డొగాన్ దుష్టచేష్టలు

తుర్కియేలో నానాటికీ పెరుగుతున్న ఆందోళనలు, నిరసనలను గమనించినప్పుడు, అవి కేవలం ఒక రాజకీయపార్టీ ప్రోద్బలంతో జరుగుతున్నవి కావన్నది సుస్పష్టం. రెండుదశాబ్దాలకు పైగా ప్రధానిగానో, అధ్యక్షుడుగానో దేశాన్ని ఏలుతున్న ఎర్డొగాన్ పదవీవ్యామోహం తుర్కియేను రాజకీయంగా, ఆర్థికంగా కుదిపేస్తోంది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సీహెచ్‌పి)లో ప్రముఖ నాయకుడు, ఇస్తాంబుల్ నగర మేయర్ అయిన ఇక్రెమ్ ఇమమోలును ఈనెల19న అవినీతి, ఉగ్రవాదులకు సహాయం ఇత్యాది ఆరోపణలమీద అరెస్టుచేసి జైల్లోకి తోయడంపై దేశం భగ్గుమన్నది. ఎర్డొగాన్ పదవికి ఇప్పటికిప్పుడు వచ్చిపడిన ప్రమాదమేమీలేదు. కానీ, మరో మూడేళ్ళలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో మళ్ళీ నిలిచి గెలిచేందుకు ఆయన ఇప్పటినుంచే పరిస్థితులను చక్కదిద్దుకుంటున్నాడు. మంచి ఆదర్శాలు, చక్కని నడవడిక, ప్రజాస్వామిక విలువలు ఉన్న ఇమమోలును కేవలం ఒక రాజకీయ నాయకుడిగా చూడలేమని, మతాచార్యుడి కుమారుడు అని అర్థాన్నిచ్చే ఆ పేరులోనే తుర్కియే సాంస్కృతిక మూలాలున్నాయని మీడియా విశ్లేషిస్తున్నది. ప్రభుత్వం ఎన్ని ఆరోపణలు చేసినప్పటికీ, బలమైన రాజకీయ శత్రువును పక్కకు తప్పించే క్రమంలోనే ఈ అరెస్టు జరిగిందని ప్రజలు నమ్ముతున్నారు. విపక్ష పార్టీ నుంచి అధ్యక్షపదవి అభ్యర్థిగా ఇమమోలు అధికారికంగా రేపోమాపో నామినేట్ కాబోతున్న తరుణంలో ఈ అరెస్టు జరిగింది.

ఇమమోలు మీద కేసులు పెట్టడం, న్యాయస్థానం అరెస్టుకు ఆదేశాలు జారీచేయడం, పోలీసులు అరెస్టుచేసి జైల్లోకి నెట్టడం వేగంగా జరిగిపోయాయి. ఇస్తాంబుల్ మేయర్ పదవిని కూడా ప్రభుత్వం తొలగించింది. ఈ విధంగా విపక్షపార్టీకి చెందిన ఐదుగురు ఇటీవలికాలంలో మేయర్ పదవులు కోల్పోయారట. అధ్యక్ష అభ్యర్థిగా పార్టీ నామినేషన్‌ను నిలువరించడమే లక్ష్యంగా ఈ అరెస్టు జరిగింది కనుక సీహెచ్‌పీ ఈ ప్రాథమికదశ ఎన్నికను పార్టీ సభ్యులకు పరిమితం చేయకుండా, ప్రజాభాగస్వామ్యాన్ని కూడా కోరింది. దీనితో ఏకంగా కోటిన్నరమంది ఈ ప్రక్రియలో పాల్గొని ఇమమోలును తమ అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ చేశారని ఆ పార్టీ ఉత్సాహంగా చెబుతోంది. ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడం, నిరసనలు పలు రూపాల్లో సుదీర్ఘకాలం కొనసాగడం చూసినప్పుడు ఇదంతా ఇమమోలు మీద ప్రేమకంటే, ఎర్డొగాన్‌మీద ద్వేషంగా కనిపిస్తున్నది. నిరసనల్లో ముందు వరుసలో ఉన్నది యువకులు, విద్యార్థులు కావడం విశేషం. వారు పుట్టిబుద్ధెరిగినప్పటినుంచీ అధికారంలో ఎర్డొగాన్‌నే చూస్తున్నారు. 2003లో ప్రధాని అయినప్పటినుంచి ఇప్పటివరకూ ఆయన తన పాలనలో ప్రజాస్వామిక విలువలకు కట్టుబడింది లేదు. అసమ్మతిని, ప్రశ్నను సహించకపోవడం, ప్రతిపక్షాన్ని బతకనివ్వకపోవడం ఒక విధానంగా అమలు చేశాడాయన. ఇమమోలు అరెస్టు ద్వారా ఇప్పుడు ఎర్డొగాన్ సంపూర్ణ నియంతగా ప్రజలకు అర్థమవుతున్నాడు. ఆయన తన ఏకేపీ పార్టీలో ఎవరూ పైకి ఎదగకుండా ముందే జాగ్రత్తపడ్డాడు. కానీ, తిరిగి అధ్యక్షుడుగా నిలబడేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలు ఒప్పుకోవు కనుక, వాటిని మార్చేందుకు సిద్ధపడుతున్నాడు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు జరపకుండా, వాటిని ముందే నిర్వహించేందుకు ప్రాతిపదికలు సిద్ధం చేసుకుంటున్నాడు. దేశంలో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎటువంటి నిర్ణయాలైనా తీసుకొనే అవకాశం, అధికారం ఆయనకు ఉంటాయి. రాజ్యాంగసవరణ ద్వారా తిరిగి నిలబడేందుకు మార్గం సుగమం చేసుకోవచ్చు లేదా ముందస్తు ఎన్నికలకు పోవచ్చు. ఆయన ఎన్ని ఎత్తులు వేసినప్పటికీ, అధికశాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని ఇప్పటికే రుజువైంది. గత ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విపక్ష సీహెచ్‌పి తన దేశవ్యాప్త బలాన్ని రుజువుచేసుకుంది. ఐదేళ్లక్రితం ఇస్తాంబుల్ మేయర్‌గా గెలిచిన ఇమమోలు కారణంగానే గత ఐదుదశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా సీహెచ్‌పీ బలపడింది. బలమైన రాజకీయ ప్రత్యర్థి ఇమమోలు మీద అక్రమ కేసులు బనాయించడం, ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా మార్చడం కోసం యూనివర్సిటీ పట్టాను రద్దుచేయించడం వంటి ఎర్డొగాన్ దుష్టచేష్టలను ప్రజలు గమనిస్తున్నారు. తిమ్మిని బమ్మిని చేయగల శక్తి ఆయనకు ఉండివుండవచ్చు. కానీ, ఇంతటి ప్రజావ్యతిరేకతను గమనించిన తరువాతైనా ఆయన కాలువెనక్కుతీసుకోవడం అవసరం. కశ్మీరీల హక్కుల గురించి అంతర్జాతీయ వేదికలమీద గుండెలుబాదుకొనే ఈ నాయకుడు ముందు తన ప్రజల మనోభిప్రాయాలకు గౌరవించడం నేర్చుకోవాలి.

అమెరికాలో మకార్తీ భూతం మళ్లీనా?

గతం గుర్తుకు రాని మనిషీ ఉండడు, సమాజమూ ఉండదు. వర్తమానంలోని బాధలను గతంలోని కష్టాలతో పోల్చి చూసుకోవటం నిరంతరం సాగుతూనే ఉంటుంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనే భయం రెండో ప్రపంచ యుద్ధంనాటి బీభత్సాన్నీ విధ్వంసాన్నీ ఎంతో కొంత తెలుసుకునేలా ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు భావప్రకటనా స్వేచ్ఛనూ, అసమ్మతినీ అణచివేస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులు గతంలో తమ లాంటి వారినీ అప్పటి ప్రభుత్వాల దాష్టీకాలనూ గుర్తుకు తెచ్చుకోకమానరు. అందుకోసం చరిత్రను తవ్వకుండా ఉండనూ లేరు. అసమ్మతిని సహించలేని ధోరణి హద్దులు దాటినప్పుడు బాధితులతో పాటు ఆలోచనాపరులు కూడా గతంలోని దారుణాలపై దృష్టి సారించకుండా ఉండలేరు.

అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అలాంటి అవసరాన్ని కలిగిస్తున్నాయనే చెప్పుకోవాలి. విద్యా సంస్థలను రాడికల్ వామపక్షవాదుల ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత చాలా కటువుగా, మొరటుగా చెప్పారు. 'మార్క్సిస్ట్, మేనియాక్స్ లూనటిక్స్'లు విద్యా సంస్థలను శాసిస్తున్నారనీ విమర్శించారు. దీన్ని చూస్తూ ఊరుకుంటున్న ఉన్నతాధికారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తాననీ ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫెడరల్ విద్యాశాఖను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులనూ జారీచేశారు. విద్యాసంస్థలకే పరిమితం కాకుండా ఇతర అంశాలపై తాను వరుసగా జారీచేస్తున్న ఉత్తర్వులను నిలిపివేస్తున్న న్యాయమూర్తులను కూడా 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్'గానే విమర్శిస్తున్నారు. తన ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తున్న న్యాయవాదులనూ, న్యాయవాద సంస్థలనూ కట్టడి చేయటానికి చర్యలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫెడరల్ నిధులు వెళ్లకుండా నొక్కిపట్టి వాటిని దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 400 మిలియన్ డాలర్ల నిధులను ఫెడరల్ ప్రభుత్వం నుంచి పొందటానికి ట్రంప్ ప్రభుత్వానికి నచ్చే విధంగా విధానాలను మార్చుకునేందుకు కొలంబియా విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఎంతో చరిత్ర ఉండి, మహామహులను అందించిన విశ్వవిద్యాలయానికే ఈ పరిస్థితి వచ్చిందంటే మిగతా వాటి పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలు చేయటం, ప్రదర్శనలు నిర్వహించటం గడిచిన రెండేళ్లుగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో బాగా జరిగింది. దీన్ని హమాస్ సంస్థకు మద్దతు పలకటంగా భావించి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల వీసాలను రద్దు చేసి స్వదేశాలకు పంపటమూ మొదలైంది. కొలంబియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ అలాగే భారత్‌కు రావాల్సి వచ్చింది. జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరల్ విద్యార్థి బాదర్ ఖాన్ సూరిని కూడా అలాంటి ఆరోపణలతోనే దేశం నుంచి పంపించి వేయటానికి రంగం సిద్ధమైంది. ఇక అనేక ప్రముఖ విద్యాలయాల్లో విద్యార్థులపై నిఘాలు పెరుగుతున్నాయి. విద్యార్థుల సామాజిక ఖాతాలను తనిఖీ చేయటమూ మొదలైంది. అలా తనిఖీ చేసేందుకు కొత్త నిబంధనలు తీసుకురావటానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి.

సామాజిక సమస్యలపై స్పందించే వారందరూ ఏదో విధమైన సిద్ధాంతాలను విశ్వసించేవారే అయివుంటారు. వారందరినీ లెఫ్ట్ లూనటిక్స్‌గా భావిస్తే విశ్వవిద్యాలయాల్లో అల్లకల్లోలం తలెత్తుంది. భావ వైవిధ్యాన్ని ప్రదర్శించలేని స్థాయికి విశ్వవిద్యాలయాలు దిగజారిపోతే సామాజిక జ్ఞానమే స్తంభించిపోతుంది. అమెరికా విశ్వవిద్యాలయాలకు ఉన్న బలమే భావ వైవిధ్యత. అందుకే అక్కడ జరిగే పరిశోధనలకు అంత గుర్తింపు ఉంటుంది. భారతీయ భాషలు, కులాలు, మతాలు, నగరాలు, ప్రాంతీయ సంస్కృతులు, స్థానిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఎన్నో లోతైన పరిశోధనలు జరిగాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వాటిని పక్కనపెడితే ఏర్పడే జ్ఞానశూన్యత చాలా అసాధారణంగా ఉంటుంది. అందుకే అక్కడ భావప్రకటనలపై కట్టడులు పెడితే జరిగే నష్టం భారత్‌తో పాటు చాలా దేశాలపై ఉంటుంది.



కమ్యూనిజం ఇప్పుడు కదం తొక్కటంలేదు. ఆ సిద్ధాంతం ఆధారంగా నడిచే పార్టీల బలం అంతంత మాత్రంగానే ఉంది. అయినా అమెరికాలో 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్' అంటూ ఆ సిద్ధాంత ఛాయలు స్పష్టంగా లేని వారిని సైతం లక్ష్యంగా చేసుకోవటం విచిత్రంగానే అనిపిస్తుంది. ట్రంప్‌కూ ఎలాన్ మస్క్‌కూ లెఫ్టిజంలో ప్రమాదం కనపడుతున్నదంటే రాజకీయ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామా 1992లో ఘనంగా ప్రకటించినట్లుగా చరిత్ర అంతం కాలేదని భావించాలి!

రిపబ్లికన్ పార్టీకి ఆధునిక భావాలు అంతగా పట్టవు. మతభావాలపై మక్కువ ఎక్కువ. క్రైస్తవ వాదుల ప్రభావం అధికం. అబార్షన్లను వ్యతిరేకిస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు సమానత్వాన్ని నిరాకరిస్తుంది. పర్యావరణ విధ్వంసం నిజం కాదంటుంది. సమానత్వ భావనను చులకన చేస్తుంది. ఇంత చరిత్ర ఉండబట్టే వామపక్ష భావాల పొడ ఏ మాత్రం గిట్టదు. వాటి పట్ల శత్రుత్వధోరణితో వ్యవహరించటం కొత్తకాదు. ఆ ధోరణి అమెరికన్ చరిత్రలో భయానక పరిణామాలకు కారణమైంది. 1940, 50ల్లో ఆ పార్టీకి చెందిన సెనటర్ జోసెఫ్ రేమండ్ మకార్తీ.. వేలమంది ప్రజలను కమ్యూనిస్టులనే ముద్రవేసి వేధించారు. ప్రభుత్వ వ్యవహారాల సెనెట్ కమిటీకీ, దర్యాప్తు ఉపసంఘానికీ అధ్యక్షత వహించి విచారణల పేరుతో భయాన్ని, బీభత్సాన్ని సృష్టించారు. హాలీవుడ్ దర్శకులు, నటుల నుంచి మొదలుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు మకార్తీ ఆరోపణలనూ, విచారణలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. మకార్తీ చర్యలను విశ్లేషిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి. అమెరికా చరిత్రను వాస్తవిక దృక్పథంతో రాసే వారెవరూ మకార్తీయిజాన్ని విస్మరించలేకపోయారు.



■ రాహుల్ కుమార్

మకార్తీ రెండుసార్లే (1946, 1952) సెనట్‌కు ఎన్నికయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖలోకి 57 మంది కమ్యూనిస్టులు చొరబడ్డారని 1950లో ప్రకటించి సంచలనం సృష్టించారు. 'మన ప్రభుత్వంలో కమ్యూనిస్టుల గురించి చర్చించుకునేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనదగ్గరున్న కొత్త ఆయుధానికి సంబంధించిన బ్లూప్రింట్‌ను దొంగిలించటానికి డబ్బుని తీసుకునే గూఢచారులతో మాత్రమే మనం వ్యవహరించటం లేదు. మన విధానాన్ని తీర్చిదిద్దటానికీ మార్గదర్శనం చేయటానికీ ఉద్దేశించిన దుర్మార్గపు కార్యకలాపాలతో మనం వ్యవహరిస్తున్నాం' అని ప్రకటించారు. ప్రభుత్వంలో చొరబడిన కమ్యూనిస్టులు అమెరికా విధానాలను ప్రభావితం చేసే స్థాయికి చేరారన్నదే ఆ ప్రకటన అంతరార్థం. అంతటితో ఆగలేదు. అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏలో కూడా కమ్యూనిస్టులు ఉన్నారని ఆరోపించారు. ఇతర విభాగాల్లోనూ కమ్యూనిస్టులు తిష్టవేశారని విమర్శించారు. రెండోసారి సెనటర్‌గా ఎన్నికైన తర్వాత ఆరోపణలను మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వ కార్యకలాపాల సెనెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికకావటంతో విపరీత అధికారాలు వచ్చిపడ్డాయి. దానికితోడు శాశ్వతంగా ఉండే సెనెట్ దర్యాప్తు కమిటీ నేతృత్వమూ దక్కింది. ఏళ్లపాటు మకార్తీ మాటకీ చేతకీ అడ్డూఅదుపూ లేకుండా పోయింది. వామపక్షవాదులుగా ముద్రలువేసిన వారిపై 36 రోజులపాటు జరిపిన విచారణ టెలివిజన్‌లో ప్రసారం చేయటం అప్పట్లో సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. న్యూజెర్సీలోని 'ఆర్మీ సిగ్నల్ కాప్స్ ఇంజనీరింగ్ లేబరటరీస్' గూఢచర్యం ఆరోపణలపై జరిపిన విచారణ కూడా టెలివిజన్‌లో ప్రసారమైంది. ఉద్యోగుల విధేయతను పరిశీలించటానికి అప్పట్లో 'లాయల్టీ సెక్యూరిటీ స్క్రీనింగ్ బోర్డు' అనేది ఒకటి ఉండేది. ఆ బోర్డు వేసిన ప్రశ్నలకు జవాబుచెప్పటానికి నిరాకరించిన ఒక డెంటిస్ట్‌ను సైనిక విభాగం నియమించిదంటూ మకార్తీ ఆరోపణ చేశారు. దీంతో ఆగకుండా ఆర్మీ న్యాయవాదిగా వ్యవహరించే జోసెఫ్ వెల్ఛ్ కమ్యూనిస్టు ప్రజాసంఘం సభ్యుడైన వ్యక్తిని ఉద్యోగంలో పెట్టుకున్నారని ఆరోపించారు. అప్పటికే ఎన్నో ఆరోపణలను చేసి ఒకటిరెండు తప్ప వేటినీ నిరూపించలేని పరిస్థితి ఏర్పడింది. టెలివిజన్ ప్రసారాలతో క్రమేపీ ప్రచార ఆర్భాటమూ, ఆరోపణల డొల్లతనం కనపడడమూ మొదలైంది. 'మీకు సభ్యత అంటూ లేదా సర్? దాన్ని పూర్తిగా వదిలేశారా?' అంటూ వెల్ఛ్ ఎదురుదాడి చేయటంతో ప్రజలకు కూడా మకార్తీపై విముఖత మొదలైంది. జర్నలిస్టు ఎడ్వర్డ్ ఆర్.మరో తన 'సీ ఇట్ నౌ' కార్యక్రమంలో మకార్తీ వైపరీత్యాన్ని చీల్చి చెండాడారు. దారుణాలన్నీ జరిగిపోయిన తర్వాత, జీవితాలన్నీ నాశనమయ్యాక సెనెట్ కూడా మకార్తీని తప్పుపట్టి అభిశంసించింది.

'మెనీ ఆర్ ద క్రైమ్' పేరుతో ఎలన్ ష్రెకర్ ప్రచురించిన పుస్తకంలో మకార్తీయిజం గురించి చాలా విషయాలను ప్రస్తావించారు. మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలంపాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను నడిపే పెద్దమనుషులు తెలివిడితోనే రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారనీ కమ్యూనిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడే పేరుతో దాన్నొక తప్పుగానూ భావించలేదనీ చెప్పారు. విచారణను ఎదుర్కొన్న వారందరూ రాజకీయ అభిప్రాయాలు లేనివారుగానో వామపక్షంతో పూర్తిగా సంబంధంలేనివారుగానో చెప్పలేమనీ ఎలన్ ష్రెకర్ అన్నారు. అయినా దారుణాలను తక్కువ చేయలేమనీ చెప్పారు. మకార్తీయిజం విజృంభణ కాలంలో జులియస్ రోజన్‌బర్గ్, ఎథల్ రోజన్‌బర్గ్ దంపతులకు మరణ శిక్షను విధించారు. వందల మందిని జైల్లో పెట్టారు. దేశ బహిష్కారమూ చేశారు. 10 నుంచి 12 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. రష్యా, జర్మనీల్లో జరిగిన దారుణాలతో పోల్చితే ఈ దురాగతాలు తక్కువైనప్పటికీ అవి సృష్టించిన భయానక వాతావరణంతో అమెరికాలో పదేళ్లపాటు అసమ్మతి ఆవిరైపోయిందనీ ఎలన్ ష్రెకర్ వ్యాఖ్యానించారు.

మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలంపాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ ఎలన్ ష్రెకర్ తన 'మెనీ ఆర్ ద క్రైమ్' పుస్తకంలో పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ ఆయన వ్యాఖ్యానించారు.

1940, 50ల్లో లాగా కమ్యూనిజం ఇప్పుడు కదం తొక్కటంలేదు. ఆ సిద్ధాంతం ఆధారంగా నడిచే పార్టీల బలం అంతంత మాత్రంగానే ఉంది. అయినా అమెరికాలో 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్' అంటూ ఆ సిద్ధాంత ఛాయలు స్పష్టంగా లేని వారిని సైతం లక్ష్యంగా చేసుకోవటం విచిత్రంగానే అనిపిస్తుంది. ట్రంప్‌కూ ఎలాన్ మస్క్‌కూ లెఫ్టిజంలో ప్రమాదం కనపడుతున్నదంటే రాజకీయ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామా 1992లో ఘనంగా ప్రకటించినట్లుగా చరిత్ర అంతం కాలేదని భావించాలి! ప్రత్యామ్నాయ వ్యవస్థలుగా సోషలిస్టు రాజ్యాలు కుప్పకూలిపోవటాన్నీ వామపక్ష భావాల ప్రభావం క్షీణించటాన్నీ చరిత్ర అంతంగా ఫుకుయామా వ్యాఖ్యానించారు. అమెరికా పరిణామాలను చూస్తుంటే ఇంకా అది చల్లారని చరిత్రలాగే ఉంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

'వర్సిటీ' భూములు అమ్మకానికా?

ఈ మధ్య యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి ఒక తమాషా లాంటి భూవివాదం జరుగుతోంది. అది ఇప్పుడు తారాస్థాయికి చేరింది. ప్రైవేట్ వ్యక్తులకు, వ్యవస్థలకు చెందిన భూముల అమ్మకాలు, కొనుగోళ్లు వారి వారి ఇష్టానుసారం జరుగుతాయి. వాటిని రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. కాని, ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల మధ్య జరిగితే అవి జీవోలు, అలాట్‌మెంట్లు, అసైన్‌మెంట్ల ద్వారా జరుగుతాయి. ఆ భూముల్ని రిజిస్ట్రేషన్లు చేస్తే చేసుకోవచ్చు, చేసుకోకపోవచ్చు. ఎందుకంటే, జీఓలు, అలాట్‌మెంట్లు, అసైన్‌మెంట్లు.. రిజిస్ట్రేషన్ లాంటివే కనుక. ఒకసారి ఒక భూమి కేటాయిస్తే దాని వివరాలు ఆ ఊరికి లేక ప్రాంతానికి చెందిన శిస్తు వసూలు వగైరాల కొరకు పహణీలలో నమోదవుతాయి. అలాగే, ఆ భూములు ఎవరి కబ్జాలో ఉన్నాయో, ఎన్నాళ్ల నుండి ఉన్నాయో కూడా అందులో పేర్కొంటారు. కాబట్టి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన భూమి రిజిస్ట్రేషన్ కాలేదనే మిషపై ప్రభుత్వం ఎంతో కొంత వాపసు తీసుకొని అమ్ముకుంటామంటే అది సరియైన పద్ధతి కాదు.

అలాట్ చేయబడిన భూమి చాన్నాళ్ల వరకు వినియోగించుకోకపోతే దానిని ప్రభుత్వం వాపసు తీసుకోవచ్చునని ఒక నిబంధన ఉంటుంది. దీనినే 'రీజనబుల్ టైమ్' అని కూడా అంటారు. ఇది ఇదమిత్థంగా ఉండదు. అది ప్రభుత్వం, కోర్టువారి అభిప్రాయానుసారం ఉంటుంది. ఈ నిబంధన పురస్కరించుకొని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ భూమిని తీసుకుంటున్నామని ప్రభుత్వం అనవచ్చు. అయితే ఈ ఉపయోగించుకోవడం అనేది అంత సులభంగా తేల్చగలిగేదేమీ కాదు. ప్రభుత్వం పర్మిషన్లు వగైరా ఇవ్వడం, ఇవ్వకపోవడంపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. యూనివర్సిటీలకు భూములు వాటి భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొంత ఎక్కువగానే కేటాయిస్తారు. వాటిలో కొంత వెనక్కు తీసుకుంటే భవిష్యత్తులో వాటికి అవసరముంటే అప్పుడు యూనివర్సిటీల పరిస్థితి ఏమిటి? ప్రజోపయోగార్థం భూమి సేకరించడానికి పూనుకుంటే సమాజం అభ్యంతరం తెలియజేయకపోవచ్చు. కాని, భూమిని అంగట్లో పెట్టి అమ్ముకోవటానికి తీసుకోదలచామని ప్రభుత్వం బహిరంగంగానే చెప్పడం హాస్యాస్పదం. అందుకే అటు యూనివర్సిటీ నుంచి, ఇటు సమాజంలోని సామాజిక సంరక్షణకు పాటుపడే ఆచార్య జి.హరగోపాల్ వంటివారు దీనిని చాలా తీవ్రంగా విమర్శించారు. ఆ సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉంది.

ప్రభుత్వ భూములను అమ్ముకోవడానికి ప్రయత్నించడం చాలా కాలం నుంచి జరుగుతూనే ఉంది... మందలించేవారు, ప్రతిఘటించేవారు లేనందువల్ల. ఒకప్పుడు కరీంనగర్‌లో చాలాచోట్ల గుట్టలుండేవి. అవి ఇప్పుడు లేవు. కారణం వీటిని గ్రానైట్ వ్యాపారం కోసం శిథిలం చేస్తూ అమ్ముకుంటున్నారు. కొనేవారు కొంటున్నారు, పర్మిషన్లు ఇచ్చేవారు ఇస్తూనే ఉన్నారు. నేనొకసారి జపాన్‌కు వెళితే అక్కడి ప్రజలు చిన్నాపెద్దా పర్వతాల చుట్టూ ఇళ్లు కట్టుకోవడం కనిపించింది, కాని పర్వతాలను పడగొట్టి, పగలకొట్టి కాదు. వాళ్లకున్న సౌందర్యదృష్టి, పర్యావరణ సంరక్షణ దృష్టి అలాంటిది. ప్రతి యూనివర్సిటీకి ప్రభుత్వం ఎంతో కొంత భూమిని కేటాయిస్తుంది. ఆ భూములు కొంతవరకు అవి వాడుకోవడం లేదు. మరి ఆ భూములన్నీ కూడా ప్రభుత్వం వాపసు తీసుకుంటుందా? ఒకవేళ అలా తీసుకోకపోతే యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన భూమిని తీసుకోవడం పక్షపాతమవుతుంది కదా!

– డా. కొండలరావు వెల్చాల
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమి

నినాదాలపై నిషేధమా?

వందేమాతర ఉద్యమ కాలం నుంచి మొన్నటి తెలంగాణ ఉద్యమం వరకు తెలుగు నేల మీద ఏ ఉద్యమం జరిగినా ఆ పోరాటానికి స్ఫూర్తినిచ్చింది ఉస్మానియా యూనివర్సిటీ. ఓయూ లేనిదే తెలంగాణ ఉద్యమమే లేదు. తెలంగాణ ఉద్యమానికి తొలి నిప్పుకణం అంటుకుంది ఇక్కడే. 107 ఏళ్ల మహోన్నత చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ దేశంలోనే మూడో పురాతన విశ్వవిద్యాలయంగా ప్రసిద్ధి చెందింది. జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ ఉత్తమంగా నిలుస్తోంది. ప్రజాస్వామ్యం, సమానత్వం, న్యాయం వంటి విలువలను ఇక్కడి విద్యార్థులు అలవరచుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి, దేశానికి నాయకత్వాన్ని అందించిన ఘనత ఓయూది. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది తర్వాతికాలంలో మేధావులుగా, శాస్త్రవేత్తలుగా, న్యాయవాదులుగా, రచయితలుగా, ఉద్యమకారులుగా ఆయా రంగాల్లో తమదైన ముద్ర వేశారు. విద్యార్థులు చదువుకోవడమే కాదు సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించే ధైర్యాన్ని వారికి ఇచ్చింది ఉస్మానియా యూనివర్సిటీ. ఈ విశ్వవిద్యాలయం తరం తర్వాత తరానికి సామాజిక స్పృహను, న్యాయమైన గొంతును అందించింది.

భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటన (ఆర్టికల్ 19(1)(A)) స్వేచ్ఛ పరిధి మేరకు దేశంలో ఎక్కడైనా నిరసనలు తెలియజేసే హక్కు పౌరులకు ఉంది. అందుకు ఉస్మానియా యూనివర్సిటీ అతీతమేమీ కాదు. క్యాంపస్‌లో నిరసనలు, ధర్నాలను నిషేధించిన మాత్రాన విద్యార్థులు మౌనంగా ఉంటారనుకుంటే పొరపాటే. నాడైనా.. నేడైనా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులది ధిక్కార స్వరమే. ప్రజాస్వామిక విలువల పునరుద్ధరణే తన ఏడో హామీగా చెప్పి, అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ హామీని మరిచి ఉద్యమాల ఉస్మానియా గొంతు నొక్కడం ఏ విలువలకు నిదర్శనమో సమాధానం చెప్పాలి. క్యాంపస్‌లో, వరండాల్లో, చాంబర్లలో నిరసన తెలిపే హక్కును నిషేధించిన పాలకులు.. తరగతి గదిలో గురువులను ప్రశ్నలడిగితే కూడా నేరమే అనే ఉత్తర్వులు రావడమే ఇక మిగిలి ఉంది. ఈ పరిస్థితి రాకముందే విద్యార్థులు మేల్కొనాలి.

– రాజేష్ నాయక్. జి
బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి (ఓయూ)

రియా: నైతిక పతనంలో న్యూస్ ఛానల్స్



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

రియా చక్రవర్తి దురవస్థ నొక్కిచెప్పినదేమిటి? స్పర్థాత్మక మీడియా జగత్తులో ఒకటి రెండు మినహాయింపులతో న్యూస్ నెట్‌వర్క్స్ అన్నీ తమ నైతిక దిక్సూచిని కోల్పోయాయనే కదూ! అర్థవంతంగా జరగవలసిన వార్తా నివేదన అనవసర సంచలనాత్మకత సంతరించుకోవడం సాధారణమైపోయింది. అసలు ఘటనలపై కాకుండా ఏవో గందరగోళాలపైకి దృష్టి మళ్లేలా చేయడంలో న్యూస్ టీవీ ఆరితేరిపోయింది.

ఇతరుల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే జర్నలిస్టులు తమ వృత్తిధర్మ నిర్వహణ విషయమై చిత్తశుద్ధితో ఆత్మ పరిశీలన చేసుకోవడం అరుదు అని పలువురు తరచు విమర్శిస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి గృహంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు లభించడంపై న్యూస్ టీవీ ఛానెల్స్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాయి. అది సహేతుకమే. న్యాయమూర్తుల ప్రవర్తనలోని మంచి చెడులను నిర్ణయించేదెవరు? అని న్యూస్ యాంకర్లు తీక్షణంగా ప్రశ్నించారు. ఇది జరిగిన 24 గంటల అనంతరం సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్యకేసులో తమ దర్యాప్తును ముగించినట్టు సీబీఐ ఒక నివేదికను కోర్టుకు నివేదించింది. సుశాంత్ మరణానికి ఆత్మహత్యే కారణమని, ఆ ఘటనకు ఇతర అసహజ కారణాలు ఏవీ లేవని సీబీఐ స్పష్టం చేసింది. ఈ దర్యాప్తు నివేదికపై మీడియాలో ఎటువంటి గగ్గోలు లేదు. చర్చలేవీ జరగలేదు సుశాంత్ మరణానికి దారితీసిన కారణాలు నిజంగా ఏమిటనేవి తెలుసుకోవాలని ప్రజలు అభిలషిస్తున్నారు. సుశాంత్ స్నేహితురాలు రియా చక్రవర్తి శీల హననానికి పాల్పడినవారు 'నేను తప్పు చేశాను' అని ఒప్పుకున్నారా లేదా అనే విషయాన్ని కూడా ప్రజలు తెలుసుకోవలసి ఉన్నది. అయితే ఇవేమీ జరగలేదు.

ప్రతిభావంతుడు అయిన బాలీవుడ్ నటుడు జూన్ 2020లో ముంబైలోని తన గృహంలో మరణించినట్టు పోలీసులు కనుగొన్నారు. ఈ యువ నటుడి మరణంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. సుశాంత్ మరణంలో యువ నటి రియా చక్రవర్తి ప్రమేయముండవచ్చని ఆరోపణలు వచ్చాయి. సుశాంత్ మరణంపై తలెత్తిన వివాదానికి ఆమే కేంద్రమయింది. ఇది ఆమెకు ఊహించని పరిణామం. వారాలు, నెలల తరబడి రియాను, ఆమె కుటుంబాన్ని మీడియా వెంటాడింది. పోలీసు దర్యాప్తును ఎదుర్కొన్నారు. సుశాంత్ మరణంలో రియా, ఆమె కుటుంబం ప్రమేయం ఉండి ఉంటుందని న్యూస్ టీవీ ఘోషించింది. తొలుత ప్రైమ్ టైమ్ టీవీ కథనాలు సుశాంత్ ఆత్మహత్య చేసుకునేలా అతడిని రియా, ఆమె కుటుంబమే ప్రేరేపించి ఉంటుందని సూచించాయి. ఆ తరువాత సుశాంత్ ఆత్మహత్య చేసుకోలేదని, హత్యకు గురయ్యాడని, అందుకు జరిగిన కుట్రలో రియా భాగస్వామి అని అభియోగాలు మోపాయి. సుశాంత్ ఆస్తులను కైవశం చేసుకునేందుకు రియా కుట్ర పూరితంగా ప్రయత్నించిందని ఆరోపించిన న్యూస్ టీవీ ఒక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలో భాగస్వామిగా ఉందని కూడా ఆమెను చిత్రించాయి. ఇలా ఆ యువ నటి పట్ల ద్వేషపూరితంగా ఎడతెగని దుష్ప్రచారం చేశాయి. అంతేనా? సుశాంత్‌కు చేతబడి చేసిందని కూడా విమర్శించాయి. రియాను 'మంత్రగత్తె' అని పేర్కొంటూ ఆమెను తీవ్రంగా దూషించాయి. సామాజిక మాధ్యమాల వైఖరి మరింత ఘోరంగా, భయానకంగా ఉన్నది. 'సుశాంత్‌కు న్యాయం జరగాలి' అనే ఉద్యమాన్ని ఆరంభించాయి. సుశాంత్ విషాద మరణానికి రియానే కారకురాలు అని గొంతుచించుకున్నాయి. ఈ ఆరోపణలు ఏవీ అప్పుడూ ఇప్పుడూ రుజువు కానేలేదు. అవి పూర్తిగా నిరాధారమైనవి. అయినప్పటికీ ఆమె ఒక నెలరోజుల పాటు జైలు వాసం చేయవలసివచ్చింది. న్యూస్ టీవీ తీరుతెన్నుల ఫలితంగానే ఈ శోచనీయమైన పరిణామాలు సంభవించాయి.



రియాపై విమర్శలు, ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఇప్పుడు రుజువయింది. మరి ఐదు సంవత్సరాల క్రితం అప్పుడే ప్రారంభమైన వృత్తి జీవితం దాదాపుగా అంతమై పోయింది. ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లదలుచుకున్న ఆమె సోదరుడి స్వప్నాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో దర్యాప్తు ఛిద్రం చేసింది. రియా తండ్రి సైనిక వైద్యుడు. పాతికేళ్లకు పైగా మన భౌగోళిక సరిహద్దుల రక్షకులకు ఆయన వైద్య సేవలు అందించారు. అయినా మీడియాలోని తోడేళ్ల గుంపు ఆయన్నీ వదలలేదు. తమ ఛానెల్‌కు టీఆర్‌పీ రేట్లను పెంచడమే లక్ష్యంగా పనిచేసే న్యూస్ యాంకర్ల మూలంగా ఒక మధ్యతరగతి వృత్తి నిపుణుల కుటుంబం సర్వనాశనమయింది. ఇదంతా కోవిడ్ విలయంలో చోటుచేసుకున్న మరో విషాదం. దేశమంతా లాక్‌డౌన్‌లో మగ్గిపోయిన కాలమది. సామాజిక దూరం నిబంధనలు పాటించేందుకు ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయిన రోజులవి. అటువంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో తీసుకోవలిసిన జాగ్రత్తలపై ప్రజలకు మార్గదర్శకత్వం వహించాల్సిన మీడియా 'ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం' పేరిట పూర్తిగా అవాంఛనీయమైన వార్తలతో ప్రజలను తప్పుడు రీతుల్లో ఉద్దీపింపచేయడం జరిగింది.

రియా చక్రవర్తి దురవస్థ నొక్కి చెప్పుతున్నదేమిటి? స్పర్థాత్మక మీడియా జగత్తులో ఒకటి రెండు మినహాయింపులతో న్యూస్ నెట్‌వర్క్స్ అన్నీ తమ నైతిక దిక్సూచిని కోల్పోయాయనే కదూ! 1990ల నడిమి సంవత్సరాలలో ఎంతో ఆశాజనకంగా ఆరంభమైన ప్రైవేట్ న్యూస్ టీవీ విప్లవాన్ని, టెలివిజన్ రేటింగ్ పాయింట్స్‌లో ప్రథమ స్థానంలో ఉండి తీరాలనే ఆరాటంతో అనైతిక మార్గంలో ముందుకు సాగిన మీడియా సంస్థలు పూర్తిగా వ్యర్థపరిచాయి. ఆ విప్లవం నిరర్థకమైపోయింది. అర్థవంతంగా జరగవలసిన వార్తా నివేదన అనవసర సంచలనాత్మకత సంతరించుకోవడం సాధారణమైపోయింది. అసలు ఘటనలపై కాకుండా ఏవో ఘోషలు, గందరగోళాలపైకి దృష్టి మళ్లేలా చేయడంలో న్యూస్ టీవీ ఆరితేరిపోయింది. దుష్ట స్వభావాలు, స్త్రీ ద్వేషం వలలో రియా చిక్కుకుపోయింది. ఒక స్వతంత్ర మహిళ, తన సొంత పేరు ప్రతిష్ఠలకు బాధితురాలు అయింది. లోకులను హీరోలు, విలన్లుగా విభజించిన మీడియా జగత్తు రియాను ఒక వగలాడి, లేదా దుష్టురాలుగా పరిగణించింది. 'సుశాంత్ ప్రభవిస్తున్న నటుడు. ఉజ్వల భవిష్యత్తు ఉన్నవాడు. రియాకు సహచరుడు. అమాయకుడు అయిన ఆ యువ నటుడిని ఆ 'స్వార్థ స్వభావి' తన సుఖ సౌఖ్యాలు, వృత్తిగత ఎదుగుదలకు తెలివిగా ఉపయోగించుకుంది'. వార్తల ముసుగులో ప్రసారితమవుతున్న టీవీ సీరియల్స్‌కు ఇంతకంటే మంచి ఇతివృత్తం మరొకటి ఉంటుందా?

ఇక ఇప్పుడు అసలు ప్రశ్నకు వస్తాను: రియాను దూషించిన, ఆమె గౌరవాన్ని మంటగలిపిన వారిని తమ దుర్మార్గానికి జవాబుదారీలుగా చేయడం ఎప్పటికైనా జరుగుతుందా? రియా ఉదంతం కేవలం ఒక వ్యక్తి పరువుకు నష్టం కలిగించిన వ్యవహారం మాత్రమే కాదు. జర్నలిస్టులు అందరూ వార్తారచన ప్రక్రియలో పొరపాట్లు చేసే అవకాశమున్నది. తప్పుడు సమాచారమందించినందుకు పాత్రికేయులు తరచు లేదా అప్పుడప్పుడు క్షమాపణలు చెప్పుతుండడం కద్దు. అయితే రియా కేసు భిన్నమైంది. అది అధర్మ పాత్రికేయానికి ఒక తిరుగులేని నిదర్శనం. సుశాంత్ ఆత్మహత్య విషయంలో తాను చెప్పవలసిన విషయాలను వెల్లడించేందుకు అవకాశం లభించని ఒక నిస్సహాయ యువతి జీవితాన్ని గౌరవాన్ని మంటగలిపేందుకు బుద్ధిపూర్వకంగా చేసిన ప్రయత్నమది. ఆ క్లిష్ట కాలంలో ఆమె గోడు ఎవరు విన్నారు? ఆగస్టు 2020లో కన్నీటి పర్యంతమవుతూనే విరాగినిలా నిర్లిప్తంగా ఉండిపోయిన రియాను నేను ఇంటర్వ్యూ చేశాను. ఆమెతో మాట్లాడడానికి, ఆమె చెప్పేదాన్ని స్థిమితంగా, సానుభూతితో వినడానికి ప్రప్రథమంగా జరిగిన ప్రయత్నమది. ఆమెతో సంభాషించడం ద్వారా ఒక పాత్రికేయుడుగా నా విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాను. అయితే రియాను ఇంటర్వ్యూ చేసినందుకు సామాజిక మాధ్యమాలలో నాపై నిరసన వెల్లువెత్తింది. నన్ను పదే పదే విమర్శించారు. దూషించారు. రియాను కాపాడేందుకు నేను ప్రయత్నిస్తున్నట్టు దుయ్యబట్టారు.

ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. రియా విషయంలో నా వైఖరి పూర్తిగా కాకపోయినప్పటికీ సరైనదేనని రుజువయింది. రియా తీవ్ర వ్యాకులత నెదుర్కొన్నది. అయితే ధైర్యంగా నిలబడింది. ఆమె నిజాయితీ నిరూపితమయింది. ఆమె జీవితంలో ఆశాజ్యోతి కొడిగట్టలేదు.. అయితే రియా ఎదుర్కొన్న భయానక పరిస్థితులు ముగింపునకు వచ్చేది ఆమెను ఆ కష్టాల పాలుచేసినవారు తమ దుర్మార్గానికి భారీ మూల్యం చెల్లించేలా చేసినప్పుడే అని నిక్కచ్చిగా చెప్పుతున్నాను. న్యూస్ టీవీ విశ్వసనీయతను, మీడియాపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే రియాకు ఎదురైన అనుభవాలు పునరావృతం కాకూడదు. రియా తన జీవితంలో ఐదేళ్ల విలువైన కాలాన్ని కోల్పోయింది. కోల్పోయిన గౌరవాన్ని పొందేందుకు ఆమె పరిపూర్ణంగా అర్హురాలు. రియాకు బేషరతు క్షమాపణలు ఆమె గౌరవ పునరుద్ధరణకు శుభారంభం కాగలదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

గడబిడల గులాబీ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భారత రాష్ట్ర సమితి పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. ముఖ్య నాయకులు ఆధిపత్య పోరులో మునిగిపోవడం అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. ముఖ్యంగా వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి నియోజకవర్గాల్లో నాయకులు ఎవరికి వారే యమునాతీరే అనే చందంగా తయారయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఆశలు పెట్టుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఇప్పటి నుంచే వర్ధన్నపేట నియోజకవర్గంపై దృష్టి సారించారు. పునర్విభజనలో జనరల్ స్థానం అవుతుందని, తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తానని చెబుతున్నారు. దీంతో వర్ధన్నపేట ఇన్‌చార్జ్ పదవికి ప్రాముఖ్యత ఏర్పడింది. కాగా, దీనిని ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఇవ్వాలని జనగామ ఎమ్మెల్యే పల్లా పట్టుబడుతుండగా, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డికి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ అంశం ఎర్రబెల్లికి కంటకంగా మారింది. ఇదిలా వుండగా, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడుతుందనే ఆశలో గులాబీ నేతలు ఉన్నారు. దీంతో ఇప్పటి నుంచే ఆ స్థానం ఎలాగైనా దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన స్థానికుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకోవాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ విషయాన్ని గులాబీ బాస్ ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలో సిరికొండ - గండ్ర మధ్య వార్ నడుస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ హోదాలో నియోజకవర్గంలో పర్యటిస్తున్న మధుసూదనాచారిపై వెంకటరమణారెడ్డి గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరుపై అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ రజతోత్సవ సభ ఎలా నిర్వహించాలని సంశయంలో పడింది. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని ఎల్కతుర్తిని సభకు ఎంపిక చేసిందని, ఆ జిల్లా నాయకులకే పార్టీ అధిష్ఠానం నిర్వహణ బాధ్యతలు అప్పగించిందని ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- పార్టీ నిర్ణయాల్లో పట్టుకోసం ఎత్తుకు పైఎత్తులు
- వర్ధన్నపేటపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కన్ను
- 'ఇన్‌చార్జ్' పదవి కోసం పెరుగుతున్న పోటీ
- రాకేష్‌రెడ్డి లేదా పోచంపల్లికి ఇవ్వాలని ప్రతిపాదనలు
- 'స్టేషన్'లో ఉప ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యాచరణ
- అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకోవాలని ఒత్తిడి
- భూపాలపల్లిలో సిరికొండపై గండ్ర గరం గరం
- నియోజకవర్గంలో పర్యటనలు చేయడంపై గుర్రు
- నేతల సమన్వయ లోపంపై అధిష్ఠానం అసంతృప్తి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలకు 'రజతోత్సవ' బాధ్యతలు

7

ఎట్టకేలకు దేవాదుల మోటార్లు ప్రారంభం



దేవన్నపేటలో దేవాదుల నీటికి పూజలు చేస్తున్న మంత్రులు

- దేవన్నపేట ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లు ఆన్‌చేసిన మంత్రులు
- పాల్గొన్న ఉత్తమ్, పొంగులేటి, ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, యశస్విని
- ఊపిరి పీల్చుకున్న మంత్రులు, అధికారులు

7

మహా కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ

- ఎల్కతుర్తిలో 1300 ఎకరాల్లో బీఆర్‌ఎస్ సభ
- కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలి
- మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి

ఎల్కతుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 27న ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ మరో కుంభమేళాను తలపించేలా ఉంటుందని మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో పాటు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. ఈ మేరకు గురువారం సభ నిర్వహణకు ఎల్కతుర్తి - చింతలపల్లి గ్రామ శివారులో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. బీఆర్‌ఎస్ సభ నిర్వహణకు 1300 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందుకు సంబంధించిన రైతులతో మాట్లాడి వారి వద్ద నుంచి ఒప్పంద పత్రాలను సేకరిస్తున్నారు. సభకు తరలి వచ్చే ప్రజలకు సభ ప్రాంగణం కేవలం 500 మీటర్ల లోపు పార్కింగ్ ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని సుర వైన్స్ షాపు పరిసరాల్లో వరంగల్ మీదుగా వచ్చే వాహనాలకు, కరీంనగర్, సిద్ధిపేట మీదుగా వచ్చే వాహనాలకు ఇందిరానగర్ సమీపంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సభ ఏర్పాటు కోసం మండల నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా నెల పాటు శ్రమించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కోరారు. సభ విజయవంతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు.

అనువుగా ఎల్కతుర్తి ప్రాంతం

బీఆర్‌ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించడానికి మాజీ సీఎం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు నాయకులు ఎల్క తుర్తి, చింతలపల్లి గ్రామాల శివారులోని ఉన్న స్థలాన్ని వారు పరిశీలించి ఖరారు చేశారు. వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్ జిల్లాల సమీపంలో ఎల్కతుర్తి మండల కేంద్రం ఉండడంతోపాటు ఎల్కతుర్తి శివారులో సభ నిర్వహిస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా మీదుగా ఉమ్మడి ఖమ్మం, నల్గొండ ప్రాంత ప్రజలు, ఉమ్మడి మెదక్ జిల్లా మీదుగా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రజలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా ప్రాంతాలకు చెందిన ప్రజలు సభకు రావడానికి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.



ఎల్కతుర్తిలో స్థల పరిశీలనకు వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు

రూట్ మ్యాప్ సిద్ధం

బీఆర్‌ఎస్ పార్టీ సభ నిర్వహణకు రూట్ మ్యాప్‌లను రూపొందించారు. సభకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ దూరం నడవకుండా కేవలం 500మీటర్ల లోపు వాహనాలను పార్కింగ్ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నాయకుల సలహాలు, సూచనలను తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, నాయకులు పోరెడ్డి రవిందర్‌రెడ్డి, నగేష్, శేషగిరి, గొల్లే మహేందర్, గడ్డం రవి, శ్రీకాంత్‌యాదవ్, వినయ్, సమ్మయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఏఆర్ అశోక్‌బాబు టర్మినేషన్‌కు రంగం సిద్ధం

- మనోహర్ కమిటీ రిపోర్టు అందచేత
- నేటి పాలక మండలి సమావేశంలో నిర్ణయం

6

ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రదాయిని 'సుర్మా'

- రంజాన్ మాసంలో ఓ పవిత్ర కార్యం.. నేత్రాలంకరణ
- కోహితూర్ పర్వతం భస్మ చూర్ణమే ఇది

7

నర్చరింగ్ సైబర్ హుడ్ చాలెంజ్‌లో నగరానికి స్థానం

- దేశవ్యాప్తంగా 9 నగరాల్లో వరంగల్‌కు చోటు
- హర్షం వ్యక్తం చేసిన మేయర్ సుధారాణి



డబ్ల్యుఆర్‌ఐ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నర్చరింగ్ సైబర్ హుడ్ చాలెంజ్ ఫేజ్-2లో వరంగల్ నగరానికి చోటు దక్కింది. గురువారం కేంద్ర ప్రభుత్వ డబ్ల్యుఆర్‌ఐ ప్రతినిధులతో బల్దియా కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో నర్చరింగ్ సైబర్ హుడ్ చాలెంజ్ ఫేజ్-1లో వరంగల్ నగరం పార్కుల నిర్వహణ, ఏర్పాటులో చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని అన్నారు. అదే విధంగా ఫేజ్-2లో దేశవ్యాప్తంగా ఎంపికచేసిన 9నగరాల్లో వరంగల్ నగరానికి చోటు దక్కడం సంతోషకరమని అన్నారు. నగరంలో చేపడుతున్న పనులపై కేంద్ర ప్రతినిధులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశ్లేషించామని అన్నారు. నియోజకవర్గానికి ఒక మోడల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు సంతోష్ బాబు, శ్రీనివాస్, డీఈ కార్తీకరెడ్డి, ఏఈ శ్రీకాంత్, డబ్ల్యుఆర్‌ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే..

- 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపి వేయాలి
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు
- తరాలపల్లిలో విప్లవవీరుడు సారయ్యకు కన్నీటి వీడ్కోలు

6



మావోయిస్టు సారయ్య భౌతికకాయం వద్ద విప్లవ జోహార్లు అర్పిస్తున్న అమరులు, బంధుమిత్రుల సంఘం నేతలు

సెర్ప్ లక్ష్యాలను సాధించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని, అందుకోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌తో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలన్నారు. ప్రస్తుతం 33శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ సీజన్ నుంచి 50శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళాసంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. స్వశక్తి మహిళా సంఘాలతో రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని, పౌర సరఫరాల శాఖ, సెర్ప్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్ధులు ఎవరైనా మరణిస్తే వారి జీవిత భాగస్వామికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారని, ఇందుకోసం ముందుగా జిల్లాస్థాయిలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి బజార్‌లలో ప్రజలకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా చూసుకోవాలని లోకేష్ కుమార్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు

జర్నలిస్టులకు రైల్వే టికెట్లలో రాయితీ ఇవ్వాలి

రాజ్యసభలో ప్రస్తావించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మట్టెవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు రైల్వే టికెట్లలో 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. జర్నలిస్టులు చాలా వరకు మధ్య తరగతి వారేనని, విధి నిర్వహణలో భాగంగా వారు నిత్యంరైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారని వివరించారు. కొవిడ్ కారణంగా ఎత్తివేసిన రాయితీ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. ఈ విషయంలో వారు మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాజానికి తమ విలువైన సేవలందిస్తున్న జర్నలిస్టులకు రైల్వే టికెట్లలో 50 శాతం రాయితీ కల్పించడం సముచితమని వివరించారు.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ప్రకటించింది. శనివారం అమావాస్య, ఆదివారం ఉగాది పండుగ, సోమ, మంగళవారాలు రంజాన్ పండగ సెలవులు ఉన్నందున తిరిగి ఏప్రిల్ 2 బుధవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా సాగుతాయని మార్కెట్ కార్యదర్శి రెడ్యా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రేపు భద్రకాళి అమ్మవారి ఒడిబియ్యం వేలంపాట

వరంగల్ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యాన్ని వేలం వేస్తున్నట్లు ఈవో శేషు భారతి ప్రకటించారు. దాదాపు 20 క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం ఆలయ ప్రాంగణంలో వేలం పాట ద్వారా విక్రయిస్తామని, ఇందులో పాల్గొనే వారు రూ.5వేలు ధరావత్ సొమ్ము డీడీ రూపంలో చెల్లించాలని, ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

6న జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ పోటీల్లో 1జనవరి 2006, ఆ తరువాత సంవత్సరం జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ విజయం సాధించిన 4గురు బాలురు, 4గురు బాలికలు మే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ వెంట చెస్ బోర్డును తీసుకొని ఏప్రిల్ 6న టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని కన్నా వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

200 గజాలకు రూ.14.46కోట్ల చార్జీలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక తప్పిదం

జనగామ వాసికి వింత అనుభవం

జనగామ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం తీసుకొచ్చిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) దరఖాస్తు ప్రక్రియలో ఓ వ్యక్తికి వింత అనుభవం ఎదురైంది. జనగామ జిల్లాకేంద్రానికి చెందిన కారంపూరి శ్రీనివాస్‌కు పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో 200 గజాల స్థలం ఉంది. ఈ ప్లాట్ క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ కింద బుధవారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. ఆన్‌లైన్‌లో అడిగినట్లుగా సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయగా ఎల్ఆర్ఎస్ కింద రూ.14.46 కోట్లు ఛార్జీలు చెల్లించాలని ఆన్‌లైన్‌లో చూపించింది. దీంతో శ్రీనివాస్ అవాక్కయ్యాడు. ఏం చేయాలో తెలియక శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'ని సంప్రదించాడు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా దృష్టికి తీసుకెళ్లగా.. సాంకేతిక కారణాలతో పలుచోట్ల ఇలా జరుగుతున్నాయని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే..

- 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలి
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు
- తరాలపల్లిలో విప్లవవీరుడు సారయ్యకు కన్నీటి వీడ్కోలు



ఎర్ర జెండాలతో పాటలు పాడుతూ సారయ్య అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న బంధుమిత్రులు

మడికొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే అని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టు ఉద్యమంపై చేస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. కాజీపేట మండలం తరాలపల్లిలో మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధాకర్ అలియాస్ మురళి అంత్యక్రియలు గురువారం జరిగాయి. అంత్యక్రియల్లో అమరుల బంధుమిత్రుల సంఘం, విప్లవ రచయితల సంఘం, పౌరహక్కుల సంఘం నాయకులు పాల్గొని సారయ్యకు కన్నీటి వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో సహజ వనరులు, ఖనిజ సంపదను దోచుకోవడానికి ఆపరేషన్ కగార్ పేరిట తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తూ వేలాది మంది ఆదివాసీలు, మావోయిస్టులను చంపారన్నారు. విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాణి మాట్లాడుతూ.. విప్లవ భావజాలాన్ని కలిగి ఉండటం నేరం కానప్పటికీ విప్లవ రాజకీయాలను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు రాజ్యాన్ని అమలు చేస్తోందన్నారు. హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మావోయిస్టు పార్టీపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. హక్కుల కోసం, భూమి కోసం, సహజవనరుల రక్షణకోసం ఉద్యమిస్తున్న వేలాది మంది ఆదివాసీలను, మావోయిస్టులపై ఉక్కుపాదం మోపి అడవుల్లో రక్తం పారిస్తుందన్నారు. అమరుల బంధుమిత్రుల సంఘం నేతలు అంజమ్మ, పద్మకుమారి మాట్లాడుతూ.. సారయ్య ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కాగా, సారయ్య అంతిమ యాత్ర సందర్భంగా తరాలపల్లి ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. అమరుడు సారన్నకు లాల్ సలామ్.. అంటూ విప్లవ నినాదాలతో దద్దరిల్లింది. అమర వీరులను స్మరించుకుంటూ కళాకారులు పాడిన పాటలతో ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. అమరుల బంధుమిత్రుల సంఘం, కళాకారుల పాటలతో సారయ్య అంతిమయాత్ర ఇంటివద్ద నుంచి గ్రామశివారులోని ఆయన తమ్ముడి పొలం వద్దకు చేరుకుంది. తమ్ముడు రవీందర్ కుమారుడు హరిచందర్ సారయ్య చితికి నిప్పంటించాడు.

అంతిమయాత్రలో మాజీ మావోయిస్టు భారతక్క, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మక్క, కార్యదర్శి శాంతక్క, తెలంగాణ ఉద్యమ పార్టీ వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్య, మాజీ మావోయిస్టు గంగుల రాజిరెడ్డి, పాల్గొన్నారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, సారయ్య భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

విమల్ పాన్‌మసాలా సీజ్

వరంగల్ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ, వేబిల్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించి రెండు వాహనాల్లో తరలిస్తున్న విమల్ పాన్‌మసాలాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ టీం మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో ట్రాలీ ఆటో, కంటైనర్‌లో నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న రూ.12,80,000 విలువ చేసే పాన్‌మసాలాను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

విషపురుగు కాటుతో వంగర ఎస్ఐకి అస్వస్థత



ఎస్ఐ దివ్య

భీమదేవరపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ఎస్ఐ దివ్యకు విష పురుగుకాటుతో అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా, గుర్తు తెలియని విషపురుగు కాలుకు కాటు వేసి గాయపరచడంతో కొంత అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి ముల్కనూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. గురువారం సాయంత్రం వరకు వరంగల్ ఎంజీఎంలోనే ఎస్ఐ దివ్య చికిత్స పొందారు. విష పురుగుకాటుతో ఎస్ఐ దివ్య అస్వస్థతకు గురైనట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

ఎత్తిపోతల పెండింగ్ నిధులు విడుదల చేయాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే రేవూరి



గీసుగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలంలోని కొనాయిమాకుల వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పూర్తి పనులకు పెండింగ్ నిధులను విడుదల చేయాలని గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనాయిమాకుల ఎత్తిపోతలకు శంకుస్థాపన చేశారని ఆయన తెలిపారు. 95 శాతం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. అయితే పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే మేనెలలో ఎత్తిపోతలను ప్రారంభించవచ్చని ఎమ్మెల్యే వివరించారు. కాగా, 14 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటిపై..



వర్ధన్నపేట: వర్ధన్నపేట నియోజకవర్గంతో పాటు మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల వరకు సుమారు లక్షయాభై వేల ఎకరాల సాగునీరు అందుతుందని, దీనిని రీజనరేషన్ చేయాల్సిన అవసరం ఉందని శాసనసభలో గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సారెస్పీ డీబీఎం 48 ప్రధానంగా కాకతీయ కెనాల్‌ను గతంలో మంత్రిగా కడియం శ్రీహరి పని చేసినప్పుడు ప్రారంభించారని, నాటి నుంచి నేటి వరకు కెనాల్ కాలువలో పూడిక తీయలేదని అన్నారు. కనీసం శుభ్రం చేయలేదని, దీంతో కెనాల్‌కి నీరు విడుదల చేసినప్పుడు నీరు అంత పక్కదారి పట్టి వృథా అవుతూ చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని ప్రస్తావించారు. ఈ సమస్యను సంబంధిత నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని అసెంబ్లీలో కోరారు.

కేయూ ఏఆర్ అశోక్‌బాబు టర్మినేషన్‌కు రంగం సిద్ధం

- ప్రొఫెసర్ మనోహర్ కమిటీ రిపోర్టు అందచేత
- నేటి పాలక మండలి సమావేశంలో నిర్ణయం

కేయూ క్యాంపస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసి సస్పెన్షన్‌లో ఉన్న పెండ్లి అశోక్‌బాబు టర్మినేషన్‌కు రంగం సిద్ధమైనట్లు విశ్వనీయ సమాచారం. కాకతీయ యూనివర్సిటీ న్యూ పీజీ హాస్టల్ సమీపంలో వర్సిటీ భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మించుకోవడంతోపాటు మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ సహకారంతో తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అశోక్‌బాబు మేనేజ్ చేసుకున్నాడనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా, కేయూలో అశోక్‌బాబు గాంధీ జయంతి రోజున గందరగోళం సృష్టించారు. అలాగే అప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదులతో ఉద్యోగంలోంచి సస్పెండ్ చేశారు. అదే క్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, అకూట్, విద్యార్థి సంఘాల ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలో జరిగిన అక్రమాలు, అవినీతి, భూకబ్జాలపై విజిలెన్స్ కవిటీని ఏర్పాటు చేసింది. విజిలెన్స్ కమిటీ వర్సిటీ భూములపై సర్వే నిర్వహించింది. ఏఆర్ అశోక్‌బాబు నిర్మించుకున్న ఇల్లు వర్సిటీకి చెందిన స్థలంలోనే ఉందని కమిటీ తెల్చి చెప్పింది. రెవెన్యూ అధికారుల సిఫార్సుల మేరకు మున్సిపల్ అధికారులు అశోక్‌బాబు ఇల్లును కూల్చివేసేందుకు నోటీస్‌లను జారీ చేశారు. కోర్టు నోటీసులు, తనపై సస్పెన్షన్ వేటుపై అశోక్‌బాబు కోర్టు తలుపుతట్టారు. అయితే కోర్టులోనూ అశోక్‌బాబుకు చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ నేతృత్వంలో సీనియర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌తోపాటు ఏఆర్ పి.శ్రీధర్‌లతో కమిటీని నియమించారు. కమిటీ అశోక్‌బాబును విచారించి తన వాదనను రికార్డు చేసింది. కాగా, కమిటీ ఇటీవల వర్సిటీ ఉన్నతాధికారుకులకు రిపోర్టును సమర్పించింది. రిపోర్టులో అశోక్‌బాబు ఇల్లు అక్రమమేనని తెల్చింది.

టర్మినేషన్‌కు రంగం సిద్ధం

వర్సిటీ భూకబ్జా ఆరోపణలు నిజం కావడంతో అశోక్‌బాబును ఉద్యోగంలోంచి శాశ్వతంగా టర్మినేషన్ చేసేందుకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈనెల 28న శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో వర్సిటీ పాలకమండలి సమావేశం జరగనుంది. పాలకమండలిలో అశోక్‌బాబుపై కీలక చర్చ జరుగనుంది. అన్ని పరిశీలించిన అనంతరం అశోక్‌బాబును శాశ్వతంగా ఉద్యోగంలోంచి తొలగించే అవకాశాలున్నట్లు విశ్వనీయంగా తెలుస్తోంది.

వాటర్‌ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

- రెండు వాహనాల మధ్య ఇరుక్కుని యువకుడి మృతి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ



వాటర్ ట్యాంకర్, ఇసుక లారీల మధ్య ఇరుక్కున్న హరీష్ మృతదేహం, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై మొక్కలకు నీళ్లుపట్టే వాటర్ ట్యాంకర్‌ను వెనుకాల ఇసుక లారీ ఢీకొట్టిన ఘటనలో రెండు వాహనాల మధ్య ఇరుక్కొని యువకుడు గురువారం దుర్మరణం చెందాడు. స్థానికులు పోలీసుల కథనం ప్రకారం... జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్‌కు చెందిన బండ హరీష్(28) జాతీయ రహదారి పైన మొక్కలకు నీళ్లపోసే వాటర్ ట్యాంకర్‌పై హెల్పర్‌గా (చెట్లకు నీళ్ల పట్టే పనిలో) పనిచేస్తున్నాడు. ఇతడికి భార్యశ్రావణి, ఏడాదిన్నర బాబు, మూడు నెలల వయసున్న కూతురు ఉన్నారు. రోజు లాగే ఛాగల్ శివారు ఇందిరానగర్ సమీపంలో రహదారిపైన మొక్కలకు ట్యాంకర్ వెనుకాల కూర్చొని నీళ్లపడుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీ ట్యాంకర్‌ను వెనకాల వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్ వెనుకాల కూర్చొని నీళ్ల పడుతున్న హరీష్ రెండు వాహనాల మధ్య ఇరుక్కొని నుజ్జునుజ్జయి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాల మధ్య ఇరుక్కొన్న మృతదేహన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఘటనా స్థలాన్ని డీసీపీ రాజమహేంద్రనాయక్, సీఐ జి.వేణు పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

వాగ్దేవి కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వాగ్ధేవి స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయంప్రతిపత్తి విద్యారంగ ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ శేషాచలం మాట్లాడుతూ.. 56.65 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ వాహిని దేవి, తదితరులు పాల్గొన్నారు.

నల్లమట్టి కొనుగోలుకు ఆహ్వానం

మామునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువులో పూడికతీసిన మట్టిని విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. కావలిసిన వ్యక్తులు 1క్యూబిక్ మీటర్‌కు రూ.71.83 రూపంలో చెల్లించి కార్యనిర్వాహక ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్ నెం.2 నక్కలగుట్ట హనుమకొండ కార్యాలయంలో సంప్రదించాలని ఇరిగేషన్ ఈఈ ఎం.శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 95154483828, 9440638401 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



రేణికుంది శ్రీనివాస్, ఎం.మధుకర్‌రావు, పి.శ్రీనివాస్

వరంగల్ మెడికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ 2025-28 కాలానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురువారం కెమిస్ట్ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఎలక్షన్స్ ఆఫీసర్స్ నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా తోట శివాజీ, అధ్యక్షుడిగా రేణికుంది శ్రీనివాస్, కార్యదర్శి మోత్కూరి మధుకర్‌రావు, కోశాధికారి పాకాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్, సహాయ కార్యదర్శి కె.వెంకట్ రాఘవరెడ్డి, హోల్‌సేల్ వింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మయ్య, రిటైల్ వింగ్ ప్రెసిడెంట్ అన్నం అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు.

యువ వికాసం పథకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిందని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ జిల్లా అధికారి దాసరి మురళీధర్‌రెడ్డి తెలిపారు. అర్హులైన క్రైస్తవులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు / ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం / బాప్టిజం సర్టిఫికెట్, పట్టాదారు పాసు బుక్కు (నీటిపారుదల సంబంధిత పథకాలకు), సదరం సర్టిఫికెట్ (వికలాంగులకు), రవాణా సంబంధిత పథకాలకు (డ్రైవింగ్ లైసెన్స్) కలిగి ఉన్న నిరుద్యోగులు ఏప్రిల్ 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని మురళీధర్‌రెడ్డి కోరారు.

హర్షితకు స్మారక బంగారు పతకం ప్రదానం

- వరంగల్ నిట్‌లో రమణారావు స్మారకోపన్యాసం
- పాల్గొన్న నిట్ పూర్వ విద్యార్థులు



ప్రొఫెసర్ రమణారావు స్మారక బంగారు పతకాన్ని అందుకుంటున్న బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థిని ఆర్.హర్షిత సజ్జన్

హనుమకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్ ఏవీ రమణారావు 8వ స్మారకోపన్యాసం జరిగింది. ఎంఎంఈడీ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ ఆన్‌లైన్ ద్వారా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, అలుమ్ని వ్యవహారాలు డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కిశోర్ బాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లేబోరేటరీ (డీఎంఆర్ఎల్) శాస్త్రవేత్త జగన్‌రెడ్డి ఇంజనీరింగ్‌లో అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతపై మాట్లాడారు. 1964-1969 ఎంఎంఈ విభాగం బ్యాచ్ అలుమ్ని ఏవీ శేషగిరిరావు, కల్నల్ దాట్ల రాజు పాల్గొని ప్రొఫెసర్ రమణారావుతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు. డాక్టర్ శుక్ల మండోల్ స్వాగతోపన్యాసం చేశారు. మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రొఫెసర్ రమణారావు స్మృత్యర్థం ప్రవేశపెట్టిన బంగారు పతకాన్ని ఈసారి అన్ని అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థిని ఆర్.హర్షిత సజ్జన్‌కు ప్రదానం చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2150	1521
పల్లికాయ (సూక)	5500	5200
పల్లికాయ (పచ్చిది)	-	-
కందులు	6802	3022
పెసళ్లు	7308	3022
పత్తి	7050	5300
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13000	9500
డిడి	-	-
వండర్‌హాట్	14200	12000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	12000	9000
దేశీ	28500	18000
సింగిల్‌పట్టి	29000	20000
దీపిక	13100	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

గడబిడల గులాబీ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాయకుల ఆధిపత్య పోరు
- పార్టీలో నిర్ణయాలపై పట్టుకోసం ఎత్తుకు పైఎత్తులు
- వర్ధన్నపేటపై మాజీ మంత్రి ఎర్రబెల్లి కన్ను
- 'స్టేషన్'లో ఉప ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యాచరణ
- భూపాలపల్లిలో సిరికొండపై గండ్ర గరం గరం
- నేతల సమన్వయ లోపంపై అధిష్ఠానం అసంతృప్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గులాబీ నేతలకు నియోజకవర్గాల పునర్విభజన గుబులు పట్టుకుంది. ఎక్కడ తమ సీటుకు ఎసరు వస్తుందో అని ముందే పొరుగు నియోజకవర్గాలపై కర్చీఫ్ వేసే పనిలో పడ్డారు. ప్రధానంగా వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్‌పై ముగ్గురు కీలక నేతలు ఇన్‌చార్జ్ బాధ్యతలపై కన్నేయడం హాట్‌టాపిక్‌గా మారింది. మరోవైపు స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తాయని భావిస్తున్న బీఆర్‌ఎస్.. అక్కడ నుంచి బీజేపీలో చేరిన అరూరి రమేష్‌ను తిరిగి పార్టీలో చేర్చుకోవాలని ఓ వర్గం ఒత్తిడి తెస్తోందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. మరోవైపు భూపాలపల్లి నియోజకవర్గంలోనూ మాజీ స్పీకర్ సిరికొండ పర్యటనలు మాజీ ఎమ్మెల్యే గండ్రకు చిరాకు తెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. నేతల మధ్య ఆధిపత్య పోరుతో పార్టీ రజతోత్సవ సభవేదికను పూర్వ కరీంనగర్ పరిధిలోని ఎల్కతుర్తికి మార్చి ఓరుగల్లు నేతలకు భారీ ఝలక్ ఇచ్చారనే చర్చ జరుగుతోంది.

వర్ధన్నపేట లడాయి

బీఆర్‌ఎస్ ముఖ్యనేతల చూపంతా వర్ధన్నపేట నియోజకవర్గంపైనే ఉంది. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం ఇప్పుడే గ్రౌండ్ రెడీ చేసుకునేందుకు ఆరాట పడుతున్నారు. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో వర్ధన్నపేట స్థానం ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారింది. అప్పటికే 1994, 1999, 2004లో వరుసగా మూడు పర్యాయాలు ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎమ్మెల్యేగా గెలిచారు. 2008 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు కావటంతో కొత్తగాఏర్పడిన పాలకుర్తి నుంచి ఎర్రబెల్లి పోటీకి దిగారు. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ 2026లో ప్రారంభం కానుంది. దీంతో ఈసారి వర్ధన్నపేట తిరిగి జనరల్ స్థానంగా మారుతుందనే అంచనాలతో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు.. కర్చీఫ్ వేసే పనిలో పడ్డారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరటంతో బీఆర్‌ఎస్‌కు ఏడాది కాలంగా జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ లేరు. దీంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన పాత స్థానంపై గురిపెట్టి కేడర్ పార్టీ మారకుండా పర్యటనలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను వర్ధన్నపేట నుంచే పోటీ చేస్తానని ఎర్రబెల్లి ఇప్పటికే కేడర్‌కు పలు సభల్లో చెప్పుతూ వస్తున్నారు. అయితే పాలకుర్తి నుంచి తన సతీమణి ఉషాదయాకర్‌రావును బరిలో దించేందుకు ఎర్రబెల్లి కసరత్తు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఏడాది కాలంగా రెండు నియోజకవర్గాల్లో దయాకర్‌రావు పర్యటిస్తూ రెండు చోట్ల పోటీ చేస్తానని కార్యకర్తలకు చెప్పడం వెనుక ఇదే వ్యూహమని తెలుస్తోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టు సాధించాలనే పట్టుదలతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. దీంతో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిన ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అయితే పల్లా ప్రతిపాదనపై పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అభ్యంతరం చెప్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. బీజేపీ నుంచి పార్టీలో చేరిన వ్యక్తికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎలా ఇస్తారని? స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వర్ధన్నపేట బాధ్యతలు అప్పగించాలని ప్రతిపాదించినట్లుగా సమాచారం. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ టికెట్ కోసం శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే కేసీఆర్ పల్లా వైపు మొగ్గుచూపటంతో చివరి నిమిషంలో పోచంపల్లికి ఎమ్మెల్యేగా పోటీచేసే చాన్స్ దూరమైంది. దీంతో వర్ధన్నపేట బాధ్యతలు అప్పగించాలని వినయ్‌భాస్కర్ కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచే మొదలైన పల్లా, దాస్యం మధ్య ఆధిపత్య పోరు.. ఇప్పటికే వర్ధన్నపేటపై కన్నేసిన ఎర్రబెల్లికి సంకటంగా మారిందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి సొంత ప్రాంతం కావటంతో పాటు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన ఎర్రబెల్లికే వర్ధన్నపేటలో గట్టి పట్టుందని, నేతల మధ్య ఆధిపత్య పోరుతో దయాకర్‌రావు సైలెంట్ అయ్యారని సమాచారం.

అక్కడ.. ఆధిపత్యమే..

అధికారం కోల్పోయి కొంత అసంతృప్తిలో ఉన్న గులాబీ నేతలకు ఆధిపత్య పోరు సెగ తప్పటం లేదు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గత ఏడాది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పుతో రేపోమాపో శ్రీహరిపై అనర్హత వేటు పడుతుందని బీఆర్‌ఎస్ నేతలు ఎదురుచూస్తున్నారు. ఈసారి కడియంపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్న గులాబీ నేతలు పార్టీ నుంచి అలిగి బయటకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను లోక్‌సభ ఎన్నికల ముందు పార్టీలో చేర్చుకున్నారు. ఉప ఎన్నికలు వస్తే స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ రాజయ్యకే అని గులాబీ బాస్ భరోసా కూడా ఇచ్చారు. అయితే ఇటీవల కాలంలో కొంతమంది నేతలు బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను తిరిగి కారు ఎక్కించాలని ఆరాట పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఉప ఎన్నిక వస్తే అరూరిని బరిలో దించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. గులాబీ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటంతో నాలుగైదు నెలలుగా అరూరి చేరిక పెండింగ్‌లో పడిందని తెలుస్తోంది. ఇక భూపాలపల్లి నియోజకవర్గంలోనూ గులాబీలో లడాయి ఆగటం లేదు. 2014 ఎన్నికల్లో భూపాలపల్లి నుంచి గెలిచిన సిరికొండ మధుసూదనచారి తొలి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నుంచి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్‌ఎస్ గూటికి చేరారు. దీంతో అప్పటి నుంచి సిరికొండ వర్సెస్ గండ్రగా భూపాలపల్లిలో రాజకీయాలు మొదలయ్యాయి. అయితే మధుసూదనచారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన అధిష్ఠానం.. 2023లో తిరిగి గండ్రకే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో గండ్ర ఓడిపోవటం.. సిరికొండ ప్రొటోకాల్ నియోజకవర్గంగా భూపాలపల్లిని ఎంచుకున్నారు. శాసనమండలిలో విపక్ష నేతగా కూడా ఉన్న మధుసూదనచారి తరుచుగా భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించటం గండ్రకు చిరాకుగా మారిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

ఓరుగల్లు నేతలకు కేసీఆర్ ఝలక్

ఉమ్మడి వరంగల్ జిల్లాను బీఆర్‌ఎస్‌కు గట్టి పట్టున్నదిగా భావించిన కేసీఆర్.. పార్టీ 25ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలు వరంగల్‌లో నిర్వహించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే సభాస్థలిని ఎంపిక చేయటం నుంచే నేతల మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రొటోకాల్ ప్రకారం తనకు దక్కాల్సిన ప్రాధాన్యత దక్కటం లేదని ఒకరిద్దరు నేతలు అధిష్ఠానం వద్ద ఫిర్యాదు చేశారని సమాచారం. దీంతో ఆతిథ్యం ఇచ్చే జిల్లాలో నేతల మధ్య సమన్వయం లేకపోతే సభ సక్సెస్ కాదని భావించిన కేసీఆర్.. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఘట్‌కేసర్ వద్ద నిర్వహించేందుకు ప్లాన్ చేశారని ప్రచారం జరిగింది. అయితే ఉద్యమ జిల్లాను విస్మరిస్తే భవిష్యత్తులో రాజకీయ ఇబ్బందులు వస్తాయని భావించి.. హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చిన పాత కరీంనగర్ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో సభ నిర్వహించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా పాత కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కు సభ నిర్వహణ బాధ్యతలు అప్పగించటంతో ఓరుగల్లు నేతలకు కేసీఆర్ ఝలక్ ఇచ్చారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేటలో నీటి ట్యాంకు ద్వారా మామిడి చెట్టుకు నీరందిస్తున్న రైతు తీగల ఎల్లయ్య



దమ్మన్నపేటలో పొట్టకొచ్చిన వరి పంట ఎండిపోవడంతో కొడవలితో పశువుల మేతకు కోస్తున్న రైతు నాగరబోయిన రాజెల్లు

ఒకరిది ఆశ.. మరొకరిది నిరాశ..

- పంటను కాపాడుకునేందుకు ఓ రైతు భగీరథ యత్నం
- ఎండిన పంటను మేతగా వేస్తున్న మరో రైతు

వర్ధన్నపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఈ ఇద్దరు రైతుల్లో ఒకరిది ఆశ అయితే.. మరొకరిది నిరాశ. ఒకరు ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తుంటే.. మరొకరు కన్నీటిని దిగమింగి ఎండిన పంటను పశువులకు మేతగా మార్చిన దృశ్యం. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల ఆవేదనను బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. తమకు తలాపున ఉప్పుగల్లు రిజర్వాయర్, దేవాదుల ఎత్తిపోతల నుంచి నీరొచ్చే నదుపాయాలున్నా, ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల పట్టింపులేక కరువు కాలంలో ఇలాంటి దుస్థితి ఏర్పడుతోందని కన్నీటి పర్యంతమవుతున్నారు. దమ్మన్నపేటకు చెందిన తీగల ఎల్లయ్య అనే రైతు తన మూడెకరాల మామిడి తోటను కాపాడుకునేందుకు పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దివిటిపెల్లి గ్రామం నుంచి నీటిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. ఒక్కో ట్యాంకర్ నీరు రూ.1500 అవుతుండగా.. రోజుకు నాలుగైదు ట్యాంకర్ల నీటిని తీసుకువచ్చి మామిడి చెట్లకు పెడుతున్నాడు. ఇప్పటికే నీరు లేక 20 చెట్లు ఎండిపోగా మిగిలిన చెట్లను కాపాడుకోవాలన్న తాపత్రయంతో తాను ఈ భగీరథ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. సమీపంలోనే మరో రైతు నాగరబోయిన రాజెల్లు తనకు రెండకరాల్లో వరి పంట వేయగా అది పొట్టదశలో ఉన్న క్రమంలోనే ఎకరం పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఆ పంటను వదిలేయలేయకుండా కనీసం పశువులకు మేతగా అయినా ఉపయోగించుకోవాలన్న యోచనతో రోజుకు కొంత మేర కొడవలితో కోసి తీసుకెళ్తున్నాడు. కొద్దిరోజులుగా భూగర్భ జలాలు తీవ్రంగా పడిపోవడంతో నీరు లేక పంటలు ఎండుతున్నాయని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి రాకపోగా, అప్పులకు వడ్డీలు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదంటున్నారు.

దేవాదుల కాలువ లేకనే ఈ దుస్థితి..

తీగల ఎల్లయ్య, రైతు దమ్మన్నపేట

గ్రామానికి చెరువు నీరే ఆధారం. భూగర్భ జలాలు మెండుగా ఉండాలంటే చెరువులో నీరుండాలి. సాగు నీటికి పూర్తిగా బోరు బావుల పైనే ఆధారపడి ఉన్నాం. కానీ ఈ సారి భూగర్భజలాలు భారీ స్థాయిలో పడిపోవడంతో చెరువు పక్కనే ఉండే బోర్లు కూడా పోయడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. దేవాదుల కాలువ మా గ్రామానికి లేదు. ఎన్నో సార్లు ఈ సమస్యను ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం ఎలాంటి ప్రయోజనం లేదు. కళ్లెదుట పంటలు ఎండిపోతుంటే బాధగా ఉంది.

ఎట్టకేలకు దేవాదుల మోటార్లు ప్రారంభం

- దేవన్నపేట ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసిన మంత్రులు
- పాల్గొన్న ఉత్తమ్, పొంగులేటి, ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, యశస్విని

హనుమకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు దేవాదుల ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లు ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవన్నపేట ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లను గురువారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ఆన్ చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా దేవన్నపేటకు సాయంత్రం 4 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి పంప్‌హౌస్ వద్దకు చేరుకొని పంప్‌హౌస్ వద్ద రిబ్బన్ కట్ చేసి మోటార్లను ఆన్‌చేశారు.

ఈ సందర్భంగా మెగా కంపెనీ ఇంజనీర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి మోటార్ల సామర్థ్యం నీటి విడుదలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మోటార్లను 15 నుంచి 20 రోజుల వరకు నిరంతరంగా నడపాలని అధికారులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ధర్మ సాగర్ నుంచి జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలోని పంటలకు సాగునీరు అందించాలని కోరారు. మరో మోటారు వారం రోజుల తర్వాత ఆన్ చేస్తామని, ఆస్ట్రియా నుంచి వచ్చిన ముగ్గురు ఆన్‌రీజ్ కంపెనీ నిపుణులు మోటార్ల పర్యవేక్షణ జరుపుతున్నట్లు అధికారులు మంత్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద మోటార్లను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మోటార్ల పనితీరును పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మేయర్

అరగంట పాటు హైరానా

రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా దేవన్నపేటలో దిగిన కొద్ది నిమిషాలకే మోటారు అరగంట పాటు మొరాయించింది. ఎయిర్ వచ్చి ట్రిప్పయి బంద్ అయినట్లు ఇంజనీర్లు మంత్రులకు తెలుపడంతో అరగంట పాటు వేచిచూశారు. టెక్నీషియన్స్ ఎయిర్‌బాల్ సరిచేసి మోటారును సరిచేయడంతో ఊపిరిపీల్చుకున్నారు. దీంతో మంత్రులు మోటారును ఆన్ చేసి తక్షణమే అక్కడి నుంచి ధర్మసాగర్ చెరువు వద్దకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా వెళ్లారు.

పది రోజుల ఉత్కంఠకు తెర

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరందరించేందుకు దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్ మోటారు గురువారం ఆన్ కావడంతో ఇటు నీటిపారుదల శాఖ అధికారులు, మంత్రులు ఊపిరి పీల్చుకున్నారు. పది రోజులుగా మోటార్లు ఆన్ చేయాలని రైతులు, పంటలు ఎండిపోతున్నాయని ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కాగా, 50 మంది ఇంజనీర్లు, టెక్నీషియన్లు పనులు పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 3 గంటలకు మోటారును ఆన్ చేసి ట్రయల్ రన్ చేసిన అధికారులు గురువారం సాయంత్రం 5 గంటలకు మంత్రుల చేత ప్రారంభించి నీటిని ధర్మసాగర్ చెరువుకు పంపింగ్ చేయడంతో అధికారులు, మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పోలీసుల బందోబస్తు

దేవన్నపేట దేవాదుల ఫేజ్-3 పంప్ హౌస్ వద్ద మంత్రుల పర్యటనలో భాగంగా పోలీసులు భారీగా మోహరించారు. దేవన్నపేట గ్రామ సరిహద్దుల్లో పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగకుండా పోలీసు అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

రైతులతో వాగ్వాదం

దేవన్నపేటలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ స్థలంలో రైతులు మొక్కజొన్న కంకులను ఆరబోశారు. మంత్రుల పర్యటన ఖరారు కావడంతో పోలీసులు, ఇతర అధికారులు హెలిప్యాడ్ వద్దకు చేరుకొని రైతులను మొక్కజొన్న కంకులను తరలించాలని చెప్పడంతో పోలీసులతో రైతులు వాగ్వాదం చేశారు.

డిసెంబర్‌లోగా అన్ని పైపులైన్లు పూర్తి చేస్తాం..

- భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ధర్మసాగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పైపులైన్ల పనులను డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ధర్మసాగర్ మండలకేంద్రంలోని రిజర్వాయర్‌ను ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు దేవన్నపేట వద్ద నదీజలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. దేవాదుల ఫేజ్-3 పైపులైన్ ద్వారా 600 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నట్లు తెలిపారు. మరో పదిహేను రోజుల్లో మరో పంప్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. రాజవరంపంపింగ్ స్టేషన్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన పనులను పూర్తి చేస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు వచ్చే విధంగా ఇరిగేషన్ పాలసీతో ముందుకు వెళ్తున్నామన్నారు. దేవాదుల ప్రాజెక్టు రెండున్నర దశాబ్దాలుగా నిర్మాణంలో ఉందని, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు దేవాదుల ప్రాజెక్టు పనులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో దేవాదుల ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ దేవాదుల ప్రాజెక్టును ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫేస్‌త్రీని ప్రారంభించిందన్నారు. మూడో దశ దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించింది పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో ప్రారంభించామన్నారు. ఈ పైపులైన్ ద్వారా 600 క్యూసెక్కుల నీరు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలంగా చేస్తామన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు ఫేజ్-3 మోటార్‌ను ప్రారంభించి రబీలో రైతుల పంటలను కాపాడిన మంత్రులకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ రైతుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, మేయర్ సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో రమేష్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ప్రసాద్, సమ్మయ్య, రాజిరెడ్డి, యాదగిరి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రదాయిని 'సుర్మా'

- రంజాన్ మాసంలో ఓ పవిత్ర కార్యం నేత్రాలంకరణ
- కోహితూర్ పర్వతం భస్మం చూర్ణమే ఇది

మహబూబాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం సంప్రదాయంలో అద్యంతం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే రంజాన్ కఠోర ఉపవాస దీక్షల మాసానికి అనేక ప్రత్యేకతలున్నాయి. ఈనెలలో చిన్నాపెద్దా, ఆడామగా తారతమ్యం లేకుండా అందరూ నిష్ఠగా ఉపవాసాలు చేస్తారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా తీరిక చేసుకుని ఐదు పూటల నమాజ్ ఆచరిస్తారు. 30రోజుల పాటు క్రమం తప్పకుండా దివ్యఖురాన్ పఠనం చేస్తారు. వీటన్నింటిని పాటించడానికి ప్రతీ ముస్లిం విధిగా మహ్మద్ ప్రవక్త చూపిన బాటనే అనుసరిస్తారు. వీటికి తోడు ఈ మాసంలో నేత్రాల (కనురెప్ప)కు అలంకరించే 'సుర్మా'కు విశిష్ఠ ప్రాధాన్యం ఉంది. అందువల్లే ముస్లింలు సుర్మాతో నేత్రాలంకరణకు అధిక ప్రాధాన్యమిస్తారు. రంజాన్ నెలలో దీన్నొక పవిత్ర కార్యంగా పరిగణిస్తారు. అంతేకాదు వైద్య పరంగానూ ఇదొక ఆరోగ్య ప్రదాయినిగా నమ్ముతారు.



కళ్లకు అలంకరించే సుర్మాలు





సుర్మా భద్రపరిచే పింగాణీ



సుర్మా అలంకరణలోని నేత్రం

కోహితూర్ పర్వతం బూడిదే సుర్మా..

నిత్యం అల్లా నామస్మరణలోనే గడిపే దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిసలాం ఓ రోజు తన ఆధ్యాత్మికతతో మనఅల్లాహ్ ప్రసన్నం పొంది నిష్కలవుతారు. ఇదే విషయాన్ని ఆయన తన అనుయా యుల వద్ద ప్రస్తావించినప్పుడు కొందరు అల్లా ఎక్కడ ఉన్నారని చూపించమని కోరుతారు. దీంతో దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిసలాం ఈజిప్టు, సిరియా ప్రాంతాలకు చెందిన 70మంది పెద్దలను సమీపంలోని కోహితూర్ పర్వతం వద్దకు తీసుకెళతారు. అక్కడ ఒకసారి అల్లాహ్ నూర్ (కాంతి) ప్రత్యక్షం కావడం చూసి అందరు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారట. సరిగ్గా అప్పుడే కోహితూర్ పర్వతం భస్మమై బూడిద (చూర్ణం)గా మారిందన్న కథనాన్ని ముస్లీంలు విశ్వసిస్తారు. అదే దైవ సంకల్పం కళ్లెదుట సాక్షాత్కరించడంతో తమలోని భక్తి ఉప్పొంగి ఆ చూర్ణాన్ని వారు కళ్లకు అద్దుకున్నారని పేర్కొంటారు. ఆ సమయంలో తమ కళ్లు సుదూరంలోని చీమల కదలికలను సైతం పసిగట్టే స్థాయిలో ప్రకాశవంతం కావడం గమనించి అల్లా కృప వల్లే ఇది సాధ్యపడిందని నమ్మారట. అప్పటి నుంచి కోహితూర్ పర్వతానికి చెందిన రాళ్ల చూర్ణమే క్రమంగా సుర్మాగా రూపాంతరం చెందిందనేది ముస్లింల నమ్మకం.

వైద్య పరిభాషలో ఆరోగ్య ప్రదాయిని..

వైద్య పరిభాషలో ఆరోగ్య ప్రదాయినిగా సుర్మాకు మంచి పేరుంది. నమాజ్ చేయడానికి ముందు వజూ (నీటితో శుభ్రపరిచే కాలకృత్యాలు) ఆచరించాక మహ్మద్ ప్రవక్త కంటికి సుర్మా పెట్టుకునే వారని, రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు కూడా కళ్ల కింద సుర్మా రాసుకుని పడుకునే వారని చెబుతారు. ఇలా చేస్తే కళ్లలోని మలినాలు తొలిగిపోతాయని నమ్మకం. నమాజ్‌కు వెళ్లేటప్పుడు ఇంటి వద్ద సుర్మా పెట్టుకోవడం మరిచిపోతే అలాంటి వారి కోసం మసీదుల్లో సుర్మా, అద్దం అందుబాటులో ఉంటుంది. సుర్మా పెట్టుకుంటే కంటి సమస్యలు రావనేది అనేక మంది ఆచరణాత్మకంగా నిరూపిస్తుండటంతో ముస్లిమేతరుల్లో కూడా కొందరు సుర్మా పెట్టుకుంటా రని, కొందరు మహిళలు కాటుక స్థానం లో సుర్మానే వాడటానికి ఇష్టపడతారట. పండుగపూట ఇంటికొచ్చే బంధుమిత్రులకు సుర్మా పెట్టడం ద్వారా గౌరవించే సాంప్రదా యం ముస్లింలలో కన్పిస్తుంది.

విభిన్న ఆకారాల్లో సుర్మేదాన్లు..

ఫ్యాన్సీ దుకాణాలతో పాటు పలు చోట్ల మసీదుల ఎదుట కూడా వ్యాపారులు సుర్మా విక్రయిస్తుంటారు. ఈ రంజాన్ మాసంలో సుర్మా అమ్మకాలు పెరుగుతాయి. సుర్మా కిలో పొడి ధర రూ.175 నుంచి రూ.450 వరకు ఉంటుంది. వీటిని చిన్న చిన్న సీసాలలో పోసి అమ్ముతుంటారు. ఇవి రూ.10 మొదలు రూ.90వరకు లభ్యమవుతున్నాయి. కంపెనీ పేరు, సుర్మా నాణ్యతను బట్టి వీటి ధరలు నిర్ణయిస్తున్నారు. సుర్మాను భద్రపరుచుకునేందుకు విభిన్న ఆకారాలలో సుర్మేదాన్లు (భరిణెలు) మార్కెట్లో భక్తులను కనువిందు చేస్తున్నాయి. వీటి ధర రూ.50 నుంచి రూ.300 వరకు అందుబాటులో ఉంటుంది.

విశ్వావసు ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించిన సీఎం

- అర్చకుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ
- అర్చక జాక్ నేత గంగు ఉపేంద్రశర్మ



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగ డైరీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. అర్చక ఉద్యోగ జాక్ నేత గంగు ఉపేంద్రశర్మ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేత కాండూరి కృష్ణమాచారి, కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, అధ్యక్షుడు భద్రినాథ చార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర్‌శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి తదితరులు ముఖ్యమంత్రి చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చక ఉద్యోగ జాక్ పక్షాన గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రం సమర్పించారు. దేవాదాయశాఖలో 577 జీవో విడుదలైన నాటి నుంచి ఉన్న అర్చక ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పెన్షన్, గ్రాట్యూటీ హెల్త్ ఇన్సూరెన్స్, వెల్ఫేర్‌బోర్డు మీటింగ్ నిర్వహించాలని, తద్వారా అర్చకుల సంక్షేమం త్వరితగతిన జరుగుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు.

సైన్స్ అభివృద్ధికి ప్రతీ విద్యార్థి కృషి చేయాలి

వడ్డేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ అభివృద్ధికి ప్రతీ విద్యార్థి కృషి చేయాలని కేయూ భౌతిక శాస్త్రం అధ్యాపకులు, అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్, సైన్స్ ఫర్ సస్టేనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్‌సీఐఎంఎస్‌ఎస్‌ఈఈ- 2025) అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య తిథిగా హాజరైన వెంకట్రాంరెడ్డితో పాటు కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజారెడ్డి మాట్లాడారు. ఈ సదస్సులో కన్వీనర్ అండ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ పి. అరుణ, ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రాంరెడ్డి

జనన మరణ ధృవపత్రాలు సకాలంలో తీసుకోవాలి

వై.ఇనోక్, బల్దియా డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: జనన, మరణ ధృవపత్రాలను ఎప్పుడు పొందాలి?

ఇనోక్ : శిశువు జన్మించిన తర్వాత, మనిషి మరణీన తర్వాత సంవత్సరం లోపు జనన, మరణ ధృవపత్రాలు పొందాలి.

ఆంధ్రజ్యోతి: జనన ధృవపత్రాలను ఎక్కడి నుంచి పొందాలి?

ఇనోక్ : నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో ఇంటి వద్దనైనా ఆస్పత్రిలోనైనా ఒక శిశువు జన్మిస్తే జనన ధృవపత్రం కోసం సమీపంలోని మీ సేవలో దరఖాస్తు చేసుకుని పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: ఎన్నిరోజుల్లో ధృవపత్రం పొందవచ్చు..?

ఇనోక్ : మీ సేవలో అన్ని పత్రాలు సమర్పించిన తర్వాత ఏడు ప్రభుత్వ పని దినాల్లో జనన, మరణ పత్రాలను పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: జనన, మరణ ధృవపత్రాలలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

ఇనోక్: శిశువు పుట్టిన తర్వాత ఆస్పత్రిలో ఏ పేరుపై డిశ్చార్జ్ సర్టిఫికెట్ తీసుకుంటారో అక్కడి రికార్డుల ప్రకారం అదే పేరు మాకు జాబితా వస్తుంది. ముందే జాగ్రత్త పడాలి. తర్వాత పేరు మార్పు కోసం చాలా కష్టంగా ఉంటుంది.

- వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నేరాలకు అడ్డాగా భట్టుపల్లి బైపాస్

- హత్యలు, అత్యాచారాలు, దారిదోపిడీలకు కేరాఫ్
- కనిపించని పోలీస్ పెట్రోలింగ్
- పేట్రేగిపోతున్న ఆకతాయిలు, దారిదోపిడీ ముఠాలు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేట నుంచి వరంగల్ ఉర్సు గుట్ట దారిలోని భట్టుపల్లి బైపాస్ రోడ్డు నేరాలకు అడ్డాగా మారింది. నగర శివారులో ఉన్న ఈ రోడ్డు నిర్మానుష్యంగా ఉండటంతో నేరస్తులతో పాటు దారి దోపిడీ ముఠాలకు అడ్డాగా మారింది. ఈ దారిలో మందుబాబులు, గంజాయి బ్యాచ్, ప్రేమజంటలు యథేచ్ఛగా సంచరించడం షరామామూలై పోయిందని సమీప ప్రాంత ప్రజలు, రైతులు చెబుతున్నారు.

నిఘా శూన్యం

కాజీపేట వైపు భట్టుపల్లి రోడ్డు మడికొండ, ఉర్సుగుట్ట వైపు మిల్స్‌కాలనీ, మధ్యలో కొంత భాగం సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తోంది. ఈ రోడ్డుపై పోలీస్ పెట్రోలింగ్ కనిపించిన దాఖలాలు లేవని సమీప ప్రాంతాల వారు చెబుతున్నారు. ఇంటర్‌సెప్టార్ వాహనాలను మాత్రం ఏదో ఓ మూలన పార్కింగ్ చేసి ఉంచుతున్నట్లుగా తెలుస్తోంది.

హత్యలు, అత్యాచారాలు

దోపిడీ ముఠాలు, హంతకులు, అత్యాచారాలకు పాల్పడేవారు, ప్రేమ జంటలు భట్టుపలి బైపాస్ రోడ్డును అడ్డాగా చేసుకొని వారి వారి కార్యకలాపాలను కానిస్తున్నారు. ఈ దారిలో వెంచర్లు చేసి వదిలిపెట్టిన ప్లాట్లు, గ్రానైట్ గుట్టలు, రాజీవ్‌గృహకల్ప కోసం నిర్మించి ఖాళీగా ఉన్న ఇళ్లను నగరంలోని వివిధ కళాశాలల నుంచి వచ్చే ప్రేమజంటలు, వివాహేతర సంబంధాలు కొనసాగించే వ్యక్తులు అడ్డాగా మార్చుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అలాగే లారీలు, ఇతర వాహనాలను ఆపి దాడులు చేసి డబ్బులు లాక్కున్న సందర్భాలు ఉన్నట్లుగా తెలుస్తోంది.



భట్టుపల్లి బైపాస్ రహదారి ఇదే.. (ఇన్‌సెట్‌లో) బోర్డు

ఘటనలు ఇవే..

గతంలో మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట క్రాస్ వద్ద ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఆటోడ్రైవర్.. అతిదారుణం చంపడం కలకలం రేపింది. ఉర్సు గుట్ట నుంచి భట్టుపల్లికి వచ్చే దారిలో గంజాయి మత్తులో ఓ యువకుడిపై ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడి చేసి దారుణంగా చంపారు. తాజాగా యువ వైద్యుడు గాదె సుమంత్‌రెడ్డిని అతడి భార్య సహకారంతో కొందరు వ్యక్తులు వెంబడించి కారును అడ్డగించి తీవ్రంగా గాయపరచగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఇలాంటి సమస్యాత్మక ప్రాంతాలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టి నిఘా పెంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు ఎల్లాపూర్ పరిధిలో విద్యుత్ అంతరాయం

హసన్‌పర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని టీజీఎన్‌పీడీసీఎల్ ఏడీ అశోక్ తెలిపారు. ఎల్లాపూర్ సబ్‌స్టేషన్‌లో అదనంగా మరొక కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏడీఈ అశోక్ కోరారు.

సీఎంకు బంజార సమాజం రుణపడి ఉంటుంది

వడ్డేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గోర్ బోలి లంబాడీ, బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలని రాష్ట్ర శాసనసభలో చర్చించి ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి బంజారా సమాజం రుణపడి ఉంటుందని తెలంగాణ బంజారా సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుగులోత్ సజ్జన్ నాయక్ అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి లూనావత్ దాస్యా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు గురువారం జరిగిన శాసన సభలో సంపూర్ణ మద్ధతు తెలిపిన ఎస్సీ, ఎస్టీ శాసన సభ్యులకు, మంత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తెలంగాణ బంజారా సంక్షేమ సంఘం కార్యదర్శి జి. సందీప్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ గుగులోతు వీరన్న నాయక్, భూక్య మోతీ లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉప కులపతికి జూడా నేతల అభినందనలు

వరంగల్ మెడికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ పీవీ నంద కుమార్‌రెడ్డిని తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (టీజూడా) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్, కాకతీయ మెడి కల్ కాలేజీ జూడా ఉపాధ్యక్షుడు అశ్విని నవదీప్‌లు కలిసి అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ఇటీవల నియమితులైన డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



ఉప కులపతి డాక్టర్ నందకుమార్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జూడా నేతలు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

వడ్డేపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే తమ సంస్థ లక్ష్యమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ నేత దాసరి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా యూనియన్ నూతన సభ్యత్వాల నమోదును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం సాగిస్తున్న సంఘం తమదేనని అన్నారు. ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు గాడిపల్లి మధు, కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్, తోట సుధాకర్, ఎండి హుస్మాన్‌పాషా, బచ్చు పురషోత్తం, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి చేయూత

హసన్‌పర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని పలు హోటళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒంటరి అనాథ వృద్ధుడు వీరభద్రయ్యను స్థానిక బీఆర్ఎస్ నాయకుడు వేణుగోపాల్ గురువారం చేరదీసి భీమారంలోని లార్డ్ అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు వీరభద్రయ్యను చేర దీసి ఆదుకుంటామని తెలిపారు. వీరభద్రయ్యను అక్కున చేర్చుకొని మానవత్వంతో చేరదీసిన నిర్వాహకులతో పాటు వేణుగోపాల్‌ను స్థానికులు అభినందించారు.



అనాథ వృద్ధుడిని వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న వేణుగోపాల్

నగరంలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

- విద్యారణ్యపురిలో ఓ ఇంట్లో ముసుగులతో చొరబడి చోరీ
- గ్యాంగ్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు

వరంగల్ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు వ్యక్తులు ముఖాలకు నల్లముసుగులు వేసుకొని, నడుములకు కత్తులు పెట్టుకొని బుధవారం అర్ధరాత్రి హనుమకొండ పీఎస్ పరిధిలోని విద్యారణ్యపురిలో ఓ ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. హనుమకొండ సీఐ సతీష్ కథనం ప్రకారం.. విద్యారణ్యపురిలో నివాసం ఉండే బత్తిని వెంకటనారాయణ తన భార్య, కుమారుడు బుధవారం తెల్లవారుజామున నిద్రలేచేసరికి తలుపులు తీసిఉన్నాయి. దీంతో ఇంటిని పరిశీలించగా ఇంట్లోని మరో బెడ్‌రూమ్‌లో బట్టలు చిందవందరంగా పడేసి ఉండటంతో ఇంట్లోకి ఎవరో వచ్చారనే అనుమానంతో సీసీ ఫుటేజీలు పరిశీలించారు. అర్ధరాత్రి 1.40 ప్రాంతంలో ఆరుగురు వ్యక్తులు చెడ్డీలు ధరించి, ముఖాలకు నల్ల ముసుగులు వేసుకొని నడుములకు కత్తులు పెట్టుకొని తలుపు పక్కన ఉన్న కిటికీల గ్రిల్స్ తొలిగించి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో సుమారు 2 గంటల పాటు ఉన్న గ్యాంగ్ 3.40 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వచ్చినట్లు సీసీ ఫుటేజీల ద్వారా స్పష్టమైంది. దీంతో బెడ్‌రూమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా టీటీడీ వాళ్లు బహూకరించిన బంగారుపూత పూసిన 500 గ్రాములు రెండు వెండి నాణాలతో పాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లుగా గుర్తించారు. బాధితుడు వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెడ్డీగ్యాంగ్ కోసం గాలింపులు

సీసీ ఫుటేజీ ద్వారా అప్రమత్తమైన సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చెడ్డీగ్యాంగ్ కోసం గాలిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సందేశాలను పంపిస్తున్నారు. చోరీ చేసే సమయంలో అడ్డొచ్చే వారిని హత్యచేసేలా తమ వెంట కత్తులను తెచ్చుకోవడం బయటి రాష్ట్రాల వారే చేస్తారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కాలనీలల్లో గస్తీ పెంచి చెడ్డీ గ్యాంగ్‌ను గుర్తించే పనిలో పడ్డారు. కాగా, సీసీ ఫుటేజీ వైరల్ అవుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి బదిలీ



మాధవరెడ్డిని సన్మానించి వీడ్కోలు పలుకుతున్న మలేరియా సిబ్బంది

ఇన్‌చార్జ్‌గా రాజిరెడ్డికి అదనపు బాధ్యతలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ మలేరియా విభాగం ప్రధాన అధికారి, బయాలజిస్ట్ జి. మాధవరెడ్డి గురువారం బదిలీ అయ్యారు. మాధవరెడ్డిని హైదరాబాద్ జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సెక్రెటరీ డాక్టర్ రవీందర్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మాధవరెడ్డి వరంగల్ బల్దియాలో రెండేళ్లపాటు బయాలజిస్ట్‌గా సేవలందించారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ భర్తీ చేయకపోవడంతో మరో అధికారి నియామకం జరిగే వరకు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, మాధవరెడ్డిని గురువారం మలేరియా సిబ్బంది హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ మలేరియా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. శాలువా, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు మధూకర్, రవితో పాటు హెల్త్ అసిస్టెంట్లు మట్టెడ సుధాకర్, పాశం రవి, అనిల్‌కుమార్, ఎల్లేశ్, రాజేశ్‌ఖన్నా, రాజులతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీల పోరు గర్జన విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఏప్రిల్ 2న ఢిల్లీలో నిర్వహించనున్న బీసీల పోరు గర్జన విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం కేయూ పరిపాలన భవనం ఎదుట రాణి రుద్రమదేవి విగ్రహం ఎదుట బీసీ పోరు గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరెగంటి నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42శాతం పెంచుతూ చేసిన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కాలర్లు రేగుల నరేశ్, నామాల రవి, స్వామి, బీసీ విద్యార్థి సంఘం మహిళ కన్వీనర్ జాహ్నవి, షైనీ, ఉపాధ్యక్షుడు అజయ్‌సింగ్, గణేశ్, శ్రీసాయి, వినోద్, అన్వేశ్, అఖిల్, ప్రీతి, అపూర్వ, రక్షిత, నిఖిత, హరిప్రియ, అశ్విత, తనూశ్రీ తదితరులు పాల్గొన్నారు.



బీసీ పోరు గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరెగంటి నాగరాజుగౌడ్ తదితరులు

ఆస్తిపన్ను వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీని 90 శాతం రాయితీ ప్రకటించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31లోపు ప్రాపర్టీ ట్యాక్స్‌లో అపరాధ రుసుములో రాయితీని ఉపయోగించుకోవాలని, ఏప్రిల్ నెల నుంచి వడ్డీతోపాటు అసలును చెల్లించవలసి ఉంటుందని అన్నారు. ప్రజలు చెల్లించే పన్నులు బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, బల్దియా కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాలు, మీసేవా, ఈసేవ కేంద్రాలు వెబ్‌సైట్ ద్వారా పన్నులు చెల్లించవచ్చని అన్నారు. ఇంకా ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించే వారు గడువులోపు 25 శాతయం రాయితీలలో చెల్లించాలని అన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలి

వడ్డేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మండలం కుమార్‌పల్లి రెవెన్యూ పరిధిలోని తమ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని భూ బాధితుడు చిట్టిరెడ్డి రజినీకర్‌రెడ్డి, కాలువ వాసుదేవరెడ్డి, విజయ తదితరులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను, వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్‌లను వేడుకున్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1984లో హనుమకొండ మండలం కుమార్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 117, 126లలో ఎకరా మూడు గుంటల భూవిని దుర్గంపూడి జోజి రెడ్డి దగ్గర 30 మంది కలిసి కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2017లో తాము కొనుగోలు చేసిన భూమిని చదును చేసినట్లు పేర్కొన్నారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన రంజిత్‌రెడ్డి అనే వ్యక్తి 2017లో అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అండతో 20 మంది గూండాలతో వచ్చి తమపై దాడి చేశారని చెప్పారు. తమపై దాడిచేసిన విషయాన్ని సీపీతోపాటు కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో రంజిత్ రెడ్డితో పాటు అతడి అనుచరులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రంజిత్ రెడ్డి పోలీసు అధికారుల వద్దకు కాగితాలు తీసుకురాకుండా తప్పించుకోవడ ంతోపాటు క్షేత్రస్థాయి లో భూమిని చదును చేసుకుంటూ తమను బెదిరిస్తూ భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ సమావేశంలో బాధితులు శ్రీలత, కొండయ్య, అనంతల క్ష్మీ, ధనలక్ష్మి, తనీషా,మహేందర్, సురేష్, గణేష్, మాధవరెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

- భూకబ్జాదారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని హనుమకొండ పట్టణానికి చెందిన బాధితుడు సాయిని నరేందర్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను వేడుకున్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో తన స్థలం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ మండలం వడ్డేపల్లి శివారులోని జవహర్ కాలనీలో సర్వే నంబర్ 27లో 2010 సంవత్సరంలో తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి 2310 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఆ స్థలం తన స్వాధీనంలోనే ఉందని పేర్కొన్నారు. కొంత మంది 2310 చదరపు గజాల ఇంటి స్థలం నుంచి కొంత ఆక్రమించుకొని విక్రయించారని తెలిపారు. మరికొంత స్థలంలో మున్సిపల్ అధికారులు రోడ్డు వేసి తన భూమిని తనకు కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూమిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన యాకూబ్బు పాల్గొనడం హర్షణీయమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి అన్నారు. గురువారం కళాశాలలో నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని యాకూబ్బుని ఆమె అధ్యాపకులతో కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం అధ్యాపకులు డాక్టర్ కనకయ్య, శ్రీదేవి పాల్గొన్నారు.



నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

భూ కబ్జాల అంతమే నాయిని రాజేందర్‌రెడ్డి పంతం

వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో భూ కబ్జాల అంతమే ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పంతమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్‌కుమార్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ హయాంలో పశ్చిమ నియోజకవర్గంలో భూ కబ్జాలు పెద్ద మొత్తంలో పెరిగాయని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి భూ కబ్జాలకు నియోజక వర్గంలో చరమగీతం పాడుతానని అన్నట్లు చెప్పారు. భూ పంచాయితీలు ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో చేయరాదని గోడలపై పత్రాలు సైతం అంటించిన విషయాన్ని తోట పవన్ కుమార్ గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అనుచరుడు రంజిత్‌రెడ్డి అమాయకుల భూములను కబ్జా చేస్తూ వారిని తన అనుచరులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కేతిడి దీపక్‌రెడ్డి, మారం రెడ్డి కొటిల్‌రెడ్డి, తడక సుమన్, సైండ్ల శ్రీకాంత్, బొంత సారంగం, వల్లెపు రమేష్, సిరబోయిన సతీష్, సంజయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం


జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి27(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు పి.ప్రావీణ్య కొనియాడారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్‌భవన్‌లో గురువారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ పాలకవర్గ సమావేశం జరిగింది. ముందుగా రెడ్‌క్రాస్‌కు విచ్చేసిన కలెక్టర్ ప్రావీణ్యకు రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు పూలమొక్క అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెడ్‌క్రాస్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించారు. అనంతరం రెడ్‌క్రాస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన పాలక వర్గ సమావేశంలో పాల్గొని రెడ్‌క్రాస్ ఆదాయ, వ్యయాలను సమీక్షించి పాలకవర్గ సభ్యులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రక్తదాన కార్యక్రమాలే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గం సేవలు ఎనలేనివన్నారు. రెడ్‌క్రాస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్యను రెడ్‌క్రాస్ పాలకవర్గ శాలువా కప్పి షీల్డ్ అందజేసి సత్కరించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గం

పర్వదినం



నవ చైతన్యానికి నాంది

ప్రభవ నుంచి అక్షయ వరకు గల అరవై సంవత్సరాలలో 39వదైన విశ్వావసు నామ సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నాం. చైత్రమాస ఆగమనంతో ప్రకృతి పులకిస్తుంది. అంతటా కొత్తదనం సంతరించుకుంటుంది. నవచైతన్యానికి నాంది అవుతుంది. అనంతమైన కాలంలో సంవత్సరం ఒక ప్రమాణం. మానవ జీవనానికి, కాలస్వరూపుడైన ఆ పరమాత్మకు మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని, ఆధ్యాత్మికతను పెంచుకోవాలి. తదనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి.

చాంద్రమానం అనుసరించే తెలుగువారి సంవత్సరాది... ఉగాది. సంస్కృత పదమైన 'యుగాది' కాలక్రమంలో 'ఉగాది' అయింది. 'ఉ' అంటే నక్షత్రం, 'గ' అంటే గమనం. అలా ఉగాది చాంద్రమాన నక్షత్ర గమనంతో రూపుదిద్దుకున్నదనేది ఖగోళ, జ్యోతిష శాస్త్ర ప్రమాణం. ఇదే విషయాన్ని హేమాద్రి పండితుడు 'చతుర్వర్గ చింతామణి' గ్రంథంలో ప్రస్తావిస్తూ... బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన రోజుగా దీన్ని పేర్కొన్నాడు. అఖండ దేవుడు తన 'స్మృతి కౌస్తుభం' గ్రంథంలో "చాంద్రమాన సంవత్సరంలోని తొలి మాసమైన చైత్రమాసంలో... తొలి తిథి అయిన పాడ్యమి- ఉగాది" అని తెలిపాడు. ఈ రోజునుంచి వసంత ఋతువు ఆరంభమవుతుంది.

విధి విధానాలు, ఉగాది పచ్చడి...

కొత్త సంవత్సరం మొదలైన సందర్భంలో... ఆచరించవలసిన విధి విధానాలను మన పూర్వ ఋషులు ఎన్నడో నిర్దేశించారు. దాని ప్రకారం... ప్రాతఃకాలంలో అభ్యంగన స్నానం చేయడం ఉగాదినాటి తొలి నియమం. దానికి ముందు ఇంటిలోని పెద్దవారితో తలకు నూనె పట్టించుకొని, వారి ఆశీస్సులు పొంది, స్నానం చేయడం వల్ల అలక్ష్మి తొలగిపోతుందనీ. లక్ష్మీదేవి అనుగ్రహిస్తుందని పూర్వులు చెప్పారు. అలాగే నూతన వస్త్రాలు ధరించడం, దైవారాధన చేయడం, ఉగాది పచ్చడిని దైవానికి నివేదించి పరగడుపున ఆరగించడం, పెద్దల ఆశీస్సులు పొందడం లాంటివి విధులుగా నిర్దేశించారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. అది అమృత సమానం. విశేషమైన రోగ నిరోధక శక్తి కలిగినది. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఈశ్వర ప్రసాదంగా స్వీకరిస్తే, ఏడాదంతా సౌఖ్యదాయకంగా ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

30న విశ్వావసు నామ ఉగాది

పంచాంగ శ్రవణం

అలాగే ఉగాది నాడు తప్పనిసరిగా పంచాంగాన్ని పూజించాలి. పంచాంగ శ్రవణం చేయాలి. పంచాంగం అంటే తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం అనే అయిదు అంగాలను కలిగినది. ఏడాది కాలాన్ని ప్రమాణంగా చేసుకొని... ఆ కాలంలో గ్రహాల సంచారం, అవి కలిగించే ఫలితాలు, ఆయా నక్షత్ర జాతకులు పొందబోయే శుభాశుభ ఫలితాలు, రాజపూజ్య అవమానాలు, ఆదాయ వ్యయాలు, కందాయ ఫలాలు... ఇలా పలు విషయాలు పంచాంగంలో సవివరంగా ఉంటాయి. అలాగే గ్రహ సంచారాలు, నక్షత్ర గమనం, పండుగల నిర్ణయం, శుభ ముహూర్తాలు... ఇవన్నీ పంచాంగాన్ని అనుసరించే ఉంటాయి. ముఖ్యంగా కర్తరీ నిర్ణయం సూర్యుడి ఆధారంగా జరుగుతుంది. వాతావరణ మార్పులను సూచించే కర్తరీ నిర్ణయం కర్షకులకు ఎంతో ముఖ్యం. ఇవే కాకుండా, గ్రహణాలు, పుష్కరాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా పంచాంగం ద్వారా తెలుసుకోవచ్చు. గ్రహాలు పరమాత్ముని అధీనంలో ఉంటాయి. పంచాంగ శ్రవణం చేసి, పరమాత్ముని ప్రార్థించిన వారికి ఆయన కృప నిస్సంశయంగా కలుగుతుంది. మనం నిత్యం చేసే పూజా విధిలో ఈ అయిదు అంగాలను స్మరించుకోవడమే సంకల్పం. తిథి... శ్రేయస్సును ఇస్తుంది. వారం... ఆయుష్షును కలిగిస్తుంది. నక్షత్రం... పాపాలను తొలగిస్తుంది. యోగం... రోగాలను తొలగిస్తుంది. కరణం... కార్యాలకు విజయం చేకూరుస్తుంది. అందుకే పంచాంగాన్ని ఒక ఏడాదికి సంబంధించిన 'కాల విజ్ఞాన సర్వస్వం' అని చెప్పవచ్చు.

• ఆయపిళ్ల రాజపాప

సందేశం

పండుగ అంటే మన బంధుమిత్రులతో కలిసి మనం మాత్రమే వేడుక చేసుకోవడం కాదు. మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న నిరుపేదలను, అర్తులను కూడా ఆ సంబరాల్లో భాగస్వాములుగా చేయడం. మనకు ఉన్నదాన్ని వారితో పంచుకోవడం. అందరి సంతోషమే అల్లాహ్‌కు ప్రీతికరమని తెలుసుకోవడం. రంజాన్ పండుగ ఇచ్చే సందేశం అదే.

పంచుకుంటేనే పండుగ!

ఇస్లాం ధర్మంలో పండుగలు రెండు మాత్రమే. ఒకటి 'ఈద్-ఉల్-ఫితర్' (రంజాన్), రెండోది 'ఈద్-ఉల్-అజ్‌హా' (బక్రీద్). రంజాన్‌ను 'ఫిత్రాల పండుగ' అని కూడా అంటారు. అంటే పేదలకు ఫిత్రా దానాన్ని చెల్లించే పండుగ. ఒక ఫిత్రా దానం విలువ రెండున్నర కిలోల గోధుమల విలువకు సమానమై ఉంటుంది. దీన్ని సాధారణ వ్యక్తుల నుంచి సంపన్నుల వరకూ కచ్చితంగా చెల్లించాలనేది నియమం. రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో దొర్లిన చిన్న చిన్న లోటుపాట్లను ఫిత్రా దానం భర్తీ చేస్తుందని దైవప్రవక్త మహమ్మద్ తన బోధనల ద్వారా తెలియజేశారు. మరో వైపు నిరుపేదలకు ఇది సంతోషాన్ని పంచుతుంది. పరస్పర దయ, సహకార గుణాలను పెంచుతుంది. హృదయాలను శుద్ధి చేస్తుంది. లోభత్వాన్ని అరికడుతుంది.



> "రంజాన్‌ను 'ఫిత్రాల పండుగ' అని కూడా అంటారు. అంటే పేదలకు ఫిత్రా దానాన్ని చెల్లించే పండుగ. ఒక ఫిత్రా దానం విలువ రెండున్నర కిలోల గోధుమల విలువకు సమానం."

ఇలా చేయాలి

రంజాన్ పర్వదినాన చేయవలసిన పనులను పవిత్ర గ్రంథాలు నిర్దేశించాయి. వాటి ప్రకారం: ఉదయాన్నే లేవాలి. కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఫజ్ర్ నమాజ్‌కు ముందు కానీ, తరువాత కానీ తలంటు స్నానం చేయాలి. ఉన్నవాటిలో మంచి దుస్తులు ధరించాలి. సుగంధ ద్రవ్యాలు పూసుకోవాలి. వ్యక్తిగత అలంకరణ చేసుకోవాలి. కళ్ళకు సుర్మా పెట్టుకోవాలి. ఈద్ నమాజ్‌కన్నా ముందే జకాత్, ఫిత్రా దానాలను చెల్లించాలి. తీపి పదార్థాన్ని, బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లను తినాలి. ఈద్గా మైదానానికి వెళ్ళేటప్పుడు ఒక దారిలో వెళ్ళాలి, వేరే దారిలో తిరిగి రావాలి. ఈద్ నమాజ్‌కు వెళ్తున్నప్పుడు 'తక్బీర్' (స్తుతి)ని మెల్లగా పలుకుతూ ముందుకు సాగాలి. కాలినడకన ఈద్గాకు వెళ్ళడం పుణ్యప్రదం. నమాజ్ తరువాత ఒకరికొకరు సలాం చెప్పుకోవాలి. ఈద్ నమాజ్‌ను బస్తీ లేదా గ్రామం బయట ఉండే బహిరంగ ప్రదేశంలో... అంటే ఈద్గాలో చేయడం సున్నత్ ప్రవక్త సంప్రదాయం. ఆ సౌకర్యం లేనప్పుడు మసీదులో కూడా చేయవచ్చు. నమాజ్ పూర్తయ్యాక... బంధు మిత్రులతో కలిసి విందుతో సంతోషంగా గడపాలి.

• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

కొత్తదనాన్ని ఆహ్వానిద్దాం!

వసంత ఋతువు ఆగమనం, లేత మామిడి చిగుళ్ళు, మధురమైన కోయిల గానం... ఇవన్నీ ఉగాది పర్వదినానికి ప్రకృతి సహజమైన అలంకారాలు. ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, బంధు మిత్ర సమాగమం లాంటివన్నీ సన్మార్గంలో నడవడానికి ఏర్పరచుకున్న సంప్రదాయాలు. వీటన్నిటి సంగమమైన ఉగాది ఒక ఆహ్లాదకరమైన పర్వదినం. మంచి పనులను మొదలుపెట్టడానికి ఈ రోజు ఎంతో



శ్రేష్ఠమైనది. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఉగాది పండుగ విశిష్టత గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి చేసిన ప్రవచనాలను గుర్తు చేసుకుందాం.

ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి... ఉగాది. చైత్ర నవరాత్రులు కూడా ఈ రోజు నుంచే ప్రారంభమవుతాయి. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన ఈ నవరాత్రులలో అమ్మవారిని తొమ్మిది రూపాలలో పూజిస్తే... ఆమె అనంతమైన కృపకు పాత్రులం కాగలం. ఎన్నో గొప్ప విషయాలకు ఇదే తొలి రోజు అని మన పూర్వీకులు పేర్కొన్నారు.. ఆదిశక్తి సృష్టి రచనను ఈ రోజే మొదలుపెట్టిందనీ, గణేశుణ్ణి ఆమె సృష్టించినది ఈ రోజేననీ, కాలం ఈ రోజే ప్రారంభమయిందనీ పలు గ్రంథాలు చెబుతున్నాయి. ఉగాది రోజును ధ్యానం, పూజ, ప్రార్థనలతో ప్రారంభించాలని సూచించారు. ఆధ్యాత్మిక జీవనంలో కొత్త అధ్యాయాలను, ప్రారంభించడానికి ఇది ఎంతో అనువైన రోజు. అలాగే మన జీవితం పట్ల గ్రహాల ప్రభావాన్ని అర్థం చేసుకొని, వాటిని అనుకూలపరచుకోవడం ద్వారా ఉన్నతి పొందడం ఎలాగనేది అర్థం చేసుకోవడం ప్రధానం.

"జ్యోతిష శాస్త్రం ప్రకారం... నవగ్రహాల వల్ల మన సూక్ష్మ శరీరంలో ఉండే వివిధ శక్తి కేంద్రాలు ప్రభావితమవుతాయి. మూలాధార చక్రాన్ని కుజుడు లేదా మంగళుడు, స్వాధిష్ఠాన చక్రాన్ని బుధుడు, మణిపూర చక్రాన్ని గురువు, అనాహత చక్రాన్ని శుక్రుడు, విశుద్ధ చక్రాన్ని శని, ఆజ్ఞా చక్రాన్ని సూర్యుడు, సహస్రార చక్రాన్ని చంద్రుడు, రాహు కేతువులు ప్రభావితం చేస్తారు. సహజ యోగ ధ్యానం ద్వారా ఆ చక్రాలను లేదా శక్తి కేంద్రాలను శుద్ధి చేసుకున్నప్పుడు... సంబంధిత గ్రహాల దుష్ప్రభావం మన జాతకంలో ఉంటే తొలగిపోతుంది. అలాగే శక్తి కేంద్రాల మీద జాతి రత్నాల ప్రభావం కూడా ఉంటుంది. మూలాధార చక్రంపై పగడం, స్వాధిష్ఠాన చక్రంపై కనక పుష్యరాగం, మణిపూర చక్రంపై పచ్చ, అనాహత చక్రంపై కెంపు, విశుద్ధ చక్రంపై నీలం, ఆజ్ఞా చక్రంపై వజ్రం, సహస్రార చక్రంపై ముత్యం ప్రభావాన్ని చూపుతాయి. ఆ రత్నాలను ఉపయోగించడం ద్వారా ఆయా చక్రాలను శుద్ధి చేసుకోవచ్చని, అవి శుద్ధి అయినప్పుడు... ఆ గ్రహాల శుభ దృష్టి మానవులకు లభిస్తుంది" అని నిర్మలాదేవి తెలిపారు.

ఆధ్యాత్మికంగా మానవుడి అత్యున్నత లక్ష్యం... తను సృష్టించిన పరమాత్మతో అనుసంధానం కావడమే. దీనికోసం మానవులలోని కుండలినీ శక్తి జాగృతమై, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సర్వవ్యాపితమైన భగవంతుని శక్తితో ఐక్యం కావాలి. ఈ మార్గంలో ఉండే ఆరు చక్రాలను కుండలినీ శక్తి దాటాలంటే... సాధకుడు శుభ లక్షణాలను సంతరించుకోవాలి. దీనికి నవగ్రహాలు దోహదం చేస్తాయి. ఉదాహరణకు... శని గ్రహం మన విశుద్ధ చక్రం మీద ప్రభావం చూపిస్తుంది. ఈ చక్రాన్ని కుండలినీ శక్తి దాటాలంటే... మానవులకు వైరాగ్య భావం, ప్రతిదాన్నీ సాక్షిలా చూడగలిగే స్వభావం ఉండాలి. పరిపూర్ణ ఆత్మ స్వరూపుడై... పరమాత్మను తనలో ప్రతిబింబించే వ్యక్తి... కష్ట సుఖాలను సమానంగా చూస్తాడు. అలాంటి వ్యక్తులపై శని అశుభ దృష్టి పని చేయదు. ఇదే విధంగా సహజయోగ సాధన ద్వారా కుండలినీ శక్తిని జాగృతం చేసుకున్న వ్యక్తి మీద నవగ్రహాల అశుభ ప్రభావం ఉండదని నిర్మలాదేవి వివరించారు. దీనికోసం సాధన ప్రారంభించడానికి, సాధనలో ఉన్నవారు మరింత దీక్షగా కొనసాగించాలనే సంకల్పం చేసుకోవడానికి వసంత ఋతువు అనువైన సమయం. ఈ సాధనకు శ్రీకారం చుట్టడానికి ఉగాది శుభప్రదమైన రోజు. కాబట్టి కొత్తదారిలో నడవడానికి, కొత్తదనాన్ని ఆహ్వానించడానికి సిద్ధమవుదాం.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

ఆశలకు ప్రతిరూపం

తెలుగు వారి కొత్త సంవత్సరం 'విశ్వావసు' మన ముంగిటకు వచ్చేస్తోంది. కొత్త సంవత్సరం కొత్త ఆశలకు తెర తీస్తోంది. ఇలాంటి ఆశలకు ప్రతి రూపమే మన పురాణాలలో అభివర్ణించిన రెక్కల గుర్రం- ఉచ్చైశ్రవం. భౌతిక పరిమితులను అధిగమించి.. పురోగతిని, ఆధ్యాత్మిక శక్తిని పొందాలనుకొనేవారికి ఇది మార్గదర్శి. స్వేచ్ఛ కోసం, అసాధారణ శక్తి సంపన్నత కోసం, ఆధ్యాత్మిక ప్రగతి కోసం తపన పడిన 'మనీషి'గా మారిన మనుషి ఆలోచనల నుంచి ఉద్భవించిన లోతైన తాత్త్విక భావన ఇది. ప్రాచ్య, పాశ్చాత్య పురాణాలన్నింటిలోనూ ఈ ఉచ్చైశ్రవ ప్రస్తావన ఉంది.

క్షీరసాగర మథనం జరిగినప్పుడు ఏడు తలలతో తెల్లని కాంతులీనే దివ్యాశ్వం ఉద్భవించింది. దేవ లోకాన్ని, మానవ లోకాన్ని కలిపే అశ్వమిది. 'నరసింహ పురాణం' ప్రకారం దేవతలు, అసురులు అమృతాన్ని పొందేందుకు క్షీరసాగరాన్ని మథించడం ప్రారంభించారు. దఫదఫాలుగా వేల సంవత్సరాలు సాగిన ఈ మథనంలో అనేక దివ్య వస్తువులు, జీవులు ఉద్భవించాయి. ఇలా రెండో మథనంలో బయటకు వచ్చినవి- ఐరావతం, ఉచ్చైశ్రవం. ఐరావతం ఐశ్వర్యానికి ప్రతీక. ఉచ్చైశ్రవం స్వేచ్ఛకు, పరాక్రమానికి, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక. 'దేవీ భాగవతం- 6వ అధ్యాయం'లో దీనికి సంబంధించిన ఒక కథ ఉంది. ఒక రోజు సూర్యపుత్రుడు రేవంతుడు ఉచ్చైశ్రవాన్ని ఎక్కి వైకుంఠానికి వస్తాడు. ఆ అశ్వం అందానికి లక్ష్మీదేవి మంత్రముగ్ధురాలై తనని తాను మర్చిపోయి చూస్తూ ఉండిపోతోంది. విష్ణువు ఆమెను అనేక సార్లు పిలుస్తాడు. ఆమె పలకదు. దీనితో విష్ణువుకు కోపం వచ్చి - "అశ్వాన్ని చూసి మైమరచిపోయావు కాబట్టి నువ్వు భూలోకంలో అశ్వరూపంలో జన్మించు" అని శపిస్తాడు. అప్పుడు శ్రీవిష్ణువును లక్ష్మీదేవి వేడుకుంటుంది. "భూలోకంలో నాతో సమానమైన కుమారుడిని పొందినప్పుడు మళ్ళీ నా సఖిగా చేరతావు..." అని లక్ష్మీదేవికి అనుగ్రహిస్తాడు. మనస్సు నిలకడగా లేకపోతే- అది ఎంత దివ్య సంబంధాన్నైనా దూరం చేస్తుందనేది ఈ కథ సారాంశం.



స్థల పురాణాలు కూడా...

సుప్రసిద్ధి చెందిన నాగేశ్వర తీర్థం ఏర్పడటానికి ఉచ్చైశ్రవం కారణమని అక్కడి స్థల పురాణాలు చెబుతాయి. వీటి ప్రకారం- కశ్యప మహర్షి భార్యలు- కద్రువ, వినతలకు ఉచ్చైశ్రవం రంగు విషయంలో వాదన జరుగుతుంది. కద్రువ ఆ అశ్వం నల్లదని, వినత అది తెల్లదని వాదించుకుంటారు. తన వాదనను నెగ్గించుకుందుకు కద్రువ- తన సర్ప కుమారులను వెళ్ళి ఉచ్చైశ్రవాన్ని చుట్టుకొమ్మని ఆజ్ఞాపిస్తుంది. దీని ద్వారా అశ్వం నల్లదని వినతకు నిరూపించవచ్చనేది కద్రువ భావన. దానికి ఆమె కుమారులు అంగీకరించరు. దీనితో కద్రువకు కోపం వచ్చి తన కుమారులను శపిస్తుంది. ఈ శాపవిముక్తి కోసం వారందరూ నాగేశ్వర తీర్థం వద్దకు వచ్చి శివుణ్ణి ప్రార్థిస్తారు. వారికి శివుడు విముక్తి ప్రసాదిస్తాడు. ఇలాంటి మరో స్థల పురాణం వటవటేశ్వర తీర్థం ఎలా ఉద్భవించిందనే విషయాన్ని చెబుతుంది. దీని ప్రకారం ఉచ్చైశ్రవానికి అశ్వపర్ణ, సుపర్ణ, మధుపర్ణ, మరుద్గతి అనే నలుగురు కుమారులు ఉంటారు. అశ్వపర్ణ- చంద్రుడి వాహనం. వటవటేశ్వర తీర్థంలో శంకరుడి కోసం చంద్రుడు తపస్సు చేయటం మొదలుపెడతాడు. ఆయనతో పాటు అశ్వపర్ణ కూడా తపస్సు ప్రారంభిస్తాడు. కానీ కొద్ది కాలానికి శక్తి క్షీణించి పడిపోతాడు. అప్పుడు శంకరుడు ప్రత్యక్షమై అశ్వపర్ణకు పరిపూర్ణమైన శరీరాన్ని ప్రసాదిస్తాడు. ఒక గుర్రం శివుడి దర్శనం పొందిన ఆ ప్రాంతాన్ని 'వటవటేశ్వర తీర్థం' అని పిలుస్తారు. ఈ ప్రాంతంలోనే ప్రవహించే నదికి 'అశ్వపర్ణి' అని పేరు.

- గ్రీకు పురాణాల ప్రకారం- మెడూసా అనే వీరుడి తలని పెర్సియస్ నరుకుతాడు. ఆ రక్తం నుంచి పెగాసస్ అనే రెక్కల గుర్రం జన్మించింది. బెల్లెరోఫోన్ అనే యోధుడు దీని సహాయంతో చిమేరా అనే భయంకర రాక్షసిని సంహరిస్తాడు. ఆ తర్వాత అతను అహంకారంతో దేవలోకానికి చేరాలనుకుంటాడు. అప్పుడు పెగాసెస్ అతణ్ణి పాతాళానికి తొక్కేస్తుంది. దురహంకారం మనిషిని అధఃపాతాళానికి చేరుస్తుందనటానికి ఉదాహరణగా ఈ కథను చెబుతారు.
- మహమ్మద్ ప్రవక్త 'బురాఖ్' అనే రెక్కల గుర్రాన్ని అధిరోహించిన ప్రస్తావన ఇస్లాంలో ఉంది. ఈ గుర్రం కాళ్ళు భూమిపై ఆనవు. అది వాయు-మనోవేగాలతో ప్రయాణిస్తుంది.
- మంగోలియన్ పురాణాల ప్రకారం తుల్పార్ అనే రెక్కల గుర్రం వీరులందరికీ సాయపడుతూ ఉంటుంది. మరణానంతరం వారికి ఉత్తమలోకాలకు తీసుకువెళ్తుంది.
- చైనీయులు లాంగ్మా అనే రెక్కల గుర్రం పుణ్యఫలాలను తీసుకువస్తుందని నమ్ముతారు. వాస్తవానికి ఇది డ్రాగన్ - అశ్వాల మిశ్రమం.

భగవద్గీతలో కూడా...

భగవాన్ శ్రీకృష్ణుడు గీతలో- "అశ్వాలలో ఉత్తమమైన ఉచ్చైశ్రవాన్ని నేనే. ఏనుగుల్లో రాజైన ఐరావతాన్ని నేనే! మనుషుల్లో సమ్రాట్టును నేనే" అని పేర్కొంటాడు. 'బ్రహ్మవైవర్తపురాణం'లోని 'బ్రహ్మఖండం'లో గోపుల రాజు ఉచ్చైశ్రవ వంశానికి చెందిన ఐదు లక్షల గుర్రాలను, వేల రథాలను, మూడు లక్షల ఎద్దుల బండ్లను దానం చేసినట్టు ఉంది. 'స్కాందపురాణం'లోని 'మాహేశ్వర ఖండం' (కేదార ఖండం)లో సూర్యుడి వాహనంగా ఉచ్చైశ్రవాన్నిపేర్కొన్నారు. మరికొన్ని పురాణాలు బలిచక్రవర్తి వాహనంగా దీన్ని ప్రస్తావించాయి.

• డాక్టర్ జి.వి.పూర్ణచంద్

సద్బోధ

ఇక నటించక్కర్లేదు


చైనాలో విలసిల్లిన సుప్రసిద్ధ మత ధర్మాలలో తావోయిజం ఒకటి. తావోయిజంలో మొదట పేర్కొనాల్సిన ప్రముఖుడు లావోట్జూ. ఆ తరువాత స్థానాల్లో లైజ్జూ, అతని శిష్యుడు చువాంగ్ ట్జూ ఉంటటారు. లైట్జూను కలుసుకోవడానికి ముందు చైనా చక్రవర్తి కొలువులో చువాంగ్ ఉద్యోగిగా ఉండేవాడు. చక్కటి ప్రవర్తనతో, మంచి మాటలతో, వినయ విధేయతలతో అతను చక్రవర్తి మెప్పు పొందాడు. ఆ తరువాత లైట్జూతో చువాంగ్‌కు పరిచయం ఏర్పడింది. వారిద్దరూ ఎన్నో విషయాలు కలిసి చర్చించేవారు. లైట్జూతో సాన్నిహిత్యం చువాంగ్‌లో ఎంతో మార్పు తెచ్చింది. తను గడుపుతున్న జీవితం అతనికి సంతృప్తిగా అనిపించలేదు. తాను సాధించవలసింది ఇంకా ఎంతో ఉందని గ్రహించాడు. తన పరిస్థితిని చక్రవర్తికి విన్నవించి, కొంతకాలం సెలవు తీసుకున్నాడు.

ఆ తరువాత గురువు లైట్జూ పర్యవేక్షణలో తన సాధనను చువాంగ్ కొనసాగించాడు. జ్ఞానోదయం పొందాడు. అతని పేరు ప్రతిష్టలు క్రమక్రమంగా రాజ్యమంతటా విస్తరించాయి. చువాంగ్ గొప్పతనం గురించే అందరూ మాట్లాడుకొనేవారు. ఈ సంగతి చక్రవర్తి చెవిన పడింది. ఒకప్పుడు తన కొలువులో పనిచేసిన వ్యక్తి... జ్ఞాని అయ్యాడనీ, ప్రజలందరి గౌరవాన్ని పొందుతున్నాడనీ తెలిసి చాలా సంతోషించాడు. సెలవుపై వెళ్ళిన చువాంగ్ ఏదో ఒక రోజు తనను కలుసుకోవడానికి వస్తాడని చక్రవర్తి ఎంతగానో ఎదురుచూశాడు. కాలం గడుస్తోంది కానీ చువాంగ్ రాలేదు. చివరకు స్వయంగా చక్రవర్తే బయలుదేరాడు.

చక్రవర్తి కొలువులో ఉన్నప్పుడు చక్రవర్తి అన్ని పద్ధతులను సక్రమంగా పాటించేవాడు. ఇప్పుడు కూడా... తన రాక గురించి తెలిసిన వెంటనే మర్యాదపూర్వకంగా ఎదురు వచ్చి స్వాగతం పలుగుతాడని, గౌరవాన్ని కనబరుస్తాడని చక్రవర్తి ఆశించాడు. కానీ అలా జరగలేదు. ఆఖరికి చక్రవర్తి స్వయంగా చువాంగ్ ఎదుటకు వచ్చి నిలబడినా, కనీసం నిలబడలేదు. రెండు కాళ్ళను చాచుకొని, పిల్లన గ్రోవి ఊదుతూ చెట్టుకింద అలాగే కూర్చున్నాడు. చక్రవర్తిని చూసిన తరువాత కూడా కాళ్ళను ముడుచుకోలేదు, పిల్లన గ్రోవిని ఊదడం మానలేదు. ఇది చక్రవర్తికి ఆశ్చర్యం కలిగించింది.

"చువాంగ్! మర్యాదలన్నీ మరచిపోయావా? పద్ధతులన్నీ గాలికి వదిలేశావా? అహంకారం తలకెక్కిందా? చక్రవర్తి వస్తే తగిన గౌరవం చూపించవా? నీకేమయింది?" అని ప్రశ్నించాడు.

అప్పుడు చువాంగ్ నవ్వి "ఓ రాజా! మీ కొలువులో పని చేస్తున్నప్పుడు మీ మెప్పు పొందడం కోసం ఏవేవో మర్యాదలు కనబరిచాను. మిమ్మల్ని మెప్పించి స్వార్థపూరితమైన నా కోరికలు తీర్చుకున్నాను. అదంతా నటన. ఇప్పుడు నాకు స్వార్థం లేదు, కోరికలు అస్సలు లేవు. కాబట్టి వినయ విధేయతలను ఇక ఏమాత్రం నటించలేను. ఇప్పుడు నా హృదయంలో ఉన్నది



ప్రేమ మాత్రమే. నా దగ్గరకు రాజు వచ్చినా, దరిద్రంతో మునిగి ఉన్న వ్యక్తి వచ్చినా... ఏ బేధం పాటించకుండా ఆ ప్రేమను మాత్రమే చూపించగలను" అని చెప్పాడు.

ఆ మాటలు సత్యమని చక్రవర్తి గ్రహించాడు. అవి హృదయం నుంచి వచ్చిన మాటలేననీ, అహంకారం లోంచి పుట్టినవి కావని తెలుసుకున్నాడు. చువాంగ్‌కు నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

• రాచమడుగు శ్రీనివాసులు









డీసీసీలే పార్టీకి ఫ్రంట్ వారియర్స్

- మీరు దూతలు కాదు.. పార్టీకి రక్షణ రేఖలు
- బలహీన వర్గాలపై దాడుల నిర్మూలనకే కుల గణన
- డీసీసీ అధ్యక్షుల సమావేశంలో ఏఐసీసీ చీఫ్ ఖర్గే
- కాంగ్రెస్ పార్టీకి జిల్లా అధ్యక్షులే పునాది: రాహుల్
- తెలంగాణ, ఏపీ సహా 13 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల డీసీసీల సమావేశం


డీసీసీల సమావేశంలో రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి జిల్లా అధ్యక్షులే ఫ్రంట్ వారియర్స్ అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. డీసీసీ అధ్యక్షులు అంటే పార్టీకి దూతలు కాదని, రక్షణ రేఖలని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 13 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన డీసీసీ అధ్యక్షులతో ఖర్గే సమావేశం నిర్వహించారు. సమావేశానికి 338 జిల్లాలకు చెందిన అధ్యక్షులు హాజరయ్యారు. ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాకూర్ తదితరులు దిశానిర్దేశం చేశారు. డీసీసీ అధ్యక్షులకు మరిన్ని అధికారాలను కట్టబెడతామని పార్టీ అగ్రనేతలు హామీ ఇచ్చారు. తొలుత ఖర్గే మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ చూస్తున్నాయని.. ఇందుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. ఈ పోరాటాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులపై ఉందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని 240 సీట్లకే పరిమితం చేయడంలో విజయం సాధించామన్నారు. మరింత కష్టపడి ఉంటే కాంగ్రెస్ మరో 20 నుంచి 30 స్థానాలు సులభంగా వచ్చేవని, అప్పుడు యూపీఏ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉండేదన్నారు. దేశంలోని పేదలు, అణగారిన వర్గాలపై దాడులను నిర్మూలించేందుకు కుల గణన డిమాండ్ వచ్చిందన్నారు. రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో విజయం కోసం దీర్ఘకాలిక వ్యూహంతో ఐక్యంగా ముందుకెళ్లాలని జిల్లా అధ్యక్షులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం.. తెలంగాణ, కర్ణాటకలో స్వతంత్రంగా.. తమిళనాడులో కూటమితో అధికారంలో ఉన్నామని తెలిపారు. వచ్చే ఏడాదిలో అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో ఎన్నికలు ఉన్నాయని, ఆయా జిల్లాలోని ప్రతి అభ్యర్థికి విజయం సాధించడం కోసం పార్టీ శ్రమిస్తుందని స్పష్టం చేశారు.

పార్టీకి జిల్లా అధ్యక్షులే పునాది: రాహుల్ గాంధీ

కాంగ్రెస్ పార్టీకి జిల్లా అధ్యక్షులే పునాది అని, వారు లేకుండా పార్టీ అభివృద్ధి సాధ్యంకాదని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. విజయ సాధనలో డీసీసీలదే కీలక పాత్ర అని చెప్పారు. తమ పోరాటం ఆర్ఎస్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా మాత్రమే కాదని... దేశంలోని ప్రతి పౌరుడు కలలు కనే సమాజాన్ని స్థాపించడం, హక్కులను సాధించడం కోసమని పేర్కొన్నారు. కాగా ఈ సమావేశంలో తెలంగాణ నుంచి జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖకు మాట్లాడే అవకాశం కల్పించారు. భారత్ జోడో యాత్రతో దేశవ్యాప్తంగా పార్టీకి ఎంతో మైలేజ్ వచ్చిందని, తెలంగాణలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల నాటికి పార్టీ సోషల్ మీడియా వింగ్‌ను మరింత యాక్టివ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాగా పీసీసీల నుంచి గ్రామ స్థాయి కమిటీ వరకు పనిచేసేవారికే పార్టీ పదవులివ్వాలని సురేఖ పేర్కొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై సైబర్ 'నిఘా'

- పలు చోట్ల నమోదైన కేసులు.. తెర వెనుక సూత్రధారుల కోసం ఆరా

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికల్లో పెడుతున్న పోస్టులపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిఘా పెడుతున్నది. సీఎంతోపాటు మంత్రులు, ప్రభుత్వం, ప్రభుత్వంలో కీలక వ్యక్తులపై వివిధ సోషల్ మీడియా వేదికల్లో అనుచిత, అభ్యంతరకర పోస్టులు పెడుతున్న వ్యక్తులపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు పథకం ప్రకారం సోషల్ మీడియా వేదికల్లో పోస్టులు చేస్తున్నారు. మరి కొందరు ఆయా పోస్టులను షేర్ చేస్తున్నారు. పోస్టులు పెడుతున్న, షేర్ చేస్తున్న వ్యక్తుల నెట్‌వర్క్‌ను గుర్తించడంపై సైబర్ సెక్యూరిటీ అధికారులు దృష్టిపెట్టారు. ఈ నెట్‌వర్క్ వెనుక సూత్రధారులెవరన్నది గుర్తించేందుకు నిఘా బృందాలు రంగంలోకి దిగాయి. 'ఎక్స్'లో అమెరికా నుంచి నిర్వహిస్తున్న నిప్పుకోడి అనే ఖాతాపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేస్తూ పలు పోస్టులు పెట్టిన నిప్పుకోడి హ్యాండిల్ నిర్వాహకులపై హన్మకొండలో కేసు రిజిస్టరైంది. సీఎం సీపీఆర్‌వో అయోధ్యరెడ్డి కూడా నిప్పుకోడి ఖాతాలో వచ్చిన పోస్ట్‌పై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమిషన్లు తీసుకుంటున్నారనే అర్థం వచ్చేలా సీఎంపై నల్లబాలు అనే వ్యక్తి చేసిన పోస్ట్ మీద సైబర్ క్రైం పోలీస్ కానిస్టేబుల్ వాసిం ఫిర్యాదుతో కేసు రిజిస్టర్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక హ్యాండిల్ పెట్టిన పోస్టును నల్లబాలు రీపోస్ట్ చేయడంతో ఈ కేసు నమోదైంది. అసలు విషయాలను పేరడీ చేస్తూ ఒక యూట్యూబ్ చానల్ విడుదల చేస్తున్న వీడియోలపై కరీంనగర్ పోలీసులు కేసుపెట్టారు. సీఎం రేవంత్‌ను టార్గెట్ చేస్తూ తెలంగాణ గుంపు మేస్త్రీ, కేసీవీపీ, డిగ్‌టీవీలపై సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ వాసి అశోక్ రెడ్డి.. సీఎం రేవంత్‌ను లక్ష్యంగాచేసి పెట్టిన పోస్టులపై రామగుండంలో కేసు పెట్టారు. వ్యక్తిత్వ హననం, పరువు తీయడం, బెదిరింపుల దిశగా సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టుల వెనుక గుట్టును వెలికితీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

నాకూ మంత్రి పదవి ఇవ్వండి

- ఖర్గేకు ఎమ్మెల్యే మాధవరెడ్డి వినతి

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మంత్రిగా తనకు కూడా అవకాశం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ హయాంలోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచానని గుర్తు చేశారు. ఆ సమయంలో బీఆర్ఎస్‌లో చేరాలని అధికార పార్టీ ఒత్తిడి తెచ్చినా చేరలేదన్నారు.

మెట్రో రెండో దశ ప్రతిపాదన అందింది

- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

న్యూఢిల్లీ, మార్చి27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మెట్రో రెండో దశ కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి విజ్ఞప్తులు అందాయని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 5 కారిడార్లతో కూడిన మెట్రో రెండో దశ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ప్రతిపాదనలను అందించిందని తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

మాస్ లుక్‌లో...



రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గురువారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులను ఖుషీ చేశారు మేకర్స్. సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను ఖరారు చేసి, రామ్‌చరణ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. గుబురు గడ్డంతో చుట్ట వెలిగిస్తూ మాస్ లుక్‌లో కనిపించారు. ఈ లుక్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

రామ్‌చరణ్‌కు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "పుట్టిన రోజు శుభాకాంక్షలు చరణ్. 'పెద్ది'లో నీ లుక్ అదిరిపోయింది. నీలోని నటుడిని ఈ సినిమా మరింత కొత్తగా చూపించనుందనే నమ్మకం ఉంది. సినీ ప్రియులకు కన్నుల పండుగగా ఉండే ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, సాయి దుర్గాతేజ్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ కాజల్ అగర్వాల్ తదితరులు రామ్‌చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ పోస్టులు పెట్టారు.

జూన్ 2న ఇళయరాజాకు సన్మానం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ప్రభుత్వం జూన్ రెండో తేదీన సన్మానించనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం శాసనసభలో ప్రకటించారు. ఇళయరాజా 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయన పుట్టిన రోజైన జూన్ రెండో తేదీన ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. వీసీకే సభ్యుడు చింతనై సెల్వం మాట్లాడుతూ.. 'సంగీత దర్శకుడు ఇళయరాజా తన సింఫనీ అరంగేట్రం కార్యక్రమాన్ని లండన్ వేదికగా విజయవంతంగా పూర్తి చేశారని, ఆ సింఫనీని తమిళ ప్రజలు వినేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందా? అని ప్రశ్నించారు. దీనికి సీఎం స్టాలిన్ సమాధానమిస్తూ.. 'సింఫనీ అరంగేట్రాన్ని పూర్తి చేసుకుని వచ్చిన ఇళయరాజాకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సాదర స్వాగతం పలికాం. సింఫనీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహించాలని కోరాం. తక్షణం 4 వేల మంది కళాకారులను రాష్ట్రానికి పిలిపించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శ్రమతో కూడుకున్నపని అని ఇళయరాజా అన్నారు' అని సీఎం తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి



సల్మాన్ ఖాన్

చెత్త సినిమాలు తీస్తే ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి అంటూ.. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'సికందర్' ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ 'సరైన చిత్రాలు తెరకెక్కించలేనప్పుడు అవి బాక్సాఫీసు వద్ద పరాజయాలే మూటగట్టుకుంటాయి. అందరూ కలసి కష్టపడితేనే మంచి సినిమా వస్తుంది. అయినప్పటికీ హీరో ఫొటోను మాత్రమే పోస్టర్‌లో వేస్తారు. ప్రేక్షకులు కూడా అది చూసే థియేటర్లకు వస్తుంటారు. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే అందరూ ఆ హీరోనే తప్పుపడతారు' అని సల్మాన్ ఖాన్ వ్యాఖ్యానించారు.



ఆ మాటలు నన్ను కదిలించాయి

జూనియర్ ఎన్టీఆర్

ఓ జపనీస్ అభిమాని చెప్పిన మాటలకు చలించిపోయారు జూనియర్ ఎన్టీఆర్. ఆయన కొరటాల శివ దర్శకత్వంలో నటించిన 'దేవర' చిత్రం నేడు జపాన్‌లో విడుదలవుతోంది. అక్కడ నిర్వహించిన సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఎన్టీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ పాటకు ఓ అభిమానితో కలసి స్టెప్పులేసిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, తన జపాన్ పర్యటనపై ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు ఎన్టీఆర్. "ఆర్ఆర్ఆర్' సినిమా చూసిన తరవాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. ఇలాంటి వాటి కోసమే భారతీయ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొన్నారు.

సినిమాగా డొక్కా సీతమ్మ కథ



అన్నపూర్ణగా, అన్నదాతగా చరిత్రలో నిలిచిపోయిన గొప్ప మహిళ డొక్కా సీతమ్మ. ఏ సమయంలోనైనా తన ఇంటికి ఎంతమంది వచ్చినా.. లేదు.. అనకుండా వారికి తనే స్వయంగా వండి వడ్డించిన ఆ మహాతల్లి జీవిత కథ ఇప్పుడు సినిమాగా వస్తోంది. అయితే చిత్ర నిర్మాణం ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్ విషయంలో వివాదం మొదలైంది. దాని గురించి రచయిత రామకృష్ణ మాట్లాడుతూ 'సీతమ్మ కథను 'అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో మొదట నాటకం రాశాను. 2016లోనే డొక్కా సీతమ్మ సినిమా స్క్రిప్ట్‌ను తెలుగు సినీ రచయితల సంఘంలో రిజిస్టర్ చేశాను. ఎంతో కాలంగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చరిత్రను పరిశోధించి స్క్రిప్ట్ తయారు చేశాను' అని చెప్పారు. చరిత్ర సాకుతో తమ రచనను కాపీ కొడుతూ వేరొక సంస్థ కూడా సినిమా తీయడానికి ప్రయత్నించడంతో ఈ వివాదం కోర్టుకు చేరిందని నిర్మాత ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కాపీ రైట్ యాక్ట్ కింద తమకు హక్కు ఉన్నప్పటికీ విషయం కోర్టులో ఉన్నందువల్ల తాము కోర్టు తీర్పును శిరోధార్యంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే వేరొక సంస్థ సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే నిజంగా జరిగితే కోర్టు ధిక్కారం అవుతుందని ఆయన హెచ్చరించారు. కోర్టు తేల్చే వరకూ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని కోరారు.

రీతికకు రజతం

ముస్కాన్, మాన్సీలకు కాంస్యాలు

ఆసియా రెజ్లింగ్


రీతిక

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో..తొలి రోజు భారత్ అదరగొట్టింది. గురువారం జరిగిన పోటీలలో మనోళ్లు ఓ రజతం, రెండు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల 76 కిలోల విభాగంలో రీతికా హుడా రజతం, 59 కేజీల కేటగిరీలో ముస్కాన్, 68 కిలోల విభాగంలో మాన్సీ లాథర్ కాంస్యాలు దక్కించుకున్నారు. హోరాహోరీగా సాగిన 76 కిలోల ఫైనల్లో రీతిక 6-7తో కిర్గిస్థాన్ రెజ్లర్ అపేరి కిజీ చేతిలో పరాజయం చవిచూసింది. 59 కిలోల కాంస్య పోరులో ముస్కాన్ 4-0తో మంగోలియాకు చెందిన టొగ్టోఖ్‌ను ఓడించి విజేతగా నిలిచింది. వరల్డ్ అండర్-17 చాంపియన్ మాన్సీ లాథర్ 68 కిలోల విభాగంలో.. 12-2తో కజూలినా (కజకిస్థాన్)ను చిత్తు చేసి కాంస్య పతకం అందుకుంది. మహిళల 55 కిలోల విభాగంలో మరో భారత రెజ్లర్ నిషు కాంస్య పతక పోరులో పరాజయం చవిచూసింది.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై x బెంగళూరు	రా.7.30	వేదిక చెన్నై

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	1	1	0	0	2	2.137
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
పంజాబ్	1	1	0	0	2	0.550
చెన్నై	1	1	0	0	2	0.493
ఢిల్లీ	1	1	0	0	2	0.371
హైదరాబాద్	2	1	1	0	2	-0.128
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
ముంబై	1	0	1	0	0	-0.493
గుజరాత్	1	0	1	0	0	-0.550
రాజస్థాన్	2	0	2	0	0	-1.882

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

హిందీ కామెంట్రీ పేలవం!

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో హిందీ వ్యాఖ్యానంపై క్రికెట్ ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేశారు. మాజీ ఆటగాళ్లతో కూడిన హిందీ వ్యాఖ్యాతల ప్యానెల్ వారి స్థాయికి తగ్గట్టుగా మ్యాచ్‌లను విశ్లేషించలేకపోతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అదే సమయంలో ఇంగ్లిష్ వ్యాఖ్యానం అద్భుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. హర్భజన్, సెహ్వాగ్, నవజోత్ సిద్ధూ, ధవన్, రైనా, ఊతప్ప, రాయుడు తదితరులతో కూడిన బృందం హిందీ వ్యాఖ్యానం చేస్తోంది. ప్రస్తుత హిందీ కామెంట్రీని 1990లలో దూరదర్శన్‌లో వచ్చే వ్యాఖ్యానంతో అభిమానులు పోల్చారు. కాగా..దీనిపై హర్భజన్ స్పందిస్తూ.. వ్యాఖ్యానాన్ని మెరుగుపరుచుకుంటామన్నాడు.

రైజర్స్‌కు ఝలక్

చెలరేగిన పూరన్ ● శార్దూల్‌కు నాలుగు వికెట్లు

లఖ్‌నవూ 'సూపర్' విజయం


నికోలస్ పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 70)

ఐపీఎల్‌లో ఇంత వేగంగా (7.3 ఓవర్లలో) వంద పరుగులు చేయడం లఖ్‌నవూకు ఇదే తొలిసారి.

1

20 బంతుల్లోపే ఎక్కువ (4) ఫిఫ్టీలు సాధించిన ఐపీఎల్ బ్యాటర్‌గా పూరన్.

ఐపీఎల్‌లోనే భీకర బ్యాటింగ్ లైనప్.. పైగా గతేడాది ఇదే లఖ్‌నవూ జట్టుపై 9.4 ఓవర్లలో 167 రన్స్ బాదిన సన్‌రైజర్స్ వామ్మో అనిపించింది. దీంతో ఇప్పుడు 300 స్కోరు ఖాయమేనా? అనే విశ్లేషణలు కూడా వినిపించాయి. కానీ ఈసారి ఉప్పల్‌లో సీన్ మారింది. టాస్ గెలిచిన పంత్ ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించడమే కాదు.. వారెంత కొట్టినా తాము ఛేదించగలమంటూ సవాల్ విసిరాడు. పేసర్ శార్దూల్ (4/34) ఆరంభంలోనే ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లకు ముకుతాడు వేయగా, వీర బాదుడు మీకే కాదు.. మాకూ వచ్చంటూ నికోలస్ పూరన్ 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో ఓటమిని కళ్ల ముందుంచాడు. ఓపెనర్ మార్ష్ కూడా సహకరించడంతో లఖ్‌నవూ గట్టిగానే ప్రతీకారం తీర్చుకుంది.

హైదరాబాద్: ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సొంత మైదానంలో షాక్ తగిలింది. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో 286 రన్స్ చేసిన జోష్‌లో ఉన్న ఆ జట్టును లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నేలకు దించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో కనబర్చిన లఖ్‌నవూ 5 వికెట్ల తేడాతో గెలిచింది. పేసర్ శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లతో అదరగొట్టగా, బ్యాటింగ్‌లో నికోలస్ పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 70) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. హెడ్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 47), అనికేత్ (13 బంతుల్లో 5 సిక్సర్లతో 36), నితీశ్ (28 బంతుల్లో 2 ఫోర్లతో 32), క్లాసెన్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26) రాణించారు. ఛేదనలో లఖ్‌నవూ 16.1 ఓవర్లలోనే 5 వికెట్లకు 193 పరుగులు చేసి గెలిచింది. మార్ష్ (31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 52), సమద్ (8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 22 నాటౌట్) ఆకట్టుకున్నారు. కమిన్స్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శార్దూల్ ఠాకూర్ నిలిచాడు.


శార్దూల్ (4-0-34-4)

పూరన్ పూనకం: ఛేదనలో రైజర్స్ బౌలర్లను పూరన్ ఆడేసుకున్నాడు. ఓపెనర్ మార్‌క్రమ్ (1) మరోసారి విఫలమైనా.. మరో ఓపెనర్ మార్ష్‌తో కలిసి పూరన్ స్కోరును రాకెట్ వేగంతో ముందుకు తీసుకెళ్లాడు. రెండో ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన పూరన్ ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా చెలరేగాడు. మూడో ఓవర్‌లో 4,6,6తో 17 రన్స్ రాబట్టగా.. తర్వాతి ఓవర్‌లో మార్ష్ రెండు సిక్సర్లతో 18 రన్స్ అందించాడు. అభిషేక్ ఓవర్‌లో పూరన్ మరో రెండు సిక్సర్లతో లఖ్‌నవూ పవర్‌ప్లేలో 77/1 స్కోరుతో మెరుగైన స్థితిలో నిలిచింది. పూరన్ తన జోరును కొనసాగిస్తూ ఏడో ఓవర్‌లో 6,6,4తో 18 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. తాజా సీజన్‌లో ఇదే ఫాస్టెస్ట్. అయితే పూరన్ తుఫాన్ ఆటకు కమిన్స్ 9వ ఓవర్‌లో ఎల్బీతో బ్రేక్ వేశాడు. దీంతో రెండో వికెట్‌కు 43 బంతుల్లో 116 పరుగులు మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మార్ష్ రెండు వరుస ఫోర్లతో 29 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసి కమిన్స్‌కే చిక్కాడు. స్వల్ప వ్యవధిలో బదోని (6), పంత్ (15) అవుటైనా అప్పటికే జట్టు విజయం ఖాయమైంది. అబ్దుల్ సమద్ 15వ ఓవర్‌లో 4,6.. 16వ ఓవర్‌లో 6,4తో ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో మరో 23 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.


హెడ్ (47) బౌల్డ్

కట్టడి చేశారు: టాస్ గెలిచిన లఖ్‌నవూ కెప్టెన్ పంత్.. రైజర్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించడంతో ఇక పరుగుల వరదే అనే భావనలో స్టేడియం హోరెత్తిపోయింది. అయితే పంత్ నమ్మకాన్ని బౌలర్లు వమ్ము చేయలేదు. ఆరంభంలో పేసర్లు శార్దూల్, మధ్య ఓవర్లలో ప్రిన్స్ యాదవ్ విశేషంగా రాణించి రైజర్స్‌ను కట్టడి చేశారు. ఇన్నింగ్స్ చివరి 15 బంతుల్లోనైతే లఖ్‌నవూ ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. హెడ్, అనికేత్ బాదుడు రైజర్స్ స్కోరులో కీలకంగా నిలిచింది. మూడో ఓవర్‌లో పేసర్ శార్దూల్ వరుస బంతుల్లో ఓపెనర్ అభిషేక్ (6), గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్‌ను గోల్డెన్ డకౌట్ చేసి రైజర్స్‌కు ఝలకిచ్చాడు. అయినా మరో ఓపెనర్ హెడ్ మాత్రం దూకుడు ఆపలేదు. తర్వాతి ఓవర్‌లోనే 6,6,4తో 18 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్ తొలి బంతికి హెడ్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను పూరన్ వదిలేయగా.. ఐదో బంతికి క్లిష్టమైన రిటర్న్ క్యాచ్‌ను స్పిన్నర్ బిష్ణోయ్ అందుకోలేకపోయాడు. పవర్‌ప్లేలో రైజర్స్ 62/2తో నిలిచింది. ఇక హెడ్ మరింత ప్రమాదకరంగా మారకముందే 8వ ఓవర్‌లో ఫుల్లర్ లెంగ్త్ బాల్‌తో పేసర్ ప్రిన్స్ బౌల్డ్ చేశాడు. అప్పటికే మూడో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. అనంతరం పరుగులు కూడా నెమ్మదించగా, క్రీజులో ఉన్న నితీశ్ ఆచితూచి ఆడాడు. అలాగే 11వ ఓవర్‌లో అతను అంపైర్ కాల్‌తో ఎల్బీ నుంచి తప్పించుకున్నాడు. స్పిన్నర్ దిగ్వేష్ ఓవర్‌లో సిక్సర్ బాదిన క్లాసెన్ అనూహ్యంగా రనౌటయ్యాడు. 12వ ఓవర్‌లో నితీశ్ రిటర్న్ క్యాచ్‌ను అందుకునే క్రమంలో ప్రిన్స్ చేతికి తగిలిన బంతి నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్లను గిరాటేయడంతో క్లాసెన్ పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. అటు ఒత్తిడికి లోనైన నితీశ్ భారీ షాట్‌కు వెళ్లి బిష్ణోయ్ ఓవర్‌లో బౌల్డయ్యాడు. అయితే ఎవరి అంచనాలో లేని అనికేత్ మాత్రం 15, 16వ ఓవర్లలో రెండు వరుస సిక్సర్లతో స్కోరును పరిగెత్తించాడు. అదే జోరులో మరో షాట్‌కు వెళ్లి మిల్లర్‌కు చిక్కాడు. ఆ వెంటనే అభినవ్ (2)ను శార్దూల్ అవుట్ చేశాడు. ఇక కమిన్స్ (4 బంతుల్లో 3 సిక్సర్లతో 18) తానెదుర్కొన్న తొలి మూడు బంతులను సిక్సర్లుగా మలిచి అదుర్స్ అనిపించినా నాలుగో బంతికి వెనుదిరిగాడు. ఇక 19వ ఓవర్‌లో శార్దూల్ మూడు పరుగులే ఇచ్చి షమి (1)ని వెనక్కి పంపి 4 వికెట్లను పూర్తి చేసుకోగా, ఆఖరి ఓవర్‌లో అవేశ్ ఏడు పరుగులే ఇవ్వడంతో రైజర్స్ స్కోరు 200లోపు ముగిసింది.

మమ్మల్ని గుర్తించండి

ఫిఫాకు అఫ్ఘాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు అభ్యర్థన



న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టును అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) గుర్తించాలని ఆ దేశ క్రీడాకారిణులు కోరుతున్నారు. 2021లో అఫ్ఘాన్ పాలన తాలిబన్ల చేతిలోకి వెళ్లిన తర్వాత వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ పోటీల నుంచి ఆ దేశ జట్టును తప్పించారు. తమకు మళ్లీ గుర్తింపు ఇవ్వాలని అఫ్ఘాన్ మహిళా జట్టు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటంలో అందరూ తమకు మద్దతుగా నిలవాలని అభ్యర్థిస్తున్నారు. అఫ్ఘాన్ జట్టులోని చాలా మంది ప్లేయర్లు దేశం విడిచి విదేశాల్లో తలదాచుకొంటున్నారు.

గ్రూప్ 'బి'లో భారత్

ఏఎఫ్‌సీ ఆసియాకప్ డ్రా

న్యూఢిల్లీ: ఏఎఫ్‌సీ మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్లో భారత జట్టు గ్రూప్ 'బి'లో చోటు దక్కించుకుంది. ఇందులో థాయ్‌లాండ్, మంగోలియా, టిమోర్ లెస్టే, ఇరాక్ ఇతర జట్లుగా ఉన్నాయి. జూన్ 23 నుంచి జూలై 5 వరకు జరిగే గ్రూప్ 'బి' మ్యాచ్‌లకు థాయ్‌లాండ్ వేదిక కానుంది. మొత్తంగా ఈ క్వాలిఫయర్లో 8 గ్రూపుల్లో 34 జట్లు పోటీపడుతున్నాయి. ప్రతీ గ్రూప్ విజేత ఆస్ట్రేలియాలో జరిగే ఫైనల్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) ప్రిన్స్ 47, అభిషేక్ (సి) పూరన్ (బి) శార్దూల్ 6, ఇషాన్ (సి) పంత్ (బి) శార్దూల్ 0, నితీశ్‌కుమార్ (బి) బిష్ణోయ్ 32, క్లాసెన్ (రనౌట్) 26, అనికేత్ (సి) మిల్లర్ (బి) రాఠి 36, అభినవ్ (సి) సమద్ (బి) శార్దూల్ 2, కమిన్స్ (సి) రాఠి (బి) అవేశ్ 18, హర్షల్ (నాటౌట్) 12, షమి (సి) బదోని (బి) శార్దూల్ 1, సిమర్జీత్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం: 20 ఓవర్లలో 190/9; వికెట్ల పతనం:** 1-15, 2-15, 3-76, 4-110, 5-128, 6-156, 7-156, 8-176, 9-181; **బౌలింగ్:** శార్దూల్ 4-0-34-4, అవేశ్ 4-0-45-1, దిగ్వేష్ రాఠి 4-0-40-1, రవి బిష్ణోయ్ 4-0-42-1, ప్రిన్స్ 4-0-29-1.

లఖ్‌నవూ: మిచెల్ మార్ష్ (సి) నితీశ్ (బి) కమిన్స్ 52, మార్‌క్రమ్ (సి) కమిన్స్ (బి) షమి 1, నికోలస్ పూరన్ (ఎల్బీ) కమిన్స్ 70, రిషభ్ పంత్ (సి) షమి (బి) హర్షల్ 15, ఆయుష్ బదోని (సి) హర్షల్ (బి) జంపా 6, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 13, అబ్దుల్ సమద్ (నాటౌట్) 22, **ఎక్స్‌ట్రాలు:** 14; **మొత్తం: 16.1 ఓవర్లలో 193/5; వికెట్ల పతనం:** 1-4, 2-120, 3-138, 4-154, 5-164; **బౌలింగ్:** అభిషేక్ 2-0-20-0, షమి 3-0-37-1, సిమర్జీత్ సింగ్ 2-0-28-0, కమిన్స్ 3-0-29-2, ఆడమ్ జంపా 4-0-46-1, హర్షల్ పటేల్ 2-0-28-1, ఇషాన్ కిషన్ 0.1-0-4-0.


బిజినెస్

వాహన విడిభాగాల తయారీదారులకు

ట్రంప్ టారిఫ్ షాక్!

భారత్ నుంచి అమెరికాకు ఏటా రూ.60,000 కోట్ల ఎగుమతులు

కంపెనీల మార్జిన్లపై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ: వచ్చే నెల 3 నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే అన్ని వాహనాలు, వాటి విడిభాగాలపై 25 శాతం సుంకం వసూలు చేయనున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత్‌లోని వాహన విడిభాగాల తయారీదారులకు ఇది శరాఘాతంగా పరిణమించనుంది. ఎందుకంటే, భారత కంపెనీలు ఏటా దాదాపు 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.60,000 కోట్లు) విలువైన వాహన విడిభాగాలను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. అమెరికా సుంకాల దెబ్బకు తమ లాభాల మార్జిన్లు తగ్గవచ్చని ఇండస్ట్రీ భయపడుతోంది. ముఖ్యంగా సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్, భారత్ ఫోర్జ్, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌పై ట్రంప్ సుంకాల ప్రభావం అధికంగా ఉండనుంది. సోనా బీఎల్‌డబ్ల్యూకు 40 శాతం, భారత్ ఫోర్జ్‌కు 38 శాతం, సంవర్ధన మదర్సన్‌కు 18 శాతం ఆదాయం అమెరికా ఎగుమతుల నుంచే సమకూరుతోంది.

టాటాకు జేఎల్ఆర్ ఎఫెక్ట్

దేశీయ వాహన కంపెనీల్లో టాటా మోటార్స్ ఆదాయంపైన సుంకాలు ప్రభావం చూపనున్నాయి. కంపెనీకి చెందిన అంతర్జాతీయ బ్రాండ్ జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్ఆర్) ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో జేఎల్ఆర్ ప్రపంచవ్యాప్తంగా 4 లక్షలకు పైగా కార్లను విక్రయించగా.. అందులో అమెరికా మార్కెట్ వాటా 23 శాతంగా ఉంది. అవన్నీ యూకేలోని కంపెనీ ప్లాంట్ల నుంచి ఎగుమతైనవే. ట్రంప్ సుంకాలను పూర్తిగా భరించాల్సి వస్తే జేఎల్ఆర్ లాభాలకు భారీగా గండిపడే అవకాశం ఉంది.

అమెరికా దిగుమతులపై 15 శాతం సుంకం

ఇండస్ట్రీ అంచనాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ కంపెనీలు అమెరికాకు 679 కోట్ల డాలర్ల విలువైన వాహన విడిభాగాలను ఎగుమతి చేశాయి. కాగా, అమెరికా నుంచి భారత్‌కు 140 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులు జరిగాయి. ప్రస్తుతం అమెరికా తన దేశంలోకి దిగుమతయ్యే వాహన విడిభాగాలపై ఎలాంటి సుంకం విధించడం లేదు. భారత్ మాత్రం అమెరికా నుంచి దిగుమతయ్యే విడిభాగాలపై 15 శాతం సుంకం వసూలు చేస్తోంది.

ఎగుమతి ఆదాయంలో 27 శాతం అమెరికాదే


ఈ ఏడాది మే లేదా ఆ తర్వాత ఇంజన్లు, ట్రాన్స్‌మిషన్లు, పవర్‌ట్రెయిన్ పార్ట్స్, ఎలక్ట్రికల్ పార్ట్స్ వంటి కీలక విడిభాగాలపైనా 25 శాతం సుంకం విధించే యోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉంది. ఈ భారాన్ని పూర్తిగా భరించాల్సి వస్తే, భారత వాహన విడిభాగాల ఎగుమతిదారుల నిర్వహణ లాభాల మార్జిన్లు 1.25-1.50 శాతం మేర తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనూజ్ సేథీ అన్నారు. ప్రస్తుతం వీరి మార్జిన్లు 12-12.5 శాతంగా ఉన్నాయి. దేశీయ వాహన విడిభాగాల తయారీ రంగానికి దాదాపు 20 శాతం ఆదాయం ఎగుమతుల ద్వారానే సమకూరుతుండగా.. అందులో 27 శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తోంది. అమెరికాలో ప్లాంటు కలిగిన కంపెనీలు మాత్రం అక్కడ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకోవడం ద్వారా లబ్ది పొందే అవకాశం ఉంది.

ఆస్తి తగ్గినా.. అంబానీదే అగ్రస్థానం

హురున్ భారత కుబేరుల జాబితాలో రిలయన్స్ అధిపతికే మళ్లీ అగ్రకిరీటం

అత్యధిక సంపద సృష్టించినా రెండో స్థానంలో గౌతమ్ అదానీ

- సంపన్న మహిళగా రోష్నీ నాదార్
- లిస్ట్‌లో మొత్తం 284 మందికి చోటు
- అందులో 21 మంది తెలుగువారు
- మన బిలియనీర్ల మొత్తం సంపద విలువ రూ.98 లక్షల కోట్లు
- భారత జీడీపీలో మూడో వంతు ఇది..
- సౌదీ అరేబియా జీడీపీ కంటే అధికం..



అధిక బిలియనీర్లున్న దేశాల్లో భారత్ నం.3

ముంబై: ఈ ఏడాది (2025)కి గాను హురున్ విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్ నుంచి 284 మందికి చోటు లభించింది. గత ఏడాది లిస్ట్‌తో పోలిస్తే 13 మంది పెరిగారు. వీరి మొత్తం సంపద గత ఏడాదితో పోలిస్తే 10 శాతం వృద్ధితో రూ.98 లక్షల కోట్లకు పెరిగింది. అంటే, మన దేశ జీడీపీలో మూడో వంతుకు సమానం. సౌదీ అరేబియా జీడీపీ కంటే అధికమిది. ఈ జనవరి 15 నాటికి ఆస్తుల విలువ ఆధారంగా బిలియనీర్లకు ర్యాంకింగ్‌లు కేటాయించినట్లు హురున్ తెలిపింది. మరిన్ని వివరాలు..

- రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి భారత కుబేరుల్లో అగ్రస్థానంలో నిలిచారు. ఆసియా ఖండంలోనూ ఆయనే నం.1. అంబానీ ఆస్తి 10,000 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో రూ.8.6 లక్షల కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ఆయన ఆస్తి రూ.లక్ష కోట్ల (13 శాతం) మేర తగ్గినప్పటికీ తన అగ్రస్థానాన్ని మాత్రం కాపాడుకోగలిగారు. అయితే, ఈ ఏడాది ప్రపంచ టాప్-10లో మాత్రం అంబానీకి చోటు దక్కలేదు. ఈసారి 17వ స్థానానికి పరిమితమయ్యారు.
- అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ రూ.8.4 లక్షల కోట్ల ఆస్తితో రెండో స్థానంలో ఉన్నారు. గడిచిన ఏడాది కాలంలో ఆయన సంపద దాదాపు రూ.లక్ష కోట్ల (13 శాతం) మేర పెరిగింది. భారత బిలియనీర్లలో విలువ పరంగా అత్యధిక సంపద వృద్ధి ఇదే. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆయనకు 18వ స్థానం లభించింది.
- హెచ్‌సీఎల్ టెక్ చైర్మన్ రోష్నీ నాడార్ రూ.3.5 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దేశంలోని అత్యంత సంపన్న మహిళ తనే. ప్రపంచంలోని టాప్-10 సంపన్న మహిళల్లోనూ రోష్నీ 5వ స్థానంలో నిలిచారు.
- సన్ ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ, విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ వరుసగా 4,5 స్థానాల్లో ఉన్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా, సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా, బజాజ్ ఆటోకు చెందిన నీరజ్ బజాజ్, ఆర్‌జే కార్ప్ అధిపతి రవి జైపురియా, డీమార్ట్ సూపర్ మార్కెట్ వ్యవస్థాపకులు రాధాకిషన్ దమానీ వరుసగా టాప్-10లోని తర్వాత స్థానాలను దక్కించుకున్నారు.
- ఈసారి జాబితాలో 175 మంది భారత బిలియనీర్ల సంపద పెరగగా.. 109 మంది సంపద తగ్గింది లేదా గతేడాది స్థాయిలోనే నమోదైంది.
- అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. 870 మంది బిలియనీర్లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా.. 823 మంది బిలియనీర్లతో చైనా రెండో స్థానం దక్కించుకుంది.

హురున్ కుబేరుల జాబితాలోని తెలుగువారు

ప్రపంచ ర్యాంక్	పేరు	సంపద (బి. డాలర్లు)	కంపెనీ
260	మురళి దివి	10	దివీస్ లేబొరేటరీస్
600	పీ పిచ్చి రెడ్డి	5.8	మేఘా ఇంజనీరింగ్
625	పీవీ కృష్ణా రెడ్డి	5.6	మేఘా ఇంజనీరింగ్
1122	ప్రతాప్ సీ రెడ్డి	3.3	అపోలో హాస్పిటల్స్
1122	పీవీ రాంప్రసాద్ రెడ్డి	3.3	అరబిందో ఫార్మా
1198	బీ పార్థసారథి రెడ్డి	3.1	హెటిరో గ్రూప్
1624	కే సతీశ్ రెడ్డి	2.3	డాక్టర్ రెడ్డీస్
1796	ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	2.1	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
1796	సీ వెంకటేశ్వర రెడ్డి	2.1	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
1796	ఎం సత్యనారాయణ రెడ్డి	2.1	ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్
2188	జీఎం రావు	1.7	జీఎంఆర్ గ్రూప్
2188	జూపల్లి రామేశ్వర్ రావు	1.7	మై హోమ్ గ్రూప్
2295	జీవీ ప్రసాద్	1.6	డాక్టర్ రెడ్డీస్
2448	మహిమ దాట్ల	1.5	బయోలాజికల్ ఈ
2575	కృష్ణ చివుకుల	1.4	ఇండో ఎంఐఎం
2878	ఆళ్ల అయోధ్యరామి రెడ్డి	1.2	రాంకీ గ్రూప్
3057	ఎన్ విశ్వేశ్వర్ రెడ్డి	1.1	షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్
3057	వీసీ నన్నపనేని	1.1	నాట్కో ఫార్మా
3057	జగదీశ్ ప్రసాద్ అల్లూరి	1.1	హెచ్‌బీఎల్ పవర్
3057	జీఎస్ రాజు	1.1	దక్కన్ ఫైన్ కెమికల్స్
3206	వెంకటేశ్వర్లు జాస్తి	1	సువెన్ ఫార్మా

మణిపాల్ సిగ్నాలో ఎల్ఐసీకి 49% వాటా!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ).. ఆరోగ్య బీమా రంగంలోకి అడుగుపెట్టే దిశగా చురుగ్గా పావులు కదుపుతోంది. ఈ ప్రయత్నాల్లో భాగంగా రంజన్ పాయ్ సారథ్యంలోని మణిపాల్ సిగ్నాలో 40-49 శాతం వాటాలు కొనుగోలు చేసేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేస్తున్నట్టు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలంటున్నాయి. ఈ కొనుగోలు విలువ రూ.3,500-3,750 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఈ ప్రయత్నం కార్యరూపం దాల్చినట్టయితే సుమారుగా రూ.3 లక్షల కోట్ల విలువ గల సాధారణ బీమా వ్యాపారంలో 37 శాతం వాటా కలిగిన ఎల్ఐసీకి ఆరోగ్య బీమా రంగంలోకి అడుగు పెట్టే మార్గం సుగమం అవుతుంది. ఇది పాయ్ సారథ్యంలోని మణిపాల్ గ్రూప్, అమెరికాకు చెందిన సిగ్నా కార్పొరేషన్, ఎల్ఐసీ మధ్య త్రికోణ డీల్ కావచ్చని అంటున్నారు. ఎల్ఐసీకి గల బలమైన నెట్‌వర్క్‌తో మార్కెట్ గతిని ఈ డీల్ ప్రభావితం చేయవచ్చన్నది పరిశీలకుల అభిప్రాయం.

జాయ్ అలూక్కాస్‌కు గౌరవ డాక్టరేట్



చెన్నై (ఆంధ్రజ్యోతి): జువెలరీ రిటైల్ సంస్థ జోయాలుక్కాస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్‌కు చిత్కార యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. భారత్ సహా అంతర్జాతీయంగా ఆభరణాల వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించటంతో పాటు దాతృత్వ కార్యకలాపాలకు జాయ్ అలుక్కాస్ అందించిన తోడ్పాటుకు గుర్తింపుగా చిత్కార విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (హానోరిస్ కాసా) అందజేసింది. చిత్కార యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ అశోక్ కే చిత్కార, ప్రొ-చాన్స్‌లర్ డాక్టర్ మధు చిత్కార, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సందీప్ శర్మ.. అలుక్కాస్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పారిశ్రామిక రంగంతో పాటు భవిష్యత్ తరాల కోసం వినూత్నంగా ఆలోచించిన వ్యక్తి జాయ్ అలుక్కాస్ అని ఈ సందర్భంగా ప్రొ-చాన్స్‌లర్ మధు చిత్కార అన్నారు.

మార్కెట్లో రికవరీ

సెన్సెక్స్ 318 పాయింట్లు అప్

ముంబై: ర్యాలీకి ఒక రోజు విరామం ఇచ్చిన అనంతరం ఈక్విటీ సూచీలు తిరిగి రికవరీ బాట పట్టాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, నెలవారీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు, బ్లూ చిప్ షేర్ల కొనుగోలు నేపథ్యంలో గురువారం సెన్సెక్స్ 317.93 పాయింట్ల లాభంతో 77,606.43 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 458.96 పాయింట్లు లాభపడి 77,747.46 పాయింట్లను తాకింది. నిఫ్టీ 105.10 పాయింట్ల లాభంతో 23,591.95 వద్ద ముగిసింది.

ఆటో షేర్లకు ట్రంప్ పోటు: డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ దెబ్బకు బీఎస్ఈలో టాటా మోటార్స్ 5.56% నష్టపోయి రూ.668.60 వద్ద స్థిరపడింది. నష్టపోయిన ఇతర షేర్లలో అశోక్ లేలాండ్, ఐషర్ మోటార్స్, మహీంద్రా, అపోలో టైర్స్, సోనా బీఎల్‌డబ్ల్యూ ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	440
వరంగల్	417	గోదావరి	420
చిత్తూరు	480	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,840 ▲	82,350 ▲	1,11,000 ▲
విజయవాడ	90,500 ▲	85,500 ▲	1,00,200 ▲
విశాఖపట్నం	88,770 ▲	81,370 ▲	1,00,740 ▼
రాజమండ్రి	89,840 ▲	82,350 ▲	1,01,900 ▲
ప్రొద్దుటూరు	90,250 ▲	83,570 ▲	1,00,500 ▲
ముంబై	88,417 ▲	80,990 ▲	99,775 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	106	విజయవాడ	112
వరంగల్	106	గుంటూరు	113
కరీంనగర్	106	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	106	చిత్తూరు	95
కర్నూలు	106	నెల్లూరు	100
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	112		

'తెలంగాణ రైజింగ్'లో పాత బస్తీకి చోటేదీ?

- పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు సిటీ బయటేనా?
- గుజరాత్‌లో ముస్లింలు బీసీ జాబితాలోనే ఉన్నారు
- పదేళ్లుగా ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వట్లేదు: అక్బరుద్దీన్



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రైజింగ్ ప్రణాళికలో ప్రభుత్వం పాత బస్తీకి చోటెక్కడ ఉందని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాలు అంతా నగరం వెలుపలే అంటున్నారని చెప్పారు. వచ్చే పదేళ్లలో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు తెచ్చుకోవడానికి రూపొందించిన ప్రణాళికలో హైదరాబాద్ దక్షిణ ప్రాంత అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా విలేజీలు, ఐటీ కారిడార్లు అంటూ కొత్త విజన్ చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పాత బస్తీపై తన విజన్ ఏంటో చెప్పాలని కోరారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో అక్బర్ మాట్లాడుతూ ముస్లింల పిల్లలకు ఉద్యోగాలు ఎటూ ఇవ్వడం లేదని, కనీసం గౌరవంగా బతకడానికైనా అవకాశం ఇవ్వాలన్నారు. హాకర్ పాలసీ అమలు చేస్తే కనీసం రోజూ రొట్టె అయినా తినడానికి లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు కూడా ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. కులీకుతుబ్ షాహీ అభివృద్ధి సంస్థకు నిధులు ఇవ్వాలని, పాత బస్తీని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి, చార్మినార్, ముర్గిచౌక్, మీరాలంమండీ ప్రాంతాల్లో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.వంద కోట్లు కేటాయించాలని కోరారు. గత ఏడాది బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధుల్లో మిగతా రూ.1,800కోట్లు ఏప్రిల్ లోపు విడుదల చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, ముస్లింలలో కొందరు బీసీ వర్గానికి చెందిన వారేనని అన్నారు. గుజరాత్‌లో ముస్లింలు బీసీ జాబితాలోనే ఉన్నారని, ఇక్కడి బీజేపీ నేతలు ఎందుకు అభ్యంతరం చెపుతున్నారని ప్రశ్నించారు. ఆలేరు ఎన్‌కౌంటర్ విచారణ నివేదిక ఏమైందని అడిగారు.

దుబారా తగ్గించి..ఆదాయం పెంచాలి: కూనంనేని

కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితులు లేనపుడు దుబారా తగ్గించి, ఆదాయం పెంచుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కూనంనేని సాంబశివ రావు సూచించారు. కొత్తగా పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరించాలని, వృద్ధులు, వికలాంగులకైనా ఇవ్వాలని కోరారు.

హరీశ్‌రావుపై చర్యలు తీసుకోండి

- స్పీకర్‌కు ప్రభుత్వ విప్ ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించి శాసనసభలో ఫొటోలు తీసి, మీడియాకు పంపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలని గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. బుధవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా సభలో గందరగోళం నెలకొన్నప్పుడు హరీష్‌రావు.. ఫొటోలు తీసి మీడియాకు పంపారని తెలిపారు. రెండు రోజుల కిందట ఒక అంశంపై వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు.. అసెంబ్లీ లాంజ్‌లో, ప్రధాన ద్వారం వద్దా నిరసన తెలిపారని, ఆ సందర్భంగా కూడా వీడియోలు, ఫొటోలు తీసి మీడియాకు పంపారని పేర్కొన్నారు. హరీష్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కేటీఆర్ అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఆది శ్రీనివాస్ కోరగా.. ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ గురువారం ప్రకటించారు. హరీశ్‌రావు స్పందిస్తూ బట్టలిప్పి కొడతానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అయితే ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి అన్నారని తెలిపారు. ఈ మాటలను కూడా రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. అసెంబ్లీ రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్‌ది ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ పార్టీ రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు, బయట కేంద్ర మంత్రులు మాట్లాడుతున్నారు. ఢిల్లీలో కుస్తీ అంటున్న బీజేపీ, కాంగ్రెస్‌లు గల్లీలో దోస్తీ అయ్యాయి' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ.. ఆ రెండు పార్టీల మైత్రీ బంధం అసెంబ్లీ సాక్షిగా బయటపడిందన్నారు. రేవంత్‌తో బీజేపీ ఎమ్మెల్యేలు డీలింగ్ పెట్టుకొని బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రెండు జాతీయ పార్టీలు బాహాటంగానే ఒప్పందం చేసుకొని ప్రభుత్వం ఇరకాటంలో పడినప్పుడు బీజేపీ ద్వారా బీఆర్ఎస్‌పై మాటలదాడి చేయిస్తున్నారని చెప్పారు. కాషాయ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ భాష మాట్లాడేకన్నా ఆ పార్టీలో విలీనమైతే మంచిదని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ సర్కార్‌ది శాడిజం: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కాంగ్రెస్ సర్కారు శాడిజాన్ని ప్రదర్శిస్తోందని, ప్రశ్నించే రాజకీయనాయకులపై కక్షసాధింపు చర్యల కోసం పోలీసులను ఇబ్బందిపెడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు వెళ్తే తనపైనే ఉల్టా కేసు పెట్టారన్నారు. చిన్నచిన్న పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులివ్వకుండా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం తమకు అనుకూల కంపెనీలకు వేల కోట్ల అడ్వాన్సులు చెల్లిస్తున్నట్టు ఆరోపించారు. మంత్రి హోదాలో కొనసాగుతూ కాంట్రాక్టులు దక్కించుకుంటున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌ని బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు.

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. ఎలా చేస్తారో తెలియకుండానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్‌శంకర్ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగనున్నందున అక్కడి ప్రజలను తనవైపు తిప్పుకునేందుకు స్టాలిన్ ప్రయత్నంచేస్తూ అంశాన్ని లేవనెత్తి రాజకీయం చేస్తున్నారన్నారు.

అప్పుల్లో తెలంగాణ రైజింగ్: ఏలేటి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సీఎంను భయపెడుతోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రస్తుత ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎత్తి వేసే ప్రమాదముందని ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. తెలంగాణ రైజింగ్ అని ప్రభుత్వం ప్రచారం చేస్తోందని, కానీ వాస్తవానికి తెలంగాణ అప్పులు తేవడంలో రైజింగ్‌గా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి గతంలో వచ్చిన అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తి సినిమాల మాదిరిగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ చేసిన ఆర్థిక విధ్వంసంపై ఎలాంటి చర్యలు చేపడతామనే విషయాన్ని కాంగ్రెస్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

కల్లుతో వైన్, మద్యం తయారీ పరిశ్రమ పెడతాం

సౌకర్యాలు కల్పించాలని సీఎంకు జర్మనీ పారిశ్రామికవేత్త వినతి

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తాటి, ఈత కల్లుతో వైన్, మద్యం ఉత్పత్తి చేసే పరిశ్రమను ఏర్పాటు చేయడానికి తగిన సౌకర్యాలు కల్పించాలని జర్మన్ పారిశ్రామికవేత్త స్టీఫెన్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం స్టీఫెన్ టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సీఎంను కలిశారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కూడా కలిసి పరిశ్రమ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే గీత కార్మికుల అభివృద్ధికి ఊతమిస్తుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. త్వరగా పెరిగి, అధిక దిగుబడి ఇచ్చే తాటి, ఈత విత్తనాల తయారీకి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కక్ష సాధించే వాడినైతే.. కేసీఆర్

కుటుంబమంతా జైల్లోనే!

(మొదటిపేజీ తరువాయి)

కూడా బిగపట్టుకున్నా తప్ప కక్ష సాధింపునకు పాల్పడలేదు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయేవాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ సొంత పార్టీ ఆఫీసులో కొంత మందికి డబ్బులు ఇచ్చి తనను, తన కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా సంయమనంతో వ్యవహరిస్తున్నానన్నారు. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం గమనిస్తోందని వ్యాఖ్యానించారు.

గుంటూరు తెలివితేటలొద్దు

ఆ తర్వాత బడ్జెట్‌పై చర్చలో చివరగా ముఖ్యమంత్రి మాట్లాడినపుడు కూడా కేటీఆర్‌పై ఎదురుదాడికి దిగారు. ఇంగ్లిష్ అనేది భాషే తప్ప జ్ఞానం కాదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న చైనా, జపాన్, జర్మనీల్లో ఉండే వారికి ఇంగ్లిష్ రాదని చెప్పారు. కేటీఆర్ నేర్చుకున్న నాలుగు ఇంగ్లిష్ ముక్కలు హోటల్‌లో ఆర్డర్ తీసుకునేందుకు, బట్టల దుకాణంలో బట్టలు అమ్మేందుకు అక్కరకు రావొచ్చన్నారు. గుంటూరులో చదివిన తెలివితేటలు తమ వద్ద చూపించొద్దని హెచ్చరించారు. తెలుగు మీడియంలో గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని వచ్చానని, లోకల్ పరిజ్ఞానంతో పని చేస్తున్నానని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకొని, రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడు ముఖ్యమంత్రి సీట్లో కూర్చుంటే ఎందుకు కళ్లలో నిప్పులు పోసుకుంటారని ప్రశ్నించారు. ఈ ఐదేళ్ల తర్వాత రెండోసారి కూడా తామే అధికారానికి వస్తామని రేవంత్ అన్నారు. పార్టీ అధినేతగా కేసీఆర్ కుర్చీ మీద కేటీఆర్, హరీశ్ కన్నేయడం భావ్యం కాదని వ్యాఖ్యానించారు. కుటుంబంలో పెద్ద దిక్కు ఉంటేనే ఆ కుటుంబానికి గౌరవం ఉంటుందని, ఆయన్ను ఖతం చేసి కుర్చీలో కూర్చొనే పథకాలు వేయొద్దని సూచించారు. గతంలో నేపాల్ యువరాజు దీపేంద్ర తనకు పదవి ఇవ్వలేదనే కోపంతో కుటుంబంలో 8 మందిని ఏకే 47తో కాల్చేశారని, అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో రాకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్‌ను కోరారు. రాష్ట్రంలో ఏ ఊరిలో పంట



పండినా అది కాళేశ్వరం నీటితోనే పండిందని చెప్పే స్థాయిలో తప్పు ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.

పదేళ్ల పాలనతో బేరీజు వేయండి

లక్ష రూపాయల రుణ మాఫీ చేయడానికి కేసీఆర్ నాలుగేళ్ల సమయం తీసుకున్నారని రేవంత్ అన్నారు. అంతా చేసి రూ.16,143 కోట్లు మాత్రమే మాఫీ చేశారని చెప్పారు. వడ్డీ పక్కనబెడితే కేసీఆర్ చేసిన మాఫీ రూ.13,514 కోట్లు మాత్రమే అని చెప్పారు. వీళ్లు తమను రుణమాఫీ చేయలేదని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 25,35,964 మంది రైతులకు రూ.20,616.89 కోట్లు మాఫీ చేసిందని ప్రస్తావించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత మాఫీ చేసింది? పది నెలల్లో కాంగ్రెస్ ఎంత మాఫీ చేసింది? చూడాలన్నారు. బీఆర్ఎస్ ఎగ్గొట్టిన రైతుబంధు రూ.7,625 కోట్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చెల్లించామని చెప్పారు. రూ.4,666.59 కోట్లు రెండో విడత రైతు భరోసా అందించామని, రైతు భరోసాను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. వరి వేస్తే ఉరి అని చెప్పిన వాళ్ల ఫామ్ హౌస్‌లో పండిన వడ్లను క్వింటాల్ రూ.4,500 చొప్పున కావేరి సీడ్స్ కు అమ్ముకున్నారని ప్రస్తావించారు. దొర వడ్లకు వచ్చిన ధర రైతులకు ఎందుకు రాలేదన్నారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.11 వేల కోట్ల బోనస్ ఇచ్చామని చెప్పారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనివి తాము పది నెలల్లో చేస్తే అభినందించాల్సింది పోయి కడుపులో కత్తులు పెట్టుకుని తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు.

నా మీద కోపం ఉండొచ్చు కానీ



కుర్చీని లాక్కున్నందుకు కేసీఆర్‌కు తన మీద కోపం ఉండొచ్చు కానీ మంచి పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన అభినందించవచ్చు కదా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 16 మంది ముఖ్యమంత్రుల హయాంలో తెలంగాణ ప్రాంత అప్పు రూ.90,160 కోట్లు అయితే, కేసీఆర్ హయాంలో పదేళ్లలో రూ.6,69,257 కోట్ల అప్పు చేశారన్నారు. ఇవి కాక, రూ.40,154 కోట్ల బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. మొత్తం కలిపితే రూ.8,19,151 కోట్లు ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పదిహేను నెలల్లో చేసిన అప్పు రూ.1,58,041 కోట్లు అని, అందులో రూ.88,591 కోట్లు పాత అప్పు, రూ.64,768 కోట్లు వడ్డీలు అని వివరించారు. 15 నెలల్లో తమ ప్రభుత్వ నిర్వహణకు చేసిన నికర అప్పు రూ.4,682 కోట్లు మాత్రమే అని స్పష్టం చేశారు.

కాళేశ్వరం కట్టకపోయినా

గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టకపోయినా నీరు తరలించేందుకు అవకాశం ఉందని రేవంత్‌రెడ్డి చెప్పారు. లక్ష కోట్లు కొల్లగొట్టిన ప్రాజెక్టు లేకపోయినా తెలంగాణకు నీళ్లు ఇవ్వవచ్చన్నారు. ప్రాజెక్టుల దగ్గర బీఆర్ఎస్ నాయకులు వందల ఎకరాలు కొనుగోలు చేశారని చెప్పారు. కొండపోచమ్మ నుంచి ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు కాలువ తీసి నీరు తరలించారని తెలిపారు. ప్రాజెక్టులు కట్టిందే ఫాంహౌస్‌లకు నీరు పారించడానికని సీఎం ఆరోపించారు. ఏ ప్రాజెక్టుల వద్ద ఎవరికి భూములు, ఫాంహౌస్‌లు ఉన్నాయో నిజ నిర్ధారణ కమిటీతో విచారణ జరిపేందుకు సిద్ధమా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. కాంగ్రెసేతర సభ్యులతోనే నిజ నిర్ధారణ కమిటీ వేద్దామని సూచించారు. ఫాంహౌస్‌ల చుట్టూ తవ్విన కాలువల వివరాలు బయట పెట్టాలా? అని ప్రశ్నించారు. లగచర్లలో ఎకరానికి రూ.20 లక్షల పరిహారం ఇచ్చామని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అక్కడి ప్రజల్ని రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పారని ఆరోపించారు. అధికారుల్ని కొట్టండి, చంపండి, కేటీఆర్, హరీశ్ చూసుకుంటారని బహిరంగ ప్రకటనలు చేశారని అన్నారు. అత్యంత అవినీతి జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఏకసభ్య కమిషన్ విచారణ జరుగుతోందని చెప్పారు. విద్యుత్ ప్రాజెక్టుపై జరిగిన మోసం మీద కమిషన్ నివేదిక వచ్చిందని తెలిపారు. కాళేశ్వరంపై విజిలెన్స్ నివేదిక వచ్చిందని, వచ్చే సమావేశాల్లో సభలో ప్రవేశపెడతామని ప్రకటించారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించారంటే ఎంత ఆగ్రహం ఉందో అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ జాతిపిత అని చెప్పుకున్న కేసీఆర్‌ను ఓడించి సామాన్యుడికి పట్టం కట్టారని ప్రస్తావించారు. కేటీఆర్ పది సంవత్సరాలు ఐటీ మంత్రిగా దావోస్ వెళ్లి రూ.20 వేల కోట్లు పెట్టుబడులు తెస్తే తాను పది నెలల్లో 2 లక్షల 20 వేల కోట్లు పెట్టుబడులు తెచ్చానని సీఎం తెలిపారు.

రూపాయి వెనక్కి పోతే..
వంద తెచ్చే దమ్ముంది

- పరిశ్రమలు వెళ్లిపోయాయన్నది అవాస్తవం: శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోయాయన్న ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి శ్రీధర్‌బాబు కొట్టిపారేశారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్లో ఒక్క రూపాయి వెనక్కి పోయినా.. వంద రూపాయలు తెచ్చే దమ్ము, ధైర్యం తమ ప్రభుత్వానికి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తప్పుబట్టారు. పోర్టు పరంగా అవసరమైన సంస్థలు తెలంగాణకు రావాలనడం సరైంది కాదన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒకటి తర్వాత మరొకటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికల హామీలు అమలు చేసే.. వచ్చే ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలోకి వెళ్తామని.. లేదంటే తమది కాంగ్రెస్ ప్రభుత్వమే కాదన్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది పాలన, ఇప్పటి కాంగ్రెస్ మొదటి ఏడాది పాలనపై బేరీజు వేద్దామా అని ప్రశ్నించారు.

గజ్వేల్‌లో ఫార్మాసిటీ
ఎందుకు పెట్టలేదు..?

- బీఆర్ఎస్ సభ్యుల్ని నిలదీసిన మంత్రి కోమటిరెడ్డి



గత ప్రభుత్వ హయంలో ఫార్మా సిటీ పేరుతో రైతుల్ని బెదిరించి భూములు లాక్కున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఫార్మా సిటీ పేరుతో నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని, దానికి వ్యతిరేకంగా తామే పోరాటం చేశామని చెప్పారు. గజ్వేల్‌లో ఫార్మా సిటీ ఎందుకు పెట్టలేదని బీఆర్ఎస్ సభ్యుల్ని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఎన్ కన్వెన్షన్ సెంటర్ ఎఫ్‌టీఎల్‌లో ఉందన్న హరీశ్‌రావు.. వారి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఆ విషయం గురించి ఎక్కడా మాట్లాడలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ కన్వెన్షన్‌ను తొలగించిందని చెప్పారు. హైడ్రాను విమర్శించడం సరికాదన్నారు. నల్లగొండ ప్రజల నీటి కష్టాలు తొలగించేందుకు మూసీ ప్రక్షాళన చేపడితే విపక్షాలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు.

ఆకలి ఉన్నవాడికే బియ్యం ఇవ్వండి

- సర్కార్‌కు పైడి రాకేశ్‌రెడ్డి సూచన
- నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి
- సీపీఐ సభ్యుడు కూనంనేని వినతి

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో తెల్ల రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయనున్న సన్నబియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల చివరి రోజు జీరో అవర్‌ను 105 నిమిషాల పాటు కొనసాగించారు. ప్రశ్నోత్తరాలను రద్దు చేసిన స్పీకర్... జీరో అవర్‌లో పలువురు సభ్యులు మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఆకలి ఉన్నవాడికే తెల్లకార్డులు, బియ్యం ఇవ్వండి. రేషన్ బియ్యాన్ని ప్రస్తుతం రూ.1కి కొని రూ.15లకు అమ్ముకుంటున్నారు. ఉగాది నుంచి ఇచ్చే సన్న బియ్యం పక్కదారి పట్టకుండా నియంత్రించాలి' అని డిమాండ్ చేశారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కోరారు. భద్రాచలం ఆలయ పాలక మండలిని ఏర్పాటు చేయాలని, రాములోరి కల్యాణానికి సభ్యులు రావాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు. విదేశీ విద్యానిధి పథకం బకాయిలు చెల్లించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. కిడ్నీ బాధితుల కోసం కల్లూరు, పెనుబల్లిలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కోరారు. సభ జరుగుతుండగా.. హరీశ్‌రావు సభలో లోపలి ఫొటోలు తీశారని, స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎంలంటే వారికి ఇష్టం లేదని, అబద్ధాలు మాట్లాడుతున్నారని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.

లేని రంకులు అంటగట్టినప్పుడు నీతులు గుర్తు రాలేదా?

- భార్యాపిల్లలు, కుటుంబాలు మీకేనా?.. వేరేవాళ్లకు ఉండవా?: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): "లేని రంకులు అంటగట్టి ఆనాడు ఇష్టమున్నట్టు మాట్లాడినప్పుడు నీతులు గుర్తురాలేదా? భార్యాపిల్లలు మీకే ఉన్నారా? వేరే వాళ్లకు భార్య పిల్లలు లేరా? వాళ్లకు కుటుంబాలుండవా? సీఎం ఇంటి మీదికి డ్రోన్ పంపిస్తే ఆయన ఊరుకుంటాడా? ఆయన భార్యాపిల్లల ఫొటోలను ఇష్టం వచ్చినట్టు తీస్తామంటే ఊరుకుంటాడా? ఇది పద్ధతేనా? మా ఇంట్లో పిల్లల్ని తిట్టింది ఈ కాంగ్రెస్ నేతలు కాదా? మా ఇంట్లోని మైనర్ పిల్లల్ని పట్టుకొని బూతులు మాట్లాడింది సీఎం కాదా?" అని బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రవ్య వినిమయ బిల్లుపై గురువారం శాసనసభలో జరిగిన చర్చ ఆయన పాల్గొంటూ.. సర్కారుపైన, సీఎం రేవంత్‌పైన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సీఎంకు, కేటీఆర్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 'కక్ష, పగ, ప్రతీకారం ఉంటే మీకే నష్టం' అని కేటీఆర్ అనగా.. 'కక్షసాధింపునకు పాల్పడితే సభలో మీరెవ్వరూ ఉండేవారు కాదు' అని రేవంత్ వ్యాఖ్యానించారు. దీనికి కేటీఆర్.. "సీఎంకు ఇంత అసహనం పనికిరాదు. ఆయనకు ఇంత ఆవేశం, నిస్పృహ ఎందుకో అర్థం కావట్లేదు. ఆయనలో ఒక అపరిచితుడు దాగి ఉన్నాడు" అన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులూ లేవని.. తెలంగాణకు జరిగిన ఈ అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రసంగంలో ఒక్క మాట కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలోని వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం రూ.11,500 కోట్ల ప్యాకేజీ ఇచ్చిన కేంద్రం.. తెలంగాణలో బయ్యారం ఉక్కు పరిశ్రమపై ముందుకు రావడం లేదని గుర్తుచేశారు. దేశం కోసం ధర్మం కోసం అని మాట్లాడే బీజేపీ నేతలు యాదాద్రికి, వేములవాడకు, కొమురవెల్లి మల్లన్నకు, భద్రాచలం రాముల వారికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. కుంభమేళాకు నిధులు ఇస్తున్న కేంద్రం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఎందుకివ్వదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ఆధునిక గజనీలుగా మారి ఎన్నికల హామీలను మర్చిపోయారని.. ఆరు గ్యారెంటీలను ఎగ్గొట్టడానికే ఆర్థిక పరిస్థితిపై నెపం నెడుతున్నారని ఆరోపించారు.



ప్రభుత్వమే చెప్పాలి..


కేంద్రం 5 ట్రిలియన్ డాలర్ ఎకానమీ గురించి మాట్లాడుతుంటే.. రేవంత్ 1 ట్రిలియన్ ఎకానమీ గురించి మాట్లాడుతున్నారని.. అది ఎలా సాధ్యమో ప్రజలకు వివరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "బడే భాయ్ మాషా అల్లా అంటే ఛోటే భాయ్ సుభాన్ అల్లా అన్నట్లు"గా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఎద్దేవా చేశారు. తమ హయాంలో తెలంగాణ దివాలా రాష్ట్రంగా కాదు.. దిగ్గజ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు. "అప్పు పుడుతలేదు.. దివాలా తీసినమని బయట మాట్లాడుతున్న రాము కరెక్టా? సభలో మాట్లాడుతున్న రెమో కరెక్టా?" అని సీఎంను ఉద్దేశించి కేటీఆర్ వ్యంగ్యవ్యాఖ్యలు చేశారు. "దావోస్‌లో పెట్టుబడులు వరదలా తన్నుకొని వచ్చాయని చెప్పుకున్నారు. ఐదు గ్యారంటీలు అమలు చేశాం.. సంక్షేమం అద్భుతంగా ఉందని చెప్పుకొన్నారు. మరి రూ.71 వేల కోట్ల ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి ఎందుకు చెప్పారో వివరణ ఇవ్వాలి" అని నిలదీశారు. 'ఉద్యోగుల డీఏకు పైసలు లేవు.. ఆరు గ్యారెంటీల అమలుకు పైసలు లేవు.. తులం బంగారానికి పైసలు లేవు..' అని చెప్పే ముఖ్యమంత్రి రూ.వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలుస్తున్నారని, వాటికి నిధులు ఎక్కణ్నుంచి వస్తాయని ప్రశ్నించారు. వాటన్నిటికీ ఉన్న డబ్బులు ఆరు గ్యారెంటీల అమలుకు లేవా అని ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్ నేతలని గోల్డ్ అనుకుంటే ఇప్పుడు వారు రోల్డ్ గోల్డ్ అని తెలిసిపోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను జైలుకు వెళ్లానని.. మరి సీఎం రేవంత్ ఎందుకు జైలుకెళ్లారో చెప్పాలని సవాల్ విసిరారు. "ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు. ఏం చేసినా ఫరక్ పడదు. పదవి, అధికారం శాశ్వతం అని ఆయన అనుకుంటున్నారు. కానీ అవేవీ శాశ్వతం కాదు. సీఎంకు అపరిమిత అధికారాలు ఉండవు. ఆయన ఎవరినీ జైలుకు పంపలేరు. కోర్టులు మాత్రమే ఆ పని చేయగలవు," అని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ తిట్లన్నీ తమకు దీవెనలేనని.. తెలంగాణ జాతి పిత ముమ్మాటికి కేసీఆర్ అని, తెలంగాణ బూతుపిత రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. 'రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్, రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి' అన్న ముఖ్యమంత్రి ఇవాళ తెలంగాణలో కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగాన్ని పట్టించుకోవట్లేదని దుయ్యబట్టారు. పేదల మీద ప్రతాపం చూపే హైడ్రా పెద్దలను మాత్రం కాపాడుతోందని.. హైకోర్టు ఎన్నిసార్లు తిట్టినా హైడ్రా తీరు మారట్లేదని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

కేంద్రం మిథ్య..

రాష్ట్రాలు లేకుంటే కేంద్రం లేదని.. అందుకే ఎన్టీఆర్ 'కేంద్రం మిథ్య' అన్నారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఎనిమిది మంది, బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నా తెలంగాణకు కేంద్ర బడ్జెట్లో గుండుసున్నానే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "కొట్లాడక పోతే కేంద్రం మన మాట వినదు. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు మేమూ కలిసి వస్తాం" అని పేర్కొన్నారు. 2014-2020 మధ్య కేంద్ర సర్కారుతో తాము కూడా సఖ్యతతోనే ఉన్నా రూపాయి నిధులు ఇవ్వలేదని కేటీఆర్ ఆగ్రహం వెలిబుచ్చారు.

అవయవ దానం బిల్లుకు ఆమోదం

- ఎవరైనా అవయవాల వ్యాపారం చేస్తే... కోటి దాకా జరిమానా, పదేళ్ల వరకు జైలు
- దాతల కుటుంబాలకు ఆదుకునేందుకు విధానం రూపొందిస్తాం: దామోదర



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవయవ దానం బిల్లు-2025కు అసెంబ్లీ గురువారం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం 2011లో కొన్ని సవరణలతో సమగ్రంగా రూపొందించిన చట్టాన్నే రాష్ట్రంలో కూడా అమలు చేయాలని నిర్ణయించి, దానికి అనుగుణంగా ఈ బిల్లుకు రూపకల్పన చేశారు. దీన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలు వారి మనుమలకు అవయవ దానం చేసేందుకు కొత్త చట్టం అనుమతి ఇస్తుందని తెలిపారు. అవయవ మార్పిడి విషయంలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే గతంలో రూ.5 వేల జరిమానా, 3 ఏళ్ల జైలు శిక్ష మాత్రమే ఉండేదని, ఇప్పుడు రూ.కోటి వరకు జరిమానా, 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయినట్టు ధ్రువీకరించే అధికారం గతంలో న్యూరో సర్జన్, న్యూరో ఫిజీషియన్లకు మాత్రమే ఉండేదని, ఇప్పుడు ఫిజీషియన్లు, సర్జన్లు, అనస్థీషియన్లకు కూడా ఆ అధికారం లభిస్తుందన్నారు. గుండె, కిడ్నీ, కాలేయంతో పాటు చర్మం, ఎముక మజ్జ(బోన్ మారో), గుండె వాల్వుల మార్పిడి కొత్త చట్టం పరిధిలోకి వస్తాయన్నారు. ఈ చట్టంతో ఇతర రాష్ట్రాల్లోని అవయవ మార్పిడి వ్యవస్థలతో తెలంగాణ అనుసంధానం అవుతుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి సేకరించిన అవయవాలను ఇక్కడి పేషెంట్లకు అమర్చడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. 'అవయవాలు, కణజాల సేకరణ, స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు అవుతాయన్నారు. ఇది మెడికల్ టూరిజంకు దోహదపడుతుందని తెలిపారు. అవయవ దాతలకు ప్రోత్సాహకాలు కల్పించాలన్న సభ్యుల సూచనపై మంత్రి స్పందిస్తూ సీఎంతో చర్చించి విధానం రూపొందిస్తామని చెప్పారు. అవయవ దానం బిల్లుకు బీఆర్ఎస్, బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ అవయవదానం పత్రాలపై ఎమ్మెల్యే సంతకాల కోసం అసెంబ్లీలో కార్యక్రమం నిర్వహించాలని, మొదట తానే సంతకం చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 3,724 మంది అవయవ మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఈ బిల్లు వారికి ఎంతో ఊరటనిస్తుందన్నారు. ప్రభుత్వం అవయవ దాతల అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సూచించారు. ఆ దాత కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య బీమా కల్పించాలని, పేద కుటుంబమైతే ఇందిరమ్మ ఇల్లు, పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటివ్వాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మిత్రసేన కిడ్నీ వ్యాధి బారిన పడినప్పుడు తన కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధపడినా.. నిబంధనల వల్ల కుదర్లేదన్నారు. బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ అవయవాల వ్యాపారాన్ని కట్టడి చేయడానికి నిఘా అవసరమన్నారు.


పదవీ విరమణ చేయనున్న ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్ రెడ్డి

9 మంది ఎమ్మెల్సీలకు వీడ్కోలు

» 29వ తేదీతో ముగియనున్న ఆరేళ్ల పదవీకాలం

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తమ ఆరేళ్ల పదవీ కాలాన్ని శనివారంతో పూర్తి చేసుకోబోతున్న తొమ్మిది మంది ఎమ్మెల్సీలకు శాసన మండలిలో గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇందుకు సంబంధించి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన గురువారం వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్సీలు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పదవీ కాలం పూర్తి చేసుకోనున్న ఎమ్మెల్సీలను సత్కరించి, వారి సేవలను గుర్తు చేసుకున్నారు.

పదవీ విరమణ చేయనున్న ఎమ్మెల్సీలు

ఎంఎస్ ప్రభాకర్, మహమూద్ ఆలీ, టీ జీవన్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, అలుగుబెల్లి నర్సిరెడ్డి, షేరి సుభాష్ రెడ్డి, కూర నరోత్తమ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మీర్జా రియాజుల్ హసన్ ఇఫేండి.

గంజాయిరాజ్, లిక్కర్‌రాణీ.. అని అన్నామా?

» బీఆర్ఎస్ నేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో నిందించడాన్ని బీఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ధ్వజమెత్తారు. 'ప్రభుత్వాన్ని బయటి వ్యక్తులు ఏదో అంటున్నారని అసెంబ్లీలో మీరు అనడం విడ్డూరంగా ఉంది. మిమ్మల్ని కూడా బయట గంజాయిరాజ్, లిక్కర్‌రాణీ అని అంటున్నారు. మేమేనాడైనా అలా విమర్శించామా?' అని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి భట్టి ప్రశ్నించారు. తాను యాదృచ్ఛికంగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని కాదని, అణగారిన వర్గాల అభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశ్యంతో వచ్చానని భట్టి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం నిధులు కేటాయించి ఒక్క పైసా ఖర్చు చేయలేదని తెలిపారు. గతంలో రాబడి, వ్యయాలకు పొంతన లేకుండా బడ్జెట్‌ను రూపొందించేవారని, నిధులు కూడా ఖర్చు చేసేవారు కాదని చెప్పారు. తమ ప్రభుత్వం వాస్తవానికి దగ్గరగా ఉన్న బడ్జెట్‌నే ప్రవేశపెట్టిందని తెలిపారు. గత ప్రభుత్వం వివిధ పనులు చేయించుకొని రూ.1,60,000 కోట్ల బిల్లులను బకాయి పెడితే తమ ప్రభుత్వం వాటిని చెల్లిస్తోందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన రూ.50,000 కోట్లను (క్యారీఫార్వర్డ్ నిధులను చేర్చి) కూడా వారి అభివృద్ధికి ఖర్చు చేస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వం విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భరోసానిచ్చిందని, ఇప్పటికే యాభైవేలకి పైగా ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మళ్లీ కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నియామకాలను చేపడతామని అన్నారు. అలాగే, వైశ్యుల కోసం రూ.25కోట్లు, బ్రాహ్మణులకు రూ.100కోట్ల నిధులను కేటాయించి అగ్రవర్ణాలకు కూడా ప్రభుత్వం అండగా ఉందని తెలిపారు. రూ.5లక్షలుగా ఉన్న ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచి తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని భట్టి పేర్కొన్నారు.

రుణమాఫీ రూ.8 వేల కోట్లే!

» కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఇంతే: హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు రైతు భరోసా, రైతుబంధు నిధులు ఎగ్గొట్టి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ రూ.8 వేల కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ వానకాలం రైతుబంధు రూ.8 వేల కోట్లు, యాసంగిలో ఇవ్వాల్సిన రూ.8 వేల కోట్లకు బదులు రూ.3,500 కోట్లు మాత్రమే ఇచ్చి రూ.4,500 కోట్లు ఎగ్గొట్టారన్నారు. ఆ మొత్తం రూ.12 వేల కోట్లు రుణమాఫీలో కలిపారన్నారు. దీని ప్రకారం రుణమాఫీ రూ.20 వేల కోట్లలో రూ.12 వేల కోట్లు తీసేస్తే, ప్రభుత్వం చేసిన రుణమాఫీ కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమేనన్నారు. 'కాంగ్రెస్ 16 నెలల పాలనలో అప్పులు కట్టేందుకు రూ.88,564 కోట్లు ఖర్చు పెట్టామని 7.44 గంటలకు డిప్యూటీ సీఎం చెప్పారు. ఇదే విషయంపై 3.58 గంటలకు సీఎం మాట్లాడుతూ రూ.1,53,359 కోట్లు అప్పులు, మిత్తీల కింద చెల్లించామన్నారు. 4 గంటల్లోనే ఎంతో మారిపోయింద'ని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆర్థిక మంత్రి కాబట్టి భట్టి విక్రమార్క వాస్తవం చెప్పారని, సీఎం రేవంత్ రెడ్డి బురిడీ కొట్టించి కార్పొరేషన్ అప్పులు కూడా కలిపి 70 వేల కోట్లు అదనంగా చెప్పారన్నారు. కాగా, మీడియా పాయింట్ వద్ద హరీశ్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీలో కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం తప్ప ప్రజా ప్రయోజన అంశాల్లేవని, సీఎం రేవంత్ రెడ్డి కేవలం హెడ్‌లైన్స్ కోసమే మాట్లాడారని విమర్శించారు. సుప్రీంకోర్టులో ఉన్న ఫిరాయింపుల అంశాన్ని ప్రస్తావించడం నిబంధనలకు విరుద్ధమని, దీనిపై సీఎం చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సభ జరిగిన 12 రోజుల్లో 2 రోజులు మాత్రమే ప్రశ్నోత్తరాలు జరిపారని, స్వల్పకాలిక చర్చలు జరపలేదన్నారు. సీఎం, మంత్రుల సమాధానాల్లో సీరియస్‌నెస్ లోపించిందన్నారు.

లోక్‌సభ సీట్లు పెంచొద్దు!

రాష్ట్రాల వరకే పునర్విభజన చేయాలి.. కేంద్రం చర్యల్లో పారదర్శకత ఏదీ?

» అందరితో సంప్రదించాకే నిర్ణయించాలి

» రాష్ట్ర అసెంబ్లీ సీట్లు 153కు పెంచాలి

» శాసనసభలో తీర్మానం ఆమోదం

» ఇందిర, వాజ్‌పేయి దూరదృష్టి మోదీలో ఏదీ?: సీఎం రేవంత్ వ్యాఖ్య



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజన రాష్ట్రాల్లోని శాసనసభలకు మాత్రమే చేపట్టాలని, తెలంగాణ శాసనసభ సీట్ల సంఖ్యను 119 నుంచి 153కు పెంచాలని రాష్ట్ర శాసనసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను యథావిధిగా ఉంచాలని విజ్ఞప్తి చేసింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రాతిపదిక కారాదని కోరింది. శాసనసభ సీట్ల పెంపునకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రం తెర మీదకు తెచ్చిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, స్థానాల పెంపు ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని చెప్పారు. దీనిపై రాజకీయాలకు అతీతంగా దక్షిణాది రాజకీయ నాయకులంతా కలిసికట్టుగా కేంద్రంతో చర్చలు జరపాలన్నారు. కేంద్రం మన మాట వినకపోతే పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ నేతలు జానారెడ్డి, కేశవరావుల నేతృత్వంలో పార్టీలకు అతీతంగా సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పార్టీలు, ప్రజాసంఘాల వారంతా ఆ సమావేశానికి హాజరై అభిప్రాయాలనుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, పెంపులను జనాభా ప్రాతిపదికన చేయాలని చూస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. 1975లో, 2022లో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి వచ్చినపుడు అప్పటి ప్రధానులు ఇందిరా గాంధీ, వాజ్‌పేయి చాలా దూరదృష్టితో ఆలోచించి పాతికేళ్ల పాటు వాయిదా వేయించారని చెప్పారు. ప్రస్తుతం ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ వారిద్దరిలా రాజనీతిజ్ఞతతో ఆలోచించడం లేదని విమర్శించారు. 543 సీట్లున్న లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు కేవలం 130 సీట్లు ఉన్నాయని చెప్పారు. మొత్తం లోక్‌సభ సీట్లలో దక్షిణాది వాటా 24 శాతమని తెలిపారు. మోదీ ఆలోచన ప్రకారం చేస్తే అది 19 శాతానికి తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటు చేసిన దక్షిణాది రాష్ట్రాల సమావేశానికి తెలంగాణ తరఫున వెళ్లామని చెప్పారు. దక్షిణాదికి నష్టం జరిగే విధంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే కలసికట్టుగా ఎదుర్కోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో అసలు కేంద్రం నిర్ణయమే తీసుకోలేదని కొందరు కేంద్ర మంత్రులు చెబుతున్నారని, అందులో నిజం లేదని చెప్పారు. కేంద్రం నిర్దేశించిన జనాభా నియంత్రణ కార్యక్రమాలను దక్షిణాది రాష్ట్రాలు పక్కాగా అమలు చేయడంతో దక్షిణాది జనాభా బాగా తగ్గిందని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. అదే సమయంలో కేంద్రం కార్యక్రమాలను అమలు చేయని బిహార్, రాజస్థాన్, ఛత్తీ‌స్‌ఘడ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో జనాభా బాగా పెరిగిందని చెప్పారు. కేంద్రం చెప్పినమాట విన్నందుకు రాష్ట్రాల నియోజకవర్గాల సంఖ్య 24 శాతం నుంచి 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. బీజేపీకి పెద్దగా అవకాశం ఇవ్వని దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా నియంత్రించేందుకు కేంద్రం నియోజకవర్గాల పునర్విభజనను ఒక అస్త్రంగా చేసుకుంటోందని రేవంత్ ఆరోపించారు.

కేంద్రం ద్వంద్వ వైఖరి

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ స్థానాలను 153కు పెంచాల్సి ఉండగా పట్టించుకోకుండా 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల ఆధారంగా చేపడతామని కేంద్రం దాటవేసిందని రేవంత్ ప్రస్తావించారు. స్వప్రయోజనాల కోసం జమ్మూ కశ్మీర్‌లో 83గా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలను 90కి పెంచారని ప్రస్తావించారు. సిక్కింలో కూడా 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేపట్టారని గుర్తు చేశారు. విభజన చట్టంలో పక్కాగా ఉన్నా, తెలంగాణ, ఏపీలతో పెద్దగా ప్రయోజనం లేదని సీట్ల పెంపును పట్టించుకోలేదన్నారు. కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న సమాచారం, మంత్రులు కల్పిస్తున్న భ్రమలు, ఢిల్లీలో తీసుకుంటున్న నిర్ణయాలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అవలంబిస్తున్న ద్వంద్వ విధానాల వలనే ఆందోళన చెందాల్సి వస్తోందని, సభలో పునర్విభజనపై తీర్మానం ప్రవేశపెట్టడానికి కూడా అదే కారణమని చెప్పారు. కేంద్రం ఆర్థిక వివక్షతో దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటిదాకా నష్టపోతున్నాయని, పునర్విభజనను అంగీకరిస్తే రాజకీయంగా కూడా నష్టపోతామని, ఇందుకు ఎంతమాత్రం అంగీకరించేది లేదని చెప్పారు. కేంద్రం అనుకున్నట్లే చేస్తే దక్షిణాది ప్రజల ఓటుతో సంబంధం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకోసమే ప్రణాళికబద్ధంగా దక్షిణాదిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.

తీర్మానంలో ఏం ఉందంటే

"లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, అనుసరించబోయే విధివిధానాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో పారదర్శకమైన సంప్రదింపులు లేకుండా జరుగుతున్న కసరత్తుపై ఈ సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాలతో విస్తృతమైన సంప్రదింపుల తరువాత పునర్విభజన కసరత్తును పారదర్శకంగా చేపట్టాలని సభ కోరుతోంది. కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు పునర్విభజన శాపంగా మారకూడదు. జాతీయ జనాభా స్థిరీకరణ ఉద్దేశంతో చేపట్టిన 42, 84, 87వ రాజ్యాంగ సవరణల లక్ష్యాలు ఇంకా నెరవేరలేదు. జనాభా వాటా తగ్గిన రాష్ట్రాలు నష్టపోకూడదు. పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు. లోక్‌సభ సీట్లను యథాతథంగా కొనసాగించాలి. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఇప్పుడున్న నియోజకవర్గాల సరిహద్దుల మార్పులు చేర్పులు చేయాలి. తాజా జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీ సీట్లను పెంచాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలంగాణ నియోజకవర్గాలను 153 వరకు తక్షణమే పెంచాలి. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను చేపట్టాలి" అని తీర్మానంలో పేర్కొన్నారు. తీర్మానంపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, బీఆర్ఎస్‌లు కోరగా, తీర్మానం ఆమోదం పొందిందని స్పీకర్ ప్రకటించారు.

చెన్నైలో సంకల్పం.. హైదరాబాద్‌లో నెరవేరింది

» తెలంగాణ అసెంబ్లీ తీర్మానంపై తమిళనాడు సీఎం స్టాలిన్

» యుద్ధం ఇంకా ఉంది... విజయం సాధిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ పునర్విభజనపై తెలంగాణ శాసనసభ చేసిన తీర్మానం ప్రారంభం మాత్రమేనని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. చెన్నైలో చేసిన సంకల్పం హైదరాబాద్‌లో నెరవేరిందని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో చేసిన పోస్టుకు ఈ మేరకు స్పందించారు. ప్రజల హక్కులు, రాజకీయ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ అసెంబ్లీలో ఓ తీర్మానాన్ని గురువారం ఆమోదించామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. హక్కుల పరిరక్షణకు, ఆర్థికంగా అత్యధిక ఉత్పాదకత కలిగిన రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చేలా పక్షపాత ధోరణితో చేయాలని అనుకుంటున్న నియోజకవర్గాల పునర్విభజనను అడ్డుకునేందుకు తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ఐక్యంగా పోరాడతామని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీలో చేసిన తీర్మానంతో ఈ పోరాటంలో తొలి విజయం సాధించమని, అసలు యుద్ధం ముందుందని, అందులోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ పోస్టుకు స్పందించిన తమిళనాడు సీఎం స్టాలిన్.. న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టేలా.. నియోజకవర్గ పునర్విభజన పారదర్శకంగా జరగాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించడం.. ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) రెండో సమావేశం హైదరాబాద్‌లో జరిగిన తర్వాత తెలంగాణ అసెంబ్లీ చూపిన బాటను మరిన్ని రాష్ట్రాలు అనుసరిస్తాయని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును అన్యాయంగా తిరగరాస్తామంటే సహించేది లేదని స్పష్టం చేశారు.



విశ్వావసు నామ సంవత్సర డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ రూపొందించిన డైరీని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

గోర్‌బోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చే తీర్మానానికి సభ ఆమోదం

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లంబాడాలు, బంజారాలు మాట్లాడే 'గోర్‌బోలి' భాషను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. గోర్‌బోలి భాషకు లిపి లేకపోయినా 11 రాష్ట్రాల్లో మాట్లాడుతున్నారని ఆయన చెప్పారు. గోర్‌బోలి అంటే స్వభాష, మాతృభాష అనే అర్థం వస్తుందని మంత్రి తెలిపారు.

11 రోజులు.. 12 బిల్లులు

» బడ్జెట్ సమావేశాలు జరిగిన తీరిది



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ప్రారంభమైన శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారం ముగిశాయి. సెలవుదినాలు పోను మొత్తం 11 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు కొనసాగాయి. మొత్తం 97.32 గంటల పాటు సభ నడిచింది. సగటున రోజుకు ఎనిమిదిన్నర గంటల పాటు సభ కొనసాగింది. కొన్ని రోజులైతే అర్ధరాత్రి దాకా సమావేశాలు కొనసాగాయి. సభలో 12 బిల్లులకు, 3 ప్రభుత్వ తీర్మానాలకు ఆమోదం లభించింది. ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనమండలి కూడా ఆమోదం తెలిపింది. ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడ్డాయి.

సర్కారు ఖాతాతో కార్పొరేషన్ల రుణాల చెల్లింపా?

(మొదటిపేజీ తరువాయి)

లేదు కానీ, అసలు, వడ్డీ చెల్లింపులు మాత్రం దర్శనమిస్తున్నాయని తెలిపింది. ఇది ప్రభుత్వ ఖాతాలోని నిల్వపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ప్రభుత్వ అప్పులను తక్కువ చేసి చూపుతున్నట్లు అర్థమవుతుందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్థిక ఖాతాలపై కాగ్ రూపొందించిన నివేదికను ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టింది. రాష్ట్ర అప్పులు, గ్యారెంటీ అప్పులు, రాబడులు, వ్యయాలు, మూలధన వ్యయం తదితర అంశాలను కాగ్ వివరించింది. తీసుకున్న అప్పులకు సంబంధించి ప్రభుత్వ ఖాతాలో చాలా తక్కువ నిల్వ కనిపిస్తోందని తెలిపింది. 2024 మార్చి 31 నాటికి అప్పుల సొమ్ము నిల్వ రూ.969 కోట్లు మాత్రమే కనిపించాయని.. ఇందులో తెలంగాణ విద్యుత్తు ఆర్థిక సంస్థ రుణానికి సంబంధించి రూ.422 కోట్లు, ట్రాన్స్‌కో బాండ్లకు సంబంధించి రూ.502 కోట్లు ఉన్నాయని వివరించింది. ప్రతికూల నిల్వ వంటి పరిస్థితులు ఎదురవకుండా ఉండడానికి బడ్జెట్‌లో సరైన నిబంధనలను రూపొందించుకోవాలని సూచించింది.

ప్రభుత్వానికి గ్యారెంటీ ఫీజు/కమీషన్ ఏది?

కార్పొరేషన్లకు గ్యారెంటీలు ఇచ్చినందుకు ప్రభుత్వానికి రావాల్సిన గ్యారెంటీ ఫీజు/కమీషన్ కూడా సరిగా రావడం లేదని కాగ్ పేర్కొంది. ఒక కార్పొరేషన్‌కు గ్యారెంటీ ఇచ్చిన అప్పు మొత్తం సొమ్ముపై 0.5 శాతం లేదా గ్యారెంటీ వ్యవధిపై 2 శాతం చొప్పున ఫీజు/కమీషన్‌ను ఆ కార్పొరేషన్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. 2023-24లో ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలకు గాను కార్పొరేషన్ల నుంచి రూ.2,960 కోట్ల కమీషన్ రావాల్సి ఉండగా.. వచ్చింది మాత్రం రూ.3 కోట్లేనని కాగ్ వెల్లడించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తూ రావడం వల్ల 2023-24 నాటికి రాష్ట్ర అప్పు రూ.6,24,271 కోట్లకు చేరినట్లు తెలిపింది. ఇందులో ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకున్న అప్పుతోపాటు కార్పొరేషన్లు తీసుకున్నవి కూడా ఉన్నాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో 2023 మార్చి నాటికే రూ.3,50,520కోట్ల అప్పు ఉంది. కానీ, 2023-24లో మరో రూ.53,144కోట్ల తీసుకోవడంతో అది రూ.4,03,664కోట్లకు చేరింది. కార్పొరేషన్లు రూ.2,20,607 కోట్ల అప్పులు తీసుకున్నాయి.



గత ఐదేళ్లుగా తీసుకున్న అప్పులు(రూ.కోట్లలో) జీఎస్‌డీపీలో వాటి శాతాలు

సంవత్సరం	పాత అప్పు	ఆ ఏడాదిలో తీసుకున్న అప్పు	మొత్తం	జీఎస్‌డీపీలో శాతం
201920	194958	37223	232181	24
202021	234554	43464	278018	28
202122	277489	44122	321611	28
202223	309563	46923	356486	28
202324	350520	53144	403664	27

7.32-7.75 శాతం వడ్డీతో రుణాలు

2023-24లో ప్రభుత్వం 7.32 నుంచి 7.75 శాతం వరకు వార్షిక వడ్డీ రేట్లతో రుణాలు తీసుకుందని కాగ్ వెల్లడించింది. 50 సార్లు రుణాలను సేకరించిందని, మొత్తం రూ.49,618 కోట్ల అప్పు తీసుకుందని వివరించింది. ఈ అప్పును 2030-2051 సంవత్సరాల మధ్య తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇవి కాకుండా ఎల్ఐసీ, జీఐసీ, నాబార్డు వంటి సంస్థల నుంచి మరో రూ.910 కోట్ల రుణం తీసుకుందని వెల్లడించింది. పాత అప్పులు, వడ్డీల కింద రూ.12,194 కోట్లను తిరిగి చెల్లించిందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు, అడ్వాన్సుల కింద మరో రూ.1,948 కోట్లు రాష్ట్రానికి అందాయని పేర్కొంది. మరోవైపు స్వల్పకాలిక రుణాలైన వేస్ అండ్ మీన్స్‌ను కూడా ప్రభుత్వం సేకరించిందని తెలిపింది. వీటి కింద 2023-24లో రూ.98,097కోట్ల అప్పు తీసుకుందని వివరించింది. అందులో రూ.97,098 కోట్లను చెల్లించిందని, వెయ్యి కోట్లు చెల్లించలేదని పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వ కట్టడి..

రాష్ట్ర ప్రభుత్వ అప్పులను కేంద్ర ప్రభుత్వం కట్టడి చేస్తూ వస్తోంది. 2023-24కుముందు మూడేళ్ల రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా అప్పులు తీసుకోకుండా నియంత్రించినట్లు కాగ్ నివేదిక ద్వారా తెలుస్తోంది. 2020-21లో రూ.43,464 కోట్లను అప్పుగా తీసుకున్న ప్రభుత్వం.. 2021-22లో రూ.44,122 కోట్లను మాత్రమే తీసుకోగలిగింది. 2022-23లో కూడా మరో రూ.2,801 కోట్లను పెంచి రూ.46,923కోట్లను తీసుకోగలిగింది. 2023-24లో మరో రూ.6,221 కోట్లను పెంచి, రూ.53,144 కోట్లను తీసుకుంది.

ఆస్తుల సృష్టికి.. అప్పుల వినియోగమెంత?

తెచ్చిన అప్పులను పూర్తిగా ఖర్చు పెట్టని సర్కారు.. మూలధన అంచనా వ్యయంలో తగ్గుదల

పరిమితికి మించి అప్పు తెచ్చిన రాష్ట్రం: కాగ్

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెచ్చిన అప్పులను ఆస్తుల సృష్టికి వినియోగించకపోవడం ఏటా చర్చనీయంగా మారుతోంది. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా అప్పు తెచ్చిన మొత్తంతో మూలధన వ్యయం కింద ఆస్తులను సృష్టిస్తుంది. కానీ.. రాష్ట్రంలో 2019 నుంచి ఏనాడూ అప్పుల సొమ్మును ఆస్తుల సృష్టికి పూర్తిస్థాయిలో వినియోగించలేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గుర్తించింది. రాబడులు, వ్యయాల మధ్య అంతరం ఏర్పడినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల బాట పట్టడం సాధారణమే..! ఈ అప్పులను ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, భవనాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి. వీటి వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వానికి కూడా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా కొంత మేర రాబడి సమకూరే అవకాశాలుంటాయి. అందుకే.. అప్పులను తప్పకుండా మౌలిక సదుపాయాల కల్పనకే వినియోగించాలంటూ కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఆయా రాష్ట్రాలను ఆదేశిస్తుంటాయి. తెలంగాణలో మాత్రం అప్పులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడాన్ని కాగ్ తప్పుబట్టింది. ఇది వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం తాము అప్పులు చేసినా.. పెద్ద మొత్తంలో ఆస్తులను సృష్టించామని చెప్పేది. సాగునీటి ప్రాజెక్టులు, సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ వంటి భవనాలను నిర్మించామని ఆ పార్టీ నేతలు చెప్పేవారు. వాస్తవ వ్యయాలను చూస్తే మాత్రం.. తెచ్చిన అప్పులను పూర్తిస్థాయిలో మూలధన వ్యయం కింద ఖర్చు పెట్టినట్లు కనిపించడం లేదని కాగ్ ఆక్షేపించింది.



ఆశించిన మేర రాని రాబడులు

రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిన మేర రాబడులు సమకూరడం లేదని కాగ్ వెల్లడించింది. భారీ మొత్తంలో అంచనాలను రూపొందిస్తున్నప్పటికీ.. సంవత్సరాంతానికి ఆదాయాలు లక్ష్యం మేర రావడం లేదని తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడులు 78% మేర సమకూరాయని వివరించింది. రెవెన్యూ రాబడుల అంచనా రూ.2,16,567 కోట్లుగా ఉంటే.. రూ.1,69,293 కోట్లు(78%) సమకూరాయి. రెవెన్యూ వ్యయం కింద రూ.2,11,685 కోట్లను ఖర్చు చేస్తామని ప్రభుత్వం అంచనా వేయగా.. ఆ సంవత్సరం రూ.1,68,514 కోట్ల(90%)ను మాత్రమే వ్యయం చేయగలిగింది. ఇది కేవలం ఆ ఒక్క సంవత్సరంలోనే కాదు.. అంతకుముందు కూడా అంచనాల కంటే తక్కువగా ప్రభుత్వం వ్యయం చేసిందని కాగ్ వెల్లడించింది. అప్పుల కిస్తీలు, వడ్డీ చెల్లింపులకే ప్రభుత్వం 15.90% మేర నిధులను వెచ్చించిందని కాగ్ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.49,977 కోట్ల ఆర్థిక లోటు ఏర్పడడం వల్ల.. దాన్ని పూడ్చుకోవడానికి రూ.40,957 కోట్ల అప్పు తీసుకున్నట్లు గుర్తుచేసింది. ఆగంతుక నిధి నుంచి రూ.కోటి, ప్రభుత్వ ఖాతా నుంచి రూ.8,984 కోట్లను సేకరించిందని వివరించింది. మొత్తం రెవెన్యూ రాబడులు రూ.1,69,293 కోట్లలో 41% నిధులను వేతనాలు, భత్యాలు, వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చుచేయాల్సి వచ్చిందని తెలిపింది. జీతభత్యాలకు రూ.27,981 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.24,347 కోట్లు, పెన్షన్లకు రూ.16,835 కోట్లు చెల్లించిందని వివరించింది. వడ్డీ చెల్లింపులు(రూ.24,347 కోట్లు-10.5%), అప్పుల కిస్తీల చెల్లింపులు(రూ.12,519 కోట్లు- 5.4%) మేర.. మొత్తం 15.9% ఉన్నాయని ఆక్షేపించింది.

అప్పు-మూలధన వ్యయం తీరు (రూ.కోట్లలో)

సంవత్సరం	అప్పు	మూలధన వ్యయం
201920	38,285	25,559
202021	47,132	26,790
202122	46,995	28,883
202223	41,560	17,881
202324	50,528	43,918

అంచనాలు.. వాస్తవ వ్యయాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	అంచనా వ్యయం	వాస్తవ వ్యయం	గ్యాప్
201920	1,11056	1,08,797	2,259
202021	1,38,670	1,23,212	15,458
202122	1,80,250	1,36,803	43,447
202223	1,89,275	1,53,407	35,868
202324	2,34,531	1,68,514	66,017

జీఎస్‌డీపీలో పరిమితికి మించి అప్పులు..

2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) పరిమితికి మించి అప్పు చేసిందని కాగ్ ఆరోపించింది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం నిబంధనల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీలో రాష్ట్ర అప్పుల మొత్తం 33.10 శాతానికి మించకూడదు. కానీ.. ఆ సంవత్సరం అప్పుల మొత్తం జీఎస్‌డీపీలో 34.47శాతాని(రూ.5,17,659 కోట్ల అప్పు)కి చేరాయని కాగ్ తప్పుబట్టింది. జీఎస్‌డీపీలో ఆర్థిక లోటు(ఫిస్కల్ డెఫిసిట్) కూడా 3 శాతానికి మించకూడదు. కానీ.. రూ.49,977 కోట్ల లోటుతో 3.33 శాతానికి చేరడాన్ని కాగ్ ఆక్షేపించింది.

స్థానిక సంస్థలకు రూ.13,690 కోట్ల గ్రాంట్లు: కాగ్

రాష్ట్రంలోని పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.13,690 కోట్ల గ్రాంట్లను మంజూరు చేసిందని కాగ్ వెల్లడించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థలు, ఎన్‌జీవోలు, ఇతర సంస్థలన్నింటికీ చెల్లించిన మొత్తం గ్రాంట్ల(రూ.76,773 కోట్లు)లో పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థలకు చెల్లించిందే 18 శాతమని వివరించింది.

'పది' ప్రశ్నల లీకేజీలో 11 మందిపై కేసు

» 8 మంది అరెస్టు.. పరారీలో ముగ్గురు: కామారెడ్డి ఎస్పీ

కామారెడ్డి, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష కేంద్రం నుంచి గణిత ప్రశ్నా పత్రంలోని కొన్ని ప్రశ్నలు లీక్ అయిన కేసును కామారెడ్డి పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. పలు ప్రశ్నలు బయటకు రావడానికి, అవి సోషల్ మీడియాలో వైరల్ కావడానికి కారణమైన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. కామారెడ్డిలో గురువారం కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థి బుధవారం జరిగిన గణితం పేపర్‌లో మంచి మార్కులు పొందేందుకు తన తండ్రి జాదవ్ సంజయ్ సహాయం కోరాడు. కాగితంపై కొన్ని ప్రశ్నలు రాయించుకొని వచ్చేలా అదే పాఠశాలలో పనిచేస్తున్న వాటర్‌మ్యాన్ సయ్యద్ ముబీన్‌తో సంజయ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. సంజయ్ చెప్పినట్లుగా 5 ప్రశ్నలను రాయించుకున్న ముబీన్.. బయటకు వచ్చి సంజయ్‌కు ఇచ్చాడు. అతని వద్ద ఉన్న కాగితాన్ని మనోజ్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి ఒకరికి వాట్సాప్‌లో షేర్ చేయగా.. ఆ తర్వాత అది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మేరకు సంజయ్, ముబీన్, మనోజ్ సహా పలువురిపై కేసు నమోదైంది. వీరిలో 8 మందిని అరెస్టు చేశామని, ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.

రాష్ట్రంలో 14 నూతన ఎక్సైజ్ స్టేషన్‌లు

» ఏప్రిల్ 1 నుంచి విధుల నిర్వహణకు రంగం సిద్ధం

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 14 నూతన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘ్వీ, కమిషనర్ చెర్యూరు హరికిరణ్‌లు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త స్టేషన్‌ల ద్వారా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని శాఖ అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు.. ఆయా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. కొత్తగా హైదరాబాద్‌లో 13 స్టేషన్లు, వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో ఒక స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. పాత ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలే ప్రస్తుతానికి కొత్తగా ఏర్పడిన స్టేషన్‌లకు ఇన్‌చార్జులుగా ఉంటారని, కొన్ని సందర్భాల్లో సీనియర్ ఎస్సైలకు అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అర్ధరాత్రి కరెంట్ కట్ చేయం

» తప్పుడు ఎస్ఎంఎస్‌లను నమ్మొద్దు: ఎస్పీడీసీఎల్ సీఎండీ

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించకపోతే రాత్రిపూట విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని బెదిరిస్తూ వచ్చే ఎస్ఎంఎస్, కాల్స్ నమ్మిమోసపోవద్దని వినియోగదారులకు తెలంగాణ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ సూచించారు. పెద్దసంఖ్యలో వినియోగదారులు ఇలాంటి మోసపూరిత ఎస్ఎంఎస్‌లు, కాల్స్ అందుకోవడంతో వారిని అప్రమత్తం చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. తాము వినియోగదారుల నుంచి బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డుల వివరాలను అడగబోమని, ఎలాంటి వెబ్‌లింక్‌ను పంపించబోమని స్పష్టం చేసింది.

కరెంట్ ఛార్జీల సవరణ లేకుండా నేడు 'టారిఫ్'

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కరెంట్ ఛార్జీల సవరణ లేకుండానే శుక్రవారం టారిఫ్ ఉత్తర్వులు వెలువడనున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను డిస్కమ్‌లు దాఖలు చేసిన ఏఆర్ఆర్(వార్షిక ఆదాయ అవసరాల)పై రాష్ట్రవ్యాప్తంగా 3 చోట్ల తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) బహిరంగ విచారణలు జరిగాయి. ఏప్రిల్ 1నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుండటంతో ఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున టారిఫ్ ఆర్డర్ వెలువరించనున్నారు.

ఆన్‌లైన్‌లో భద్రాద్రి రామయ్య కల్యాణ తలంబ్రాలు

భద్రాచలం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలను ఆన్‌లైన్ ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 30 నుంచి ఆన్‌లైన్‌లో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల పరిధిలోని వారికి మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఒక ప్యాకెట్‌కు రూ.60 చెల్లిస్తే నవమి ఉత్సవాలు పూర్తయ్యాక తలంబ్రాలను పోస్టులో పంపుతామని తెలిపారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నిర్మల: చామల


న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రుణమాఫీకి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో ఏకకాలంలో రూ.21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని గుర్తు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా ఆ వివరాలు కావాలంటే 2 నిమిషాల్లో తెప్పించుకోవచ్చన్నారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఆర్థికమంత్రికి ఒక రాష్ట్రంలో రుణమాఫీ గురించి తెలియదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

రోహింగ్యాలతో హైదరాబాద్‌లో శాంతిభద్రతలకు భంగం: రఘునందన్‌రావు

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అక్రమంగా ఉంటున్న రోహింగ్యాల వల్ల శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. భాగ్యనగరంగా పేరుగాంచిన హైదరాబాద్ వారి వల్ల అభాగ్యనగరంగా మారుతుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం లోక్‌సభలో ఇమ్మిగ్రేషన్ బిల్లుపై ఎంపీ మాట్లాడారు. చిన్న పట్టణమైన సదాశివపేటలో కూడా జనవరిలో 20 మంది బంగ్లాదేశీయులు అరెస్టు అయ్యారని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లోనూ బంగ్లాదేశీయుల, రోహింగ్యాల అక్రమ చొరబాట్లు పెరిగాయన్నారు. గత యూపీఏ సర్కారు దేశభద్రతను గాలికొదిలేసి రాజకీయం పబ్బం గడుపుకుందని విమర్శించారు.

కొడాలి నాని గుండెలో మూడు బ్లాక్‌లు

హైదరాబాద్ సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుడివాడ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఏఐజీ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. హృదయ సంబంధిత సమస్యతో ఆయన బుధవారం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఐసీయూలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కొన్ని పరీక్షల అనంతరం ఆయన గుండెకు వెళ్లే రక్తనాళాల్లో మూడు బ్లాక్‌లు ఉన్నట్లు గుర్తించారు. మరిన్ని పరీక్షలు చేయాలని వైద్యులు తెలిపారు.





ధర్మసాగర్ చెరువులోకి చేరుతున్న దేవాదుల నీరు; గోదావరి జలాలకు పూజలు చేస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, ఎమ్మెల్యే కడియం తదితరులు

దేవాదుల ప్రారంభం

మోటార్ స్విచ్చాన్ చేసిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి.. 2026 డిసెంబరు కల్లా పూర్తి చేస్తామని వెల్లడి

వరంగల్/హనుమకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎట్టకేలకు హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవన్నపేటలో దేవాదుల మూడోదశ పంప్‌హౌజ్ వద్ద ఒక మోటార్ రన్ ప్రారంభమైంది. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా మోటార్ స్విచ్చాన్ చేయడంతో ధర్మసాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు పరుగులు తీశాయి. అక్కడనుంచి మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి ధర్మసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకుని గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఒక మోటార్ రన్ ప్రారంభించడంతో కరువుతో అల్లాడుతున్న జనగామ, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సుమారు 65 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. మరో 15 రోజుల్లో దేవన్నపేట పంప్‌హౌజ్ వద్ద రెండో మోటార్ ప్రారంభించి 600 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తామన్నారు. మోటార్లు 15-20 రోజులు నడపాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం రైతులను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దేవాదుల పూర్తి కాలేదని ఆరోపించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి చేస్తుందన్నారు. గత సర్కార్ కొత్త ప్రాజెక్టులకే భారీగా నిధులు ఖర్చు చేసిందని, కొద్దిపాటి నిధులతో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయొచ్చన్న ఆలోచనే చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అందరి సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

ట్రయల్ రన్ పదనిసలు

దేవాదుల దేవన్నపేట పంప్‌హౌజ్ మోటార్ ట్రయల్ రన్ కోసం మేఘా కంపెనీ ఇంజనీర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఇంజనీర్లు పది రోజులు తీవ్రంగా శ్రమించారు. గత నెల 18న మోటార్ రన్ కోసం దేవన్నపేటకు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వచ్చారు. కానీ మోటార్ మొరాయించడంతో వెనుదిరిగారు. నాటి నుంచి ఇంజనీర్లతోపాటు ఆస్ట్రియాకు చెందిన అన్‌రీజ్ కంపెనీ నిపుణులు శ్రమించడంతో గురువారం తెల్లవారుజామున 2.30గంటలకు మోటార్ ట్రయల్ రన్ ప్రారంభమైంది. ఈ సంగతి తెలియగానే మంత్రులు ఉత్తమ్, పొంగులేటి.. గురువారం సాయంత్రం హెలికాప్టర్‌లో దేవన్నపేటకు చేరుకున్నారు. మంత్రులు రాగానే మళ్లీ మోటార్ మొరాయించడంతో ఆందోళనకు గురయ్యారు. తిరిగి సాంకేతిక నిపుణులు గంటసేపు శ్రమించి సమస్య పరిష్కరించారు.

అధికారిక కార్యక్రమానికి నన్ను పిలువరా?

దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పంప్‌హౌస్ ప్రారంభ కార్యక్రమానికి తనకు ఆహ్వానం పంపని అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాదకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవాదుల ప్రాజెక్టులో 40 శాతం తన నియోజకవర్గ పరిధిలోనికి వస్తుందని తెలిపారు.

దొడ్డు బియ్యం ఎవరూ తినట్లేదు

» అందుకే సన్నబియ్యం పంపిణీ: ఉత్తమ్

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వాలు నలభైయేళ్లుగా దొడ్డు బియ్యాన్ని సరఫరా చేస్తున్నాయని, కానీ ఆ బియ్యాన్ని పది శాతం మంది కూడా తినడం లేదని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఈనెల 30 నుంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ నుంచి ప్రారంభించబోతున్న సందర్భంగా ఆ కార్యక్రమ ఏర్పాట్లను గురువారం మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తొలిసారిగా తెలంగాణలో సన్నబియ్యం అందించబోతున్నామన్నారు. దాదాపు రూ.8 వేల కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 2.84 కోట్ల మందికి లబ్ధి చేకురుతుందని తెలిపారు. ఉగాది సందర్భంగా ఈ నెల 30న స్థానిక నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారన్నారు.

బెయిల్ ఇవ్వలేం

» వంశీ పిటిషన్‌ను తిరస్కరించిన సీఐడీ కోర్టు



విజయవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి విజయవాడ సీఐడీ కోర్టు ఝలక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. వంశీతో పాటు మరో నలుగురు నిందితులకు బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయాధికారి తిరుమలరావు గురువారం తీర్పు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసును కూటమి ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టయి, రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని సీఐడీ పోలీసులు పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులోనూ ఆయన రిమాండ్‌లో ఉన్నారు. తమకు బెయిల్ మంజూరు చేయాలని కోర్టులో వంశీతో పాటు క్రైలే శివకుమార్(ఏ29), క్రైలే ఆదిలక్ష్మి(ఏ28), ప్రవీణ్(ఏ54), రేచర్ల రూతమ్మ(ఏ68) పిటిషన్ వేశారు.

సజ్జల, భార్గవ్‌లకు ముందస్తు బెయిల్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్‌రెడ్డిలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేలతో ఒక్కొక్కరూ రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం తీర్పు ఇచ్చారు. సజ్జల, ఆయన కుమారుడు ఇచ్చిన స్క్రిప్ట్, ప్రోత్సాహంతోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వారి కుటుంబసభ్యులు, కమ్మ సామాజికవర్గంపై అసభ్య పదజాలంతో దూషించానంటూ సినీనటుడు పోసాని కృష్ణ మురళి నేరాంగీకార వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. దీని ఆధారంగా ఓబుళవారిపల్లె పోలీసులు అరెస్ట్ చేస్తారని భయంగా ఉందని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించారు.

సరుకు రవాణాలో ఎస్‌సీఆర్ రికార్డు

» ఐదు రోజుల ముందే గతేడాది రికార్డు బ్రేక్

హైదరాబాద్ సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) సరికొత్త రికార్డు నెలకొల్పింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రికార్డును ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఐదు రోజుల ముందే(బుధవారం నాటికే) బ్రేక్ చేసింది. గతేడాది 141.114 టన్నుల సరుకు రవాణా చేసిన ఎస్‌సీఆర్.. ఈ ఏడాది ఐదు రోజులు ముందు 141.133 టన్నుల సరుకు రవాణాతో గత రికార్డులను అధిగమించింది. ఏయేటికాయేడు తన రికార్డులను తానే అధిగమిస్తూ ఎస్‌సీఆర్.. బలమైన కార్యాచరణ సామర్థ్యం ప్రదర్శిస్తోంది. సరుకు రవాణాలో సరికొత్త రికార్డు సాధించడం పట్ల ఎస్‌సీఆర్ ఉన్నతాధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు రాహుల్ సలహాలివ్వాలి

» వకుళాభరణం కృష్ణమోహన్

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తగిన సలహాలు ఇవ్వాలని, అలాగే బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. కేంద్రంపై నెపం వేసి సరిపెట్టుకోకుండా స్పష్టమైన రాజకీయ ఆచరణతో రిజర్వేషన్ల అమలు జరిగేలా చూడాలని రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కృష్ణమోహన్‌రావు మాట్లాడారు. రాజ్యాంగంలోని 243డీ(6), 243టీ(6) ఆర్టికల్స్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఇంద్రా సహానీ కేసులో సుప్రీంకోర్టు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని సూచించినప్పటికీ ప్రత్యేక పరిస్థితుల్లో ఈ పరిమితిని మించవచ్చని పేర్కొన్నట్లు తెలిపారు.

జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించండి: ఎంపీ వద్దిరాజు

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలని కేంద్రాన్ని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. కొవిడ్ సమయంలో రైల్వే పాసులను రద్దు చేశారని, వాటిని మళ్లీ ఇవ్వాలన్నారు. ఈ మేరకు గురువారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. అనంతరం ఇదే విషయమై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల్లో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి వారేనని.. రైల్వే టికెట్లలో వారికి 50 శాతం రాయితీ కల్పించడం సమంజసమేనని పేర్కొన్నారు. అలాగే వేములవాడ రాజన్న సన్నిధి బైపాస్ రోడ్డు సమీపంలోని ప్రతిపాదిత రైలు మార్గంలో భూములు కోల్పోయిన రైతులకు సముచిత నష్టపరిహారం ఇవ్వాలని మరో వినతిపత్రం అశ్వినీ వైష్ణవ్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని రవిచంద్ర మీడియాకు తెలిపారు.

భూముల అమ్మకాలను ఆపండి

» కంచ గచ్చిబౌలి స్థలాన్ని వేలం వేయొద్దు

» సీఎంకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వనరుల సమీకరణ పేరిట తెలంగాణ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) ద్వారా ప్రభుత్వ భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామంలోని 400ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. అదే విధంగా గురువారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు. ఆ భూమి అటవీ శాఖ పరిధిలోకి రానప్పటికీ.. పచ్చని చెట్లు, వైవిధ్యమైన జీవజాతులతో నగరానికి ఊపిరులూదే ఆక్సిజన్ వనరుగా ఉందని.. అలాంటి చోటును కాంక్రీట్ నిర్మాణాలతో నింపేస్తే పర్యావరణానికి, హైదరాబాద్‌కు భారీ ముప్పు చేకూరే అవకాశం ఉందన్నారు. "మనం బతకడానికి, మన సోకులకు ప్రభుత్వ భూములను అమ్మొద్దు. అదే జరిగితే భవిష్యత్తులో ప్రజల అవసరం కోసం విద్యాలయాలు, ఆస్పత్రుల వంటివి నిర్మించాలంటే కష్టమవుతుంది. చివరకు శ్మశానాలకు కూడా భూమి లేని పరిస్థితి ఉంటుంది" అని రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అన్న మాటలను కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. "కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న భూమికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో 734 వృక్ష జాతులు, నెమళ్లు సహా 220 పక్షి జాతులు, వలస పక్షులు, మచ్చల జింకలు, కొమ్ముల జింకలు, అడవి పందులు, కొండచిలువలు, భారతీయ నక్షత్ర తాబేళ్లు వంటి వైవిధ్య జీవజాతులన్నాయి. సహజ సిద్ధంగా ఏర్పడి రాళ్ల అమరికలెన్నో ఉన్నాయని అనేక మంది ప్రముఖులు చెబుతున్నారు" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

జాతీయ పార్కుగా ప్రకటించండి

కంచ గచ్చిబౌలి పరిధిలో ఉన్న భారతీయ నక్షత్ర తాబేళ్లకు, వాటి ఆవాసాలకు ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరమని కిషన్‌రెడ్డి అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 ప్రకారం భారతీయ నక్షత్ర తాబేళ్లు సంరక్షించవలసిన జీవజాతుల కిందకు వస్తాయని, ఈ చట్టం కింద ఆయా జీవజాతులను, వాటి ఆవాసాలను సంరక్షించాలని కోరారు. వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న 400 ఎకరాల భూమిని, దానిని ఆనుకుని ఉన్న 800 ఎకరాల స్థలాన్ని కలిపి జాతీయ ఉద్యానవనంగా ప్రకటించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. హైదరాబాద్‌లో ఆట స్థలాలు, పార్కులు, పర్యావరణ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని.. భవిష్యత్తు తరాల కోసం కొంతయినా ఈ ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కిషన్‌రెడ్డి అన్నారు.

రూ.1090 కోట్ల పనులకు మూడు సంస్థల బిడ్లు!

కేబీఆర్ పార్కు చుట్టూ రెండు ప్యాకేజీలుగా పనులు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వం చేపట్టిన 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ('హెచ్-సిటీ)' ప్రాజెక్టుల్లో కీలక అడుగు పడింది. కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి మూడు సంస్థలు ముందుకు వచ్చాయి. రూ.580 కోట్లతో ప్యాకేజీ-1లో భాగంగా జూబ్లీ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం, ముగ్ధ జంక్షన్ల వద్ద; రూ.510 కోట్లతో ప్యాకేజీ-2లో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నంబరు-45, ఫిల్మ్‌నగర్, మహారాజ అగ్రసేన్, క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ల వద్ద ప్రాజెక్టుల కోసం ఫిబ్రవరి 22న జీహెచ్ఎంసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. బుధవారం సాయంత్రం గడువు ముగియగా.. బల్దియా అధికారులు టెండర్ బాక్స్ తెరిచారు. ఎం.వెంకట్‌రావు(ఎంవీఆర్), మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) బిడ్ వేశాయి. సాంకేతిక, ప్రైస్ బిడ్ పరిశీలన ప్రారంభమైంది. కాగా, సాంకేతికంగా ఆయా సంస్థలకు ప్రాజెక్టులు నిర్మించే అర్హత ఉందా..? అన్నది మొదట పరిశీలించనున్నారు. అనంతరం అర్హత ఉన్న సంస్థల్లో తక్కువ కోట్ చేసిన రెండు సంస్థలను ఎంపిక చేసి.. కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ)కు పంపుతారు. సీవోటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత వివరాలు ప్రభుత్వానికి వెళ్తాయి. సర్కారు ఆమోదం అనంతరం ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు నెలన్నర నుంచి రెండు నెలలు పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ లోపు పార్కు చుట్టూ ఆస్తుల సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.